ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org
సోమవారం 15.06.2026 | సంపుటి :12 సంచిక : 326 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# వర్షం..ఆపద సమయం

**అధికారులంతా రోడ్లపై ఉండాలి • అవసరమైతే నేను కూడా వస్తా**



వర్షం సమయంలో ట్రాఫిక్ ఉన్నతాధికారుల నుంచి కింద స్థాయి సిబ్బంది వరకు రోడ్ల పైన ఉండాల్సిందే.. అవసరం అయితే నేను కూడా రోడ్డు పైకి వస్తా.. ఫీల్డ్‌లో ఉండని అధికారుల పైన కఠిన చర్యలు తీసుకోవాలి. వర్షం వల్ల ట్రాఫిక్ జామ్ అయితే కఠిన చర్యలు తప్పవు మానవ తప్పిదాల వల్ల సమస్యలు వస్తే సహించేది లేదు. ట్రాఫిక్ డిపార్ట్మెంట్‌లో తక్షణమే ఖాళీలు పూర్తి చేయాలిజ రైతు వేదికలను యూరియా పంపిణీ కోసం ఉపయోగించు కోవాలి. రైతు వేదికలో యూరియా పంపిణీ బాధ్యతను స్థానిక అగ్రికల్చర్ అధికారికి అప్పగించాలి. యూరియా పంపిణీ లో రెవిన్యూ సిబ్బందిని భాగస్వామ్యం చేయాలి – సీఎం రేవంత్ రెడ్డి

- వర్షం కారణంగా ట్రాఫిక్ జామైతే సహించను
- అలసత్వం ప్రదర్శించే అధికారులపైన కఠిన చర్యలు
- కోర్ అర్బన్ రీజియన్‌లో మరింత అప్రమత్తంగా ఉండాలి
- వర్షాలపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**హైదరాబాద్(జనంసాక్షి):**వర్షాల సమయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన తేల్చిచెప్పారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ, వాతావరణ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.జూన్ 9న కోర్ అర్బన్ రీజియన్‌లో వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సైబరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో నగరవాసులు ఇబ్బందులు పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు .

మిగతా 2లో..



## మునీర్ స్ఫూర్తితో సింగరేణిని పరిరక్షిస్తాం

- కార్మికుల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యం
- కార్మిక శాఖా మంత్రి వివేక్ వెంకటస్వామి

12లో..

సింగరేణి సంస్థను పరిరక్షించే బాధ్యతను తాను,తమ ప్రభుత్వం తీసుకుంటుందని కార్మిక,గనుల శాఖా మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి హామీ ఇచ్చారు.ఆదివారం మందమర్రిలో సీనియర్ జర్నలిస్ట్ మునీర్ పై రాసిన మునీర్ భాయ్ పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్య ఆవిష్కర్తగా హాజరై ప్రసంగించారు.ఆ మునీర్ స్ఫూర్తితోనే సింగరేణి పరిరక్షణకు అందరమూ కలసి కృషి చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ ఉద్యమంలో మునీర్ కృషి ఎంతగానో ఉందన్నారు.ఎంత నిక్కచ్చిగా వార్తలు రాసేవాడో అంటే నిఖార్సుగా మనుషుల పట్ల ప్రేమాభిమానాలతో ఉండేవాడన్నారు.మానవ హక్కుల పట్ల,కార్మిక పోరాటాల పట్ల అతని నిబద్ధత వెలకట్టలేనిదన్నారు.అతని కుటుంబానికి పెన్షన్ ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు.

## వారంలో రోజుల్లో వర్షాలు

- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- 18 – 20 మధ్య భారీ వర్షాలు కురిసే అవకాశం
- వాతావరణ శాఖ వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):**రాగల ఏడు రోజుల్లో తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయిన హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, మధ్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అలాగే రాబోయే రెండు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని తెలిపింది. ఆ తర్వాత మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు క్రమంగా రెండు నుంచి

మిగతా 2లో..



### సుస్థిర భవిష్యత్తు, ప్రపంచం మేలు కోసం
## భారత్ ఆవిష్కరణలు

ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా నీస్ నగరంలో నిర్వహించిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమంలో ప్రధాని మోదీ



**పారిస్(జనంసాక్షి):**భారత డీఎన్ఏలోనే ఇన్నోవేషన్ ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా నీస్ నగరంలో నిర్వహించిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సుస్థిర భవిష్యత్తు, ప్రపంచం మేలు

మిగతా 2లో..

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందే..



- హైదరాబాద్‌లో కాక్రోచ్ జనతా పార్టీ నిరసన ప్రదర్శన
- పర్యావరణవేత్త, ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్ తదితరులు

**హైదరాబాద్(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన కాక్రోచ్ జనతా పార్టీ.. హైదరాబాద్‌లో నిరసన చేపట్టింది. పరీక్షా పత్రాల లీకేజీలు, విద్యావ్యవస్థలోని అవకతవకలను నిరసిస్తూ ధర్నాచౌక్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించింది. పర్యావరణవేత్త, ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరులతోపాటు యువత పెద్దఎత్తున పాల్గొంది. నీట్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ.. "దేశంలో ఎంతో సంపద ఉంది. అదంతా ఎక్కడికి వెళ్తోంది? దేశంలో నిరుద్యోగ పరిస్థితి ఎందుకు నెలకొంది? యువతను కాక్రోచ్‌లుగా పేర్కొనడం ఏంటి? దేశంలో ఆరు శాతం మంది యువతకు మాత్రమే నైపుణ్యాలు ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

మిగతా 2లో..

### కార్పొరేట్‌కు దీటుగా..
## గురుకుల పాఠశాలల్లో దొరబాబుల్లా మన పిల్లలు



**మఫత్‌లాల్ యూనిఫాం.. మన్నికైన షూ..**
**ఈ ఏడాది విద్యార్థులకు నాణ్యమైన సామగ్రి పంపిణీ**
**గురుకులాల విద్యార్థులకు కిట్ల అందజేత**
**కిట్‌లో బెల్టు, టై, స్కూల్ బ్యాగ్, బూట్లు... బెడ్డింగ్ సామగ్రి**

మొత్తం 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంకు సంబంధించి 2.97 కోట్ల మీటర్ల వస్త్రం కొనుగోలుకు ప్రభుత్వం ఉత్తర్వు లు ఇచ్చింది. మఫత్‌లాల్ కంపెనీ 2.41 కోట్ల మీటర్లు, తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంస్థ 55.32 లక్షల మీటర్ల వస్త్రం సరఫరా చేస్తున్నాయి. ఈ దఫా విద్యార్థులకు యూనిఫాం రంగులను ప్రభుత్వం మార్చింది .యూనిఫాం కుట్టు పనిని మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం అప్పజెపింది. ఈ పనితో సంఘాల్లోని మహిళలకు సుమారు రూ.40 కోట్లకుపైగా ఆదాయం సమకూరనుంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన సామగ్రితో కూడిన కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది

- ఇప్పటికే పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు
- యూనిఫాం కుట్టు పనిలో నిమగ్నమైన మహిళా స్వయం సంఘాల సభ్యులు
- తొలిసారిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బ్యాగు, బెల్టు, టై, బూట్లు, సాక్సులు
- విద్యా రంగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ

**హైదరాబాద్(జనంసాక్షి):**ప్రైవేటు..కార్పొరేట్ స్కూల్ విద్యార్థులు ధరించే మన్నికైన యూనిఫాంలు.. వారికి ఏమాత్రం తీసిపోని విధంగా బ్రాండెడ్ షూ.. సాక్సులు.. టై, బెల్టులు ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులకు అందనున్నాయి.. నాణ్యమైన వస్త్రం సరఫరా అయితేనే యూనిఫాంలు ఎక్కువ రోజులు మన్నుతాయి. అందుకే విద్యార్థులకు అందజేసే యూనిఫాంలకు సంబంధించి వస్త్రం సరఫరా మొదలు కుట్టు పని వరకు ప్రతి దశలోనూ నాణ్యతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని రకాల పాఠశాలలు, గురుకులాల్లోని

మిగతా 2లో..

## అమెరికా ఎంత చేబితే అంత..



**ట్రంప్ కనుసన్నల్లో మోదీ • రాహుల్ ఆరోపణ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అమెరికా దాడుల్లో భారతీయ నావికులు మరణించడంపై కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులపై ప్రధాని మోదీ మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. అగ్రరాజ్యం ఆంక్షలకు ఆయన లొంగిపోయారంటూ ఎక్స్ వేదికగా విమర్శించారు. ఒమన్ తీరంలో భారతీయులు ఉన్న నౌకలపై అమెరికా దాడులు చేయడంతో ముగ్గురు దేశీయ నావికులు మరణించిన సంగతి తెలిసిందే. దాడులపై నిరసన తెలియజేస్తూ భారత విదేశాంగ మంత్రి ఎస్ జయశంకర్ అమెరికా సెక్రటరీ మార్క్ రూబియోతో మాట్లాడారు. ఈ క్రమంలోనే వాణిజ్య నౌకలు యూఎస్

మిగతా 2లో..

## సంయమనం పాటించండి



- ఎవరూ దాడులు చేసుకోవద్దు
- బీరుట్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడిని తప్పుపట్టిన ట్రంప్

**వాషింగ్టన్(జనంసాక్షి):**లెబనాన్‌లోని బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పుబట్టారు. ఇరుపక్షాలు స్వీయ నియంత్రణ పాటించాలని ఆయన కోరారు. ఇరాన్‌తో శాంతి ఒప్పంద చర్చలు సమీపిస్తున్న తరుణంలో బీరుట్‌పై ఈ దాడి జరిగి ఉండాల్సింది కాదంటూ తన సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. తనను తాను రక్షించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని ట్రంప్ అన్నారు. అయితే, ప్రత్యర్థి చేసిన దాడి

మిగతా 2లో..

## ఒమన్ తీరంలో భారత నౌక మునక

14 మంది సిబ్బంది సురక్షితం

12లో..



## రష్యా చమురు కేంద్రాలపై ఉక్రెయిన్ దాడి

12లో..

### మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తే
## రాజీనామా చేస్తా

**ఖైరతాబాద్ నియోజకవర్గానికి త్వరలో ఉపఎన్నిక :కేటీఆర్**



**హైదరాబాద్(జనంసాక్షి):** రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తా అంటుండు.. నువ్వు కోటీశ్వరులను చేసుడు దేవుడెరుగు.. నువ్వు ముందైతే లక్షాధికారులు చెయ్. ఒక్కొక్క ఆడబిడ్డకు లక్షా 50 వేలు ఇస్తా అని చెప్పినవ్ కదా.. నువ్వు కోటి మంది ఆడబిడ్డలకు ఇస్తే నేను రాజీనామా చేసి పోతా అని రేవంత్ రెడ్డికి చెబుతున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి

మిగతా 2లో..

## అగ్నిప్రమాదం వదంతులతో పట్టాలపైకి..


రైలు ఢీకొని నలుగురి మృతి

2లో..

## బావిలోకి దూసుకెళ్లిన వ్యాను

ఎనిమిది మంది మృతి

మహారాష్ట్ర సోలాపూర్ జిల్లాలో తాండుల్వాడి సమీపంలో ఘటన



2లో..

## కృష్ణా నదిలో పడవ బోల్తా..

- నలుగురు మృతి
- పల్నాడు జిల్లా కోనూరులో విషాదం

## సుస్థిర భవిష్యత్తు, ప్రపంచం మేలు కోసం భారత్ ఆవిష్కరణలు

కోసం భారత్ ఆవిష్కరణలు చేస్తోందన్నారు. తమ దేశానికి చెందిన యువ ఆవిష్కర్తలు సమస్త మానవాళికి ప్రయోజనాలు చేకూర్చే పరిష్కారాలను కనుగొంటున్నారని తెలిపారు."కృత్రిమ మేధ రంగంలో భారత్‌కు అపారమైన సామర్థ్యం ఉంది. మేం చేపట్టిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' ఆగదు.. అది నిరంతరం సాగుతూనే ఉంటుంది. మా దేశంలో 2 లక్షలకు పైగా స్టార్టప్‌లున్నాయి. ఇవి దేశంతోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకూ బలాన్నిస్తున్నాయి. మా దేశం ఆవిష్కరణలను వినియోగించుకునే దేశం మాత్రమే కాదు.. ఆ రంగానికి సహకారం అందించేదిగానూ ఆవిర్భవించింది" అని మోదీ పేర్కొన్నారు.ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ మాట్లాడుతూ.. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రశంసించారు. తమ దేశం కూడా వివిధ రంగాల్లో ఇందులో భాగస్వామిగా ఉందన్నారు. భారత్‌ను 'ఆవిష్కరణల దేశం'గా పేర్కొన్నారు. ఏఐ, వాతావరణ మార్పుల వంటి కీలక రంగాల్లో ఇరుదేశాల మధ్య దృఢమైన భాగస్వామ్యం ఉందని చెప్పారు. పౌర అణుశక్తి రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించుకోవడానికి ఆస్కారం ఉందన్నారు.

## అమెరికా ఎంత చెబితే అంత..

మిలిటరీ ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలని, ఇరాన్‌పై ఉన్న అమెరికా దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తే సహించబోమని రూబియో అన్నారు. ఈ వ్యాఖ్యలను రాహుల్ ప్రస్తావిస్తూ.. 'అమెరికా ఆదేశాలను ఏ దేశం సహించదు. కానీ మన రాజీపడ్డ ప్రధాని అగ్రరాజ్యం ఆంక్షలకు లొంగిపోయారు. విదేశీ అధికారం భారత పౌరులను చంపేస్తున్నా ప్రధాని ఆ దేశ ఆజ్ఞలను పాటిస్తూ విధేయత కనబరుస్తున్నారు. వారి దాడుల్లో భారత నావికులు మరణించినా అమెరికా ఇప్పటికీ పశ్చాత్తాపపడడం లేదు. అదనంగా ఆంక్షలకు కొనసాగిస్తోంది' అని రాహుల్ గాంధీ అన్నారు.

## సంమయమనం పాటించండి

చాలా చిన్నదని, దాని వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్ ఇకపై లెబనాన్‌లో ఎక్కడా దాడులు చేయకూడదని హితవు పలికారు. అదే సమయంలో హెజ్‌బొల్లా సహా ఇతరులు కూడా ఇజ్రాయెల్‌పై దాడులకు దిగకూడదన్నారు. ప్రాంతీయ శాంతికి చేరువవుతున్న వేళ (ఒప్పందాన్ని ఉద్దేశించి) దాన్ని నాశనం చేయొద్దని హితవు పలికారు.ఇరాన్ మద్దతు గల హెజ్‌బొల్లా గ్రూపునకు పట్టున్న బీరుట్ దక్షిణ శివార్లలోని ఓ భవనంపై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ నుంచి ఈ ప్రకటన వచ్చింది. మరోవైపు యుద్ధాన్ని ముగించే ఒప్పందం ఆదివారం కుదిరే అవకాశం ఉందని ట్రంప్ చెప్పినప్పటికీ.. దాని గురించి ఎలాంటి ప్రకటనా చేయలేదు.

## మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తే రాజీనామా చేస్తా

కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, పార్టీకి చెందిన ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్, పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియపై దిశానిర్దేశం చేయనున్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..రేవంత్ రెడ్డి బాధల్లా మన పదవులు కావాలనే కదా.. మనముందొద్దు రాజకీయంలో పక్కకు పోవాలనే కదా.. ఆడబిడ్డలకు పోయిన రెండున్నరేళ్లు వచ్చే రెండున్నరేళ్లు బాకీతో సహా ఒక్కొక్కరికి రూ. లక్షా 50 వేల చొప్పున మొత్తం ఆడబిడ్డలకు ఇయ్.. నేను రాజీనామా చేస్తా.. అట్లాగే మా తమ్ముళ్లకు రూ. 4వేలు నిరుద్యోగ భృతి ఇస్తా అని చెప్పినవ్ కదా.. పోయిన రెండున్నర సంవత్సరాలు, మొత్తం కలిపి 40 లక్షల మంది మా తమ్ముళ్లకు, చెల్లెళ్లకు ఇయ్.. తప్పకుండా రాజకీయమే వదిలేస్తా అని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.మోచేతికి బెల్లం పెట్టిండు. ఆగం చేసిండు.. పోయి కుర్చీల కూర్చున్నడు. హైదరాబాదోళ్లు, ఖైరతాబాద్‌లో ఒక్కడు కూడా కాంగ్రెస్ పార్టీని నమ్మలేదు. మీరు కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇయ్యలేదు. మీరేమన్నా నాగేందర్‌కు ఓటేశారా.. మీరంతా కేసీఆర్‌కు వేశారు. మాకు తెలుసునన్నారు. నాగేందర్‌ను చూసి ఓటేస్తే మొత్తం నాకేస్తడు.. తెల్వదా మనకు.. అన్నట్టే నాకేసిండు.అట్లే జరిగింది కానీ కేసీఆర్ గెలవాలే కదా..ఈయన సక్కటోడు కాకపోయినా ఎమ్మెల్యే అయితే కేసీఆర్ ముఖ్యమంత్రి అయితరు కదా అని ఓటేసిర్రని అన్నారు. ఆయన పోయి రేవంత్ రెడ్డి సంకల కూర్చొని పెద్ద పెద్ద మాటలు చెప్తున్నడు. ఖైరతాబాద్‌లో రెండు సార్లు గులాబీ జెండా ఎగరేసినం. 2018, 2023లో శ్రీనివాస్ యాదవ్ చెప్పినట్టు మళ్లీ 2028లో కూడా గులాబీ జెండా ఎగరేద్దామా..? అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## అగ్నిప్రమాదం వదంతులతో పట్టాలపైకి..

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని హేతమ్‌పుర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఖజురహో- ఉదయ్‌పుర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైల్లో మంటలు చెలరేగాయన్న వదంతులతో అలారం చైను లాగారు. రైలు ఆగిన తర్వాత పలువురు ప్రయాణికులు హడావుడిగా కిందకు దిగి.. పక్కనున్న పట్టాలపైకి చేరుకున్నారు. అంతలోనే ఆ పట్టాలపై దూసుకొచ్చిన పాతాళ్ కోట్ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొంది. ఈ ఘటనలో చిన్నారి సహా నలుగురు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

## బావిలోకి దూసుకెళ్లిన వ్యాను..

ముంబై(జనంసాక్షి):మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సోలాపూర్ జిల్లాలో తాండుల్వాడి సమీపంలో పికప్ ట్రక్కు బావిలో పడిపోవడంతో 8 మంది మృతి చెందారు. మరో ఆరుగురు గాయపడ్డారు. వారిని స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. సాగర్ చౌగులే తన కుటుంబ సభ్యులతో కలిసి పికప్ ట్రక్కులో దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మస్వద్ నుంచి పండర్‌పూర్ వెళుతుండగా దారిలో రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ భూమిలోకి ట్రక్కు దూసుకెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది.

## కృష్ణా నదిలో పడవ బోల్తా..

అచ్చంపేట: పల్నాడు జిల్లా కోనూరులో విషాదం చోటుచేసుకుంది. కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురు మృతిచెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. మృతులను గంధం సంధ్య (9), గంధం సైనీ (10), బత్తుల కార్తీక్ (12), కొనత చైతన్య (28)గా గుర్తించారు.10 మంది బంధువులు కోనూరులో జరిగే ఓ వేడుకకు పడవపై వెళ్లి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో నదిలో పడవ బోల్తా పడటంతో వారంతా నీట మునిగిపోయారు. వీరిలో ఆరుగురిని గ్రామస్థులు కాపాడారు. మిగిలిన నలుగురు గల్లంతయ్యారు. పోలీసులు, గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టారు.. వారి మృతదేహాలు లభ్యమయ్యాయి.





## వర్షం.. ఆపద సమయం

వర్షాల సన్నద్ధతపై జూన్ 1న స మీక్ష నిర్వహించి తాను స్వయంగా అనేక సూచనలు చేశానని గుర్తుచేశారు. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ముఖ్య మంత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.జూన్ 9న వర్షం సమయంలో మున్సిపల్, పోలీసు అధికారు ల మధ్య సమన్వయం లోపించిందన్నారు. ఈ పరిస్థితికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌లను ఆదేశించారు. మరో సారి ఇలాంటి పరిస్థితి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని అధి కారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షం సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనన్నారు. పోలీసు కమిషనర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపైకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. అవసరమైతే తాను కూడా రోడ్డుపైకి వస్తానని ముఖ్యమంత్రి అన్నారు. వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ అయితే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డీజీపీకి సూచించారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని హెచ్చరించారు.వర్షాల సమయంలో ఏర్పడే వాటర్ లాగింగ్ పాయింట్లు, బ్లాక్ స్పాట్లు, ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాల డేటా ఆధారంగా అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు.వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరగాలని సూచించారు. అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్షం సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు.వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మాన్యువల్ ప్రకారం ప్రాజెక్టుల నిర్వహణ ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టుల వద్ద సంబంధిత ఇంజినీర్లు తప్పనిసరిగా స్థానికంగా ఉండాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రాజెక్టులను వదిలి వెళ్లే ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ కార్యదర్శిని ఆదేశించారు.ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు సూచించారు.వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలన్నారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. యూరియా స్టాక్ , పంపణి కోసం స్థానిక వ్యవసాయ అధికారిని బాధ్యుడిగా నియమించడంతో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. సన్న వడ్ల కోసం వ్యవసాయ శాఖ ప్రకటించిన ఎనిమిది రకాల విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.వర్షాల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. గతంలో తాగునీటి కాలుషితం కారణంగా జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని జలమండలి అధికారులను ఆదేశించారు.నీటి కలుషితం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నందున శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌కు ముఖ్యమంత్రి సూచించారు. పోలీసు, ట్రాఫిక్, ఫైర్, హైడ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు.

## వారం రోజుల్లో వర్షాలు..

మూడు డిగ్రీల వరకు తగ్గుతాయని పేర్కొంది.ఇవాళ మధ్యాహ్నం నుంచి రేపు ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 30 నుంచి 40కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది.రేపు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాద్రాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఎల్లుండి ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.బుధవారం నాడు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.గురువారం నాడు రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. శుక్ర, శని వారాల్లో రాష్ట్రంలోని పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. గంటలకు 40-50కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది.



## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందే..

మరి మిగతావారికి అవి ఎందుకు అందటం లేదు? విద్యార్థులకు అన్యాయం చేసిన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. ఆయన్ను జైలుకు పంపాలి" అని డిమాండ్ చేశారు.

## మమతకు లీగల్ నోటీసులు

తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ కుమారుడు డాక్టర్ బైద్యనాథ్ ఘోష్.. మాజీ సీఎం మమతా బెనర్జీకి లీగల్ నోటీసులు పంపారు. టీఎంసీ ఎంపీలు కల్యాణ్ బెనర్జీ, సౌగతా రాయ్, మహువా మొయిత్రాలకు కూడా నోటీసులు పంపారు. బరసత్ అసెంబ్లీ స్థానంలో పోటీ చేయడానికి తాను పార్టీ టికెట్ కోరానని టీఎంసీ నేతలు చేసిన ఆరోపణలపై బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.ఈ నెల మొదట్లో జరిగిన ఓ కార్యక్రమంలో మమతా బెనర్జీ మాట్లాడుతూ.. బరసత్ నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం కొంతమంది తనను సంప్రదించారని పేర్కొన్నారు. అయితే పార్టీలోని సీనియర్ నేతలు అందుకు ఒప్పుకోకపోవడంతో వారు చేసిన అభ్యర్థనను తిరస్కరించినట్లు తెలిపారు. ఒకరు ఎంపీ అయినంత మాత్రాన కుటుంబంలోని వారందరూ ఎంపీలు, ఎమ్మెల్యేలు అవ్వాలా అంటూ పరోక్షంగా కకోలీ ఘోష్‌పై విమర్శలు చేశారు. ఈ క్రమంలోనే కకోలి టీఎంసీని వీడడంతో తన కుమారుడికి టికెట్ ఇవ్వనందుకే ఎన్డీఏకు మద్దతిచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

## కార్పొరేట్‌కు ధీటుగా గురుకుల పాఠశాలల్లో దొరబాబుల్లా మన పిల్లలు

విద్యార్థులకు మఫత్‌లాల్ వంటి పేరెన్నికల గల సంస్థ నుంచి యూనిఫాం వస్త్రాన్ని ఈ దఫా సేకరిస్తున్నారు. యూనిఫాంతో పాటు స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్సులు, టై, బెల్ట్, బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా ఇలా ప్రతి దానిలోనూ ప్రభుత్వం నాణ్యతకు పెద్ద పీట వేసింది. గతంలో పాఠశాల విద్యా విభాగం, ఏ గురుకుల విభాగానికి ఆ గురుకుల విభాగం విద్యార్థులకు అవసరమయ్యే సామగ్రి వేర్వేరుగా కొనుగోలు చేసి అందజేసేవి.. దాంతో అనేకరకాల హెచ్చుతగ్గులు కనిపించేవి. కొన్ని పొరపాట్లు చోటుచేసుకునేవి.. ఆ సమస్యలను అధిగమించి సామగ్రి సేకరణ.. పంపిణీలో ఏకరూపత కోసం ఈ ఏడాది ప్రభుత్వం సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ సిస్టమ్ తీసుకువచ్చింది. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పరిధి విద్యా సంస్థల విద్యార్థులకు మన్నికైన యూనిఫాం, ఇతర సామగ్రి అందజేసేందుకు రూ.687.78 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది. దీనిని ఖర్చుగా కాకుండా భవిష్యత్ తరాలపై పెట్టే వ్యయంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నాయి.మొత్తం 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంకు సంబంధించి 2.97 కోట్ల మీటర్ల వస్త్రం కొనుగోలుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మఫత్‌లాల్ కంపెనీ 2.41 కోట్ల మీటర్లు, తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంస్థ 55.32 లక్షల మీటర్ల వస్త్రం సరఫరా చేస్తున్నాయి. ఇందులో విద్యార్థినీవిద్యార్థులకు లైట్ బ్లూ, డార్క్ బ్లూ, వైట్, ప్లెయిన్ మెరూన్, మెరూన్ చెక్స్ రంగుల్లో యూనిఫాంలు అందజేయనున్నారు. విద్యార్థినులకు షర్ట్, పంజాబీ డ్రెస్, చున్నీ సరఫరా చేయనున్నారు. ఈ దఫా విద్యార్థులకు యూనిఫాం రంగులను ప్రభుత్వం మార్చింది. డే స్కాలర్స్‌కు టాప్ లైట్ బ్లూ, లోవర్స్ డార్క్ బ్లూ యూనిఫాంలో ఉండనున్నాయి. గురుకులాల్లోని విద్యార్థులకు టాప్‌లో మెరూన్ చెక్, లోవర్ మెరూన్ యూనిఫాంలో ఉండనున్నాయి. యూనిఫాం కుట్టు పనిని మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం అప్పజెపింది.. రాష్ట్రంలోని మహిళా సంఘాలకు రోజుకు 75 వేల నుంచి లక్ష యూనిఫాంలు కుట్టే సామర్థ్య ఉంది. ఒక్కో యూనిఫాం కుట్టు పనికి రాష్ట్ర ప్రభుత్వం రూ.75 చెల్లిస్తుంది. సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున యూనిఫాంలు అందించనున్నారు. ఈ పనితో సంఘాల్లోని మహిళలకు సుమారు రూ.40 కోట్లకుపైగా ఆదాయం సమకూరనుంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన సామగ్రితో కూడిన కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఇందులో యూనిఫాంతో పాటు తెల్లని బూట్లు, తెల్లని సాక్సులు ఉంటాయి. గతంలో బీసీ గురుకులాల్లోని విద్యార్థులకు మాత్రమే బూట్లు ఇచ్చేవారు. ఈ దఫా అన్ని రకాల యాజమాన్యాల్లోని విద్యార్థులకు బూట్లను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, పట్టణ గురుకుల పాఠశాలల విద్యార్థులకు బెల్టు, ఐడీ కార్డు, టై, స్కూల్ బ్యాగు, బూట్లు బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా, ట్రంక్ బాక్సు, పీటీ డ్రెస్, నైట్ డ్రెస్, ట్రాక్ సూట్ తో కూడిన సంపూర్ణమైన కిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. మైనారిటీ గురుకులా ల్లోని విద్యార్థులకు తొలిసారిగా ట్రాక్ సూట్, నైట్ డ్రెస్ లను రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ పాఠశాలల్లోని విద్యార్థులకు తొలిసారిగా నల్లటి బూట్లు, బెల్టును రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. ఇప్పటి వరకు ప్రభుత్వాలు పాఠశాలలకే పెద్దపీట వేశాయి. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులపైనా ప్రత్యేకంగా దృష్టిసారించింది. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూలేని విధంగా తొలిసారి ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లోని సుమారు 2 లక్షల మంది విద్యార్థులకు కాలేజీ బ్యాగు, బెల్టు, టై, నల్లటి బూట్లు, సాక్సులు అందజేయనుంది. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లోని విద్యార్థులకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు ఇప్పటికే ఆయా సంస్థలకు చేరాయి. తొలి వారంలోనే వాటి పంపిణీ పూర్తి కానుంది. విద్యార్థులకు యూనిఫాంతో పాటు అందజేసే బూట్లు, సాక్సులు, టైలు, బెల్టులు, గురకుల్లాలోని విద్యార్థులకు అందజేసే దుప్పట్లు, ప్లేట్లు, గ్లాస్‌లు ప్రతి ఒక్కటి నాణ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ టెండర్లను పిలిచింది. మిగిలిన ఆర్డర్లను టీజీఎస్‌సీవో, టీజీఎల్ఐపీసీ తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ టీజీటీపీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పింది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేస్తున్నది రూ.687.78 కోట్లు మాత్రమే. పేద, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన సామగ్రి అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా జాతీయ ఈ టెండర్ల పద్ధతిని పాటిస్తోంది. ఈ విషయంలో ప్రతిపక్ష నేతలు, దురుద్దేశ్యపూరితంగా రూ.వేల కోట్ల అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉంది.యూనిఫాం, బెడ్డింగ్ ఆర్డర్లలో 25-30% తెలంగాణ రాష్ట్ర చేనేత కార్మికుల సహకార సంఘానికికి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇందులో 25% యూనిఫాం వస్త్రం (సుమారు 56 లక్షల మీటర్లు), 100% దుప్పట్లు (6,49,381), 3 లక్షల బెడ్‌షీట్లు, 2.29 లక్షల కార్పెట్లు ఉన్నాయి. ఈ ఆర్డర్‌తో చేనేత కార్మికులకు ఆదాయం సమకూరనుంది. టైలు, బెల్టులు, ఐడీ కార్డుల ఆర్డర్‌ను తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్‌కి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ ఆర్డర్‌తో ఆ సంస్థ ఆర్థికంగా బలోపేతం కానుంది.ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే యూనిఫాం, టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, కార్పెట్లతో యూనిఫాంలు కుట్టే మహిళలు, దుప్పట్లు, కార్పెట్లు తయారుచేసే చేనేత కార్మికులు, బెల్టులు, ఇతర సామగ్రి తయారీతో ఎఉఒఎఖఅ పరిధిలోని కార్మికులకు ఆదాయం లభిస్తుంది. గత ప్రభుత్వం హయాంలో పాఠశాల విద్యా శాఖతో పాటు ఏ గురుకుల సంస్థకు ఆ గురుకుల సంస్థ యూనిఫాంతో పాటు ఇతర సామగ్రి తయారీ సేకరణ, పంపిణీ చేపట్టేవి. ఇందులో ఏకరూపత లేకపోవడంతో అనేక అవకతవకలు చోటు చేసుకునేవి. ఈ వస్తువుల సరఫరాలో పాతుకుపోయిన కొన్ని ముఠాలు నాసిరకమైన వస్త్రం, ఇతర సామగ్రి పంపిణీ చేసి భారీగా దండుకునేవి. పైగా ఆ నాసిరకం సామగ్రి పంపిణీ ఏడాదిపొడవునా సాగేది. ఆ అవకతవలన్నింటికి అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది తొలిసారిగా సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టింది. దీంతో అన్ని రకాల యాజమాన్యాల్లోని విద్యార్థులకు ఏకకాలంలో యూనిఫాంలు, కిట్లు, ఇతర సామగ్రి అందనున్నాయి.

## సింగరేణి కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే క్షమించం

**మంచిర్యాల జిల్లా శ్రీరామ్ పూర్ ఓపెన్ కాస్ట్ బొగ్గుగనిని సందర్శించిన ఉపముఖ్యమంత్రి భట్టి**



మంచిర్యాల(జనంసాక్షి):సింగరేణి కార్మికుల శ్రమను, వారి ఆత్మగౌరవాన్ని తక్కువ చేసి మాట్లాడుతున్న టిఆర్ఎస్ నేతలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి నిప్పులు జరిగారు. టిఆర్ఎస్ నాయకులు తమ రాజకీయ స్వార్థం కోసం సింగరేణి సంస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి గురించి ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై సమాధానం చెప్పేందుకు ఆదివారం నాడు మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ మైనింగ్ ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓపెన్ హౌస్ ఇన్స్పెక్షన్ నిర్వహించి, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువచ్చారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ?కార్మికుల శ్రమను అవమానిస్తే సహించేది లేదన్నారు. సింగరేణి సంస్థపై జరుగుతున్న ప్రచారంలో ఏది నిజం, ఏది అబద్ధమనే వాస్తవాలను ప్రజలముందుకు తీసుకురావాలనే ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ నాయకుల వ్యక్తిగత ప్రయోజనాలు, స్వార్థ ప్రయోజనాల కోసమే అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంగా మాట్లాడాల్సిన అవసరం నాకు లేదని ఆయన అన్నారు. ఈ రోజు కేవలం వాస్తవాలను మాత్రమే ప్రజల ముందు ఉంచాలనుకుంటున్నట్లు బట్టి విక్రమార్క తేల్చి చెప్పారు. ?ప్రజా ప్రభుత్వం చెప్పేది కేవలం నిజాలు మాత్రమేనని, ఆ నిజాన్ని ప్రజల ముందుకు ఉంచడమే తమ బాధ్యతని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మికుల చెమట, కఠోర శ్రమ దాగి ఉన్నాయని, వారి ఆత్మగౌరవాన్ని అపహాస్యం చేసేలా ఎవరు మాట్లాడినా సహించేది లేదని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సింగరేణి యాజమాన్య నిబద్ధతను, సంస్థలోని పారదర్శక విధానాలపై బీఆర్ఎస్ నాయకులు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి మకుటాయమానమైన సింగరేణి సంస్థను అభాసుపాలు చేయాలనే తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఇక్కడ ఏదో తప్పు జరిగిపోతుంది అన్నట్లుగా టిఆర్ఎస్ నాయకులు కేంద్రానికి లేఖలు రాయడం సత్యదూరంగా ఉన్నాయని చెప్పారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే అందరి సమక్షంలో ఓపెన్ హౌస్ ఇన్స్పెక్షన్ చేపట్టినట్లు ఆయన తెలి పారు.సొంత రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ భవిష్యత్తును, సింగరేణి సంస్థను వాడుకోవడం తగదని భట్టి విక్రమార్క హితవు పలికారు. మీ రాజకీయ అవసరాలు, స్వార్థం కోసం ఇటువంటి కార్యాకలాపాల కు పాల్పడవద్దని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క హెచ్చరించారు. సింగరేణి కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, ఇది తెలంగాణ ప్రజల ఆస్తి అని ఆయన అన్నారు. ఇక్కడి వనరులు, ఈ వ్యవస్థ, ఈ శక్తి అంతా ప్రజల నుంచి వచ్చిందేనని, ఇది ఎప్పటికీ ప్రజలకే చెందుతుందని పేర్కొన్నారు.సంస్థపై దోపిడీదారులు, దేగలు కన్నెత్తి చూసేందుకు కూడా భయపడేలా ప్రజా ప్రభుత్వం అత్యంత ఖచ్చితత్వంతో పని చేస్తుందని అన్నారు. రాజకీయ అవసరాల కోసం సంస్థను వాడుకోవాలని చూస్తే.. తాము ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. భవిష్యత్తులోనూ సింగరేణి అత్యంత పారదర్శకంగా ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, రవాణా ప్రక్రియలో పూర్తి పారదర్శకతను ప్రజలకు తెలియజెప్పడమే ప్రజా ప్రభుత్వం బాధ్యత అని ఆయన చెప్పారు. మైన్ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు అక్కడ అమలు అవుతున్న భద్రతా ప్రమాణాలు, బొగ్గు రవాణాకు సంబంధించిన లెక్కలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శ్రీరాం పూర్ ఓసీ మైన్ నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం మరో 28 సంవత్సరాల పాటు ఇక్కడ బొగ్గు ఉత్పత్తి కొనసాగే అవకాశం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.సింగరేణి సంస్థలో జరుగుతున్న ప్రతి ప్రక్రియ అత్యంత ఆధునికంగా, కంప్యూటరైజ్డ్ విధానంలో పారదర్శకంగా సాగుతోందని ఈ సందర్భంగా అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి చికిత్స అందించేందుకు వీలుగా, పూర్తి ఆధునిక పరికరాలతో కూడిన 'క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సులను' మంజూరు చేస్తున్నామన్నారు. ఈ బస్సులు ఊరూరా తిరిగి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తాయని అన్నారు. వ్యాధి లక్షణాలు ప్రారంభ దశలోనే గుర్తిస్తే త్వరితగతిన చికిత్స అందించేలా చర్యలు తీసుకుం టామని వివరించారుసింగరేణి కార్మికుల పిల్లలు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతుంటే, వారికి ప్రిలిమ్స్, మెయిన్స్ రాయడానికి మరియు ఇంటర్వ్యూలకు వెళ్ళడానికి అవసరమైన పూర్తి ఆర్థిక సహాయాన్ని, సహకారాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమపాళ్ళలో మేళవించి సింగరేణిని ముందుకు తీసుకువెళతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, సింగరేణి సంస్థ సీఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్, ఇతర నాయకులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి

# టీజీఎస్ ఆర్టీసీ సిద్ధం



- నేటి నుంచే ప్రత్యేక స్కూల్ బస్సులు..
- విద్యార్థుల వేళలకు అనుగుణంగా అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులు నడపాలి
- ఎండీ వై.నాగిరెడ్డి ఆదేశం

హైదరాబాద్ (జనంసాక్షి) : వేసవి సెలవుల అనంతరం నేటి నుండి రాష్ట్రవ్యాప్తంగా 2026-27 విద్యాసంవత్సరానికి గాను పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి... ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా అన్ని రూట్లలో తగినన్ని స్కూల్ బస్సులను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అన్ని రీజియన్ లఅధికారులను ఆదేశించారు. నూతన విద్యాసంవత్సరంలో మొత్తం 227 పనిదినాలు ఉన్నందున, విద్యార్థులు సకాలంలో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా రవాణా సౌకర్యాలను సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని రీజియన్ల అధికారులు, డిపో మేనేజర్లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి రవాణా ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఎండీ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల స్కూల్ టైమింగ్స్‌కు అనుగుణంగా బస్సు సర్వీసులను క్రమబద్ధీకరించాలని, గతంలో నడిపిన అన్ని స్కూల్ రూట్లను విధిగా పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు బస్సుల కోసం ఎక్కువ సమయం వేచి ఉండకుండా, ఉదయం మరియు సాయంత్రం వేళల్లో ఖచ్చితమైన సమయ పాలన పాటించాలని, అవసరమైన చోట అదనపు ట్రిప్పులు నడపాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఎండీ నాగిరెడ్డి ఆదేశించారు.

# మహిళలు క్రీడల్లోనూ రాణిస్తున్నారు




- మహిళ ప్రతిభకు ప్రభుత్వం ప్రోత్సాహం
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త
- ఘనంగా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ ప్రారంభం

హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ నగరంలోని బండ్లగూడ, నాగోల్ ప్రాంతంలో నిర్వహించిన ఉమెన్స్ సైక్లింగ్ - సిటీ లీగ్ 2026 (హైదరాబాద్ ఎడిషన్) కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారత యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం మహిళల సాధికారత, యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందింపుకు వేదికగా నిలిచింది. తెలంగాణ వ్యాప్తంగా 105 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, క్రీడల్లో కూడా విశేష ప్రతిభ కనబరుస్తూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని అన్నారు. యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరుచుకోవడానికి సైక్లింగ్ వంటి క్రీడలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళా సైక్లిస్టుల ఉత్సాహాన్ని అభినందించిన ఆయన, ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు క్రీడల పట్ల మరింత ఆసక్తిని కలిగిస్తాయని తెలిపారు. మహిళల ప్రతిభను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం, క్రీడా సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారిణులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల శ్రీనివాస్ గుప్త, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నల్లి జ్యోతి కుమార్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు ప్రాంతీయ డైరెక్టర్ శాంతి ప్రియా,ఐఏ అండ్ ఏఎస్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్, ఆంధ్రప్రదేశ్, యాదయ్య, డాక్టర్ మాక్స్‌వెల్ ట్రెవర్, లోరైన్ ట్రెవర్, ఎం.కె. పాషా, శ్రీ శ్రీకాంత్ మన్నార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ సంస్కృతుల సమ్మేళనానికి

# సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీక

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- సాలార్ జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వారోత్సవాలు ప్రారంభం

హైదరాబాద్, జూన్ 14 (జనంసాక్షి) : హైదరాబాద్‌కు చార్మినార్ ఎంత గుర్తింపును తీసుకువచ్చిందో, సాలార్‌జంగ్ మ్యూజియం కూడా అంతే గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించుకుందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ప్రపంచ సంస్కృతుల సమ్మేళనానికి సాలార్‌జంగ్ మ్యూజియం ప్రతీక అని గవర్నర్ పేర్కొన్నారు. సాలార్‌జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వేడుకలు, సాలార్‌జంగ్-3 జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మ్యూజియంలో నిర్వహించిన కార్యక్రమంకు గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ఉప ముఖ్యడ మంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావు, సాలార్ జంగ్ మ్యూజియం డైరెక్టర్ ప్రియాంక మేరీ ప్రాన్సిస్ పాల్గొన్నారు. వారోత్సవాలలో భాగంగా సాలార్ జంగ్ మ్యూజియం ఏర్పాటు, అభివృద్ధి పై ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శన నిర్వహించారు.

గవర్నర్ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత 'వీల్డ్ రెబెక్కా' శిల్పం, అరుదైన ఖురాన్ ప్రతులు, చోళుల కాంస్య విగ్రహాలు, బౌద్ధ, క్రైస్తవ కళాఖండాలు ఈ మ్యూజియాన్ని విశిష్ట స్థాయికి చేర్చాయని పేర్కొన్నారు. వివిధ మతాలు, సంస్కృతులు, నాగరికతల సమన్వయానికి ఈ మ్యూజియం ప్రతీకగా నిలుస్తోందన్నారు. హైదరాబాద్ విజ్ఞానం, ఆవిష్కరణలు, విద్యకు కేంద్రబిందువుగా ఎదుగుతున్న నేపథ్యంలో మ్యూజియాన్ని పరిశోధన, అధ్యయనం, జ్ఞాన సృష్టికి మరింత ఉపయోగపడేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటలైజేషన్, పరిశోధన ఫెలోషిప్‌లు, విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాన్ని విస్తరించాలని మ్యూజియం బోర్డుకు సూచించారు. ఈ సందర్భంగా సాలార్‌జంగ్ మ్యూజియం ప్రాధాన్యతను ప్రపంచానికి మరోసారి చాటిచెప్పేందుకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని మ్యూజియంలో నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు గవర్నర్ సూచించారు.



## రక్తదానం మహాదానం : రాష్ట్ర గవర్నర్




రక్తదానం మహాదానమని, ఒక వ్యక్తికి ప్రాణదానం చేయడం కంటే గొప్ప దానం మరొకటి లేదని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా లోక్ భవన్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో భారత రెడ్‌క్రాస్ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, రక్తదానం కేవలం వైద్య సహాయం మాత్రమే కాదని, అది మానవత్వానికి, కరుణకు, సామాజిక బాధ్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. రక్తంలోని ప్రతి చుక్క ఒక రోగికి కొత్త ఆశను, ధైర్యాన్ని, జీవించే అవకాశాన్ని అందిస్తుందని అన్నారు. భారతీయ సంస్కృతిలో దానానికి విశిష్ట స్థానం ఉందని, అందులో రక్తదానం అత్యున్నతమైనదిగా భావిస్తారని తెలిపారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా అపరిచితుల ప్రాణాలను కాపాడేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద రక్తదాతలు సమాజానికి నిజమైన హీరోలని కొనియాడారు.

రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, సాంకేతిక నిపుణులు, స్వచ్ఛంద కార్యకర్తలు, కార్పొరేట్ సంస్థలను గవర్నర్ అభినందించారు. రక్తదానాన్ని ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణను క్షయ (టీబీ) మరియు మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు తన ప్రయత్నాలు కొనసాగుతాయని గవర్నర్ తెలిపారు. టీబీ రహిత, మాదకద్రవ్యాల రహిత తెలంగాణ లక్ష్య సాధనలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, యువత, పౌర సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిషోర్ మాట్లాడుతూ, తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి శివ ప్రతాప్ శుక్లా క్షయ వ్యాధి నిర్మూలన, మాదకద్రవ్యాల నియంత్రణ, రెడ్‌క్రాస్ సేవల విస్తరణ కోసం విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీని బలోపేతం చేసేందుకు గవర్నర్ ప్రత్యేక చర్యలు చేపట్టారని, ఆయన చొరవతో గత కొంతకాలంలో ఐదు వేలకుపైగా కొత్త సభ్యత్వాలు నమోదయ్యాయని వెల్లడించారు.

# ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

**వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం, అడవి వెంకటాపూర్ గ్రామంలో ఘోర విషాదం**



చౌడాపూర్, జూన్ 14(జనం సాక్షి) : కుటుంబ కలహాలతో తల్లి తన ఇద్దరు పిల్లలను చంపి తాను ఆత్మ హత్య చేసుకున్న ఘటన చౌడాపూర్ మండలం అడవివెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు పలువురు తెలిపిన వివరాల ప్రకారం...అడివి వెంకటాపూర్ గ్రామానికి చెందిన జంబుల మల్లేష్ (32) భార్య జంబుల నవనీత (సునీత ) (27) వీరికి ఇద్దరు పిల్లలు కుమారుడు విగ్నేష్ (7), కూతురు మధుప్రియ (5) కలరు.తరచూ కుటుంబం లో జరిగే గొడవలతో మనస్థాపం చెందిన నవనీత పిల్లలను ఉరివేసి చంపి తాను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇద్దరు చిన్నారులు, తల్లి మృతి చెందడంతో గ్రామం లో ఒక్కసారిగా విషాదఛాయలు అల్లుకున్నాయి.ఈ విషయం తెలియడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.పరిగి సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారంఈ కేసు వివరాలు ఏమిటంటే, ఆదివారం గంటలకు, వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌కు చెందిన బెండు బందయ్యా తెలుగులో రాసిన ఫిర్యాదు అందింది. తన అన్నయ్య కుమార్తె అయిన జంబుల నవనీత అలియాస్ సునీత (30) సుమారు 12 ఏళ్ల క్రితం చౌడాపూర్ మండలం అడవి వెంకటాపురం గ్రామానికి చెందిన జంబుల మల్లేష్‌తో వివాహం జరిగిందని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. నవనీత చిన్నతనంలోనే ఆమె తల్లిదండ్రులు మరణించారని, అప్పటి నుండి ఆమెను తానే మరియు తన కుటుంబమే చూసుకుంటున్నామని ఫిర్యాదుదారు తెలిపారు. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు-జంబుల విగ్నేష్ (8) జంబుల మధుశ్రీ (7) ఉన్నారని ఆయన పేర్కొన్నారు. అదనపు కట్నం కోసం డిమాండ్ చేస్తూ మల్లేష్ అనేకసార్లు నవనీతను శారీరకంగా మానసికంగా వేధించేవాడని, ఈ సమస్యను పరిష్కరించడానికి గ్రామ పంచాయతీల ద్వారా అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ అతని ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాలేదని ఆయన ఆరోపించారు. అలాగే, మల్లేష్ తన తమ్ముడు శివ, శివ భార్య లక్ష్మి, చిన్న అత్త వసంత మరియు సోదరి అరుణతో కలిసి చిన్న చిన్న విషయాలకే నవనీతతో తరచుగా గొడవపడేవాడని మరియు ఆమెను నిరంతరం వేధించేవాడని ఆయన ఆరోపించారు. శనివారం సాయంత్రం , లింగంపల్లి గ్రామానికి చెందిన తన బంధువు కామినిపల్లి నర్సింలు తనకు ఫోన్ చేసి, నవనీత తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని, ఆమె ఇద్దరు పిల్లలు కూడా మరణించారని సమాచారం అందించారని ఫిర్యాదుదారు తెలిపారు. ఆ సమాచారం అందుకున్న వెంటనే, ఫిర్యాదుదారు తన కుటుంబ సభ్యులతో కలిసి మృతురాలి ఇంటికి వెళ్లగా, అక్కడ నవనీత ఇంటి లోపల దూలానికి కట్టిన నైలాన్ తాడుకు వేలాడుతూ కనిపించిందని, ఆమె కుమారుడు కుమార్తె సమీపంలోనే మరణించి పడి ఉన్నారని గుర్తించారు. నవనీత మరియు ఆమె ఇద్దరు పిల్లలను ఉరివేసి చంపడంలో తన అల్లుడు మల్లేష్ కారణమయ్యాడని ఫిర్యాదుదారు అనుమానం వ్యక్తం చేశారు; అలాగే మల్లేష్, శివ, లక్ష్మి, వసంత అరుణలపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రమాదకర పురుగు మందులను నిషేధించాలి

- రైతులను ప్రభుత్వమే రక్షించాలి
- తెలంగాణ రైతు సంఘం

ముషీరాబాద్, జూన్ 14 (జనం సాక్షి): ప్రమాదకర పురుగుమందులు, కలుపు మందుల పై ప్రభుత్వం సంపూర్ణ నిషేధం విధించి రైతులను ప్రభుత్వమే రక్షించాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకెఎస్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు ఆదివారం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ లు మాట్లాడుతూ పంటను రక్షించుకునే క్రమంలో రైతులు వాడుతున్న విషపూరిత పురుగుమందుల వల్ల రైతులతోపాటు రైతు కుటుంబ సభ్యులు, ఇతర ప్రజల ఆరోగ్యాల మీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారం పేరుతో రైతులను కార్పొరేట్ కంపెనీలు ఉత్పత్తి చేసే రసాయనాల బానిసలుగా మార్చడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేట్‌లకు అప్పచెప్పేం దుకు రైతుల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం, నేల సారవంతాన్ని, పర్యావరణ పరిరక్షణను గాలికొదిలేస్తున్నదని ఆరోపించారు. ఇటీవల వెలువడిన పలు అధ్యయనాలు, మీడియా కథనాలు, వైద్య నిపుణుల హెచ్చరికలు, రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై రసాయన పురుగు మందులు, కలుపుమందులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని స్పష్టంగా తెలియజేస్తున్నాయన్నారు. క్యాన్సర్లు, కిడ్నీ వైఫల్యాలు, శ్వాసకోశ వ్యాధులు, రక్తహీనత, చర్మవ్యాధులు, నాడీ సంబంధిత సమస్యలు గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. ముఖ్యంగా విషపూరిత మందుల వాడకం మానవ ప్రాణాలకు ముప్పుగా మారిందని కొన్నిసార్లు ప్రభుత్వాలే అంగీకరించాయి. ఇప్పటికైనా రైతులు, వ్యవసాయ కూలీల ఆరోగ్యంపై పెస్టిసైడ్ల ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి ప్రత్యేక వైద్య కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. పురుగుమందుల విక్రయాలపై కఠిన నియంత్రణలు అమలు చేసి, ఆన్లైన్ అక్రమ విక్రయాలను పూర్తిగా అరికట్టాలి. ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్న అత్యంత విషపూరితమైన మందులను పూర్తిగా నిషేధించాలి, గ్రామీణ ప్రాంతాల్లో "పెస్టిసైడ్ టాక్సికాలజీ" చికిత్స కేంద్రాలను జిల్లా ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయాలి. రసాయనిక ఎరువుల వాడకం, ప్రభావాలపై రైతులకు, వ్యవసాయ కార్మికులకు నిరంతరం అవగాహన కల్పించాలి. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి పండించిన పంటలకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. అదనంగా ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి. రైతులకు రక్షణ పరికరాలు (మాస్కులు, గ్లౌజులు, రక్షణ దుస్తులు) సబ్సిడీపై అందించాలి. పురుగుమందుల ప్రభావంతో అనారోగ్యానికి గురైన రైతులు, వ్యవసాయ కూలీలకు ఉచితంగా వైద్యం అందించాలి. ప్రత్యేక ఆరోగ్య బీమా, నష్టపరిహారం కల్పించాలి. పురుగుమందుల అవశేషాలు లేని సురక్షిత ఆహార ఉత్పత్తికి ప్రభుత్వాలు సమగ్ర ప్రణాళిక కార్యాచరణ ప్రకటించాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే వ్యవసాయ విధానాల కోసం విషపూరిత వ్యవసాయ విధానాలకు వ్యతిరేకంగా రైతులు, వ్యవసాయ కూలీలు, వైద్యులు, శాస్త్రవేత్తలు, ప్రజాసంఘాలు కలిసి పోరాడుదామని పిలుపునిచ్చారు.

## ఉప్పల్ రింగ్ రోడ్‌కు చేరుకోవడమే

# ప్రజలకు అగ్నిపరీక్ష!



- స్కైవాక్ నిర్మాణ పనులతో రాకపోకలకు తీవ్ర అంతరాయం
- కీలక ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల చుట్టూ ప్రయాణం
- బస్సు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్న వృద్ధులు, మహిళలు, రోగులు

ఉప్పల్, జూన్ 14 (జనంసాక్షి): హైదరాబాద్ తూర్పు ప్రాంతానికి ప్రధాన ప్రవేశ ద్వారంగా, పరిపాలనా కేంద్రంగా గుర్తింపు పొందిన ఉప్పల్ రింగ్ రోడ్ ప్రాంతం ప్రస్తుతం అభివృద్ధి పనుల మధ్య ప్రజలకు ఇబ్బందుల కేంద్రంగా మారింది. ఉప్పల్--నారపల్లి మార్గంలో ప్రతిష్ఠాత్మక స్కైవాక్ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఉప్పల్ రింగ్ రోడ్‌కు చేరుకోవడం రోజురోజుకూ కష్టతరంగా మారుతోంది. ప్రజల భద్రత, భవిష్యత్ అవసరాల కోసం చేపట్టిన పనులు ప్రస్తుతం వేలాది మంది ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి.

ఉప్పల్ రింగ్ రోడ్ ప్రాంతం కేవలం ఒక కూడలి మాత్రమే కాదు. తూర్పు హైదరాబాద్‌లోని అత్యంత కీలక ప్రభుత్వ సేవల కేంద్రంగా ఇది అభివృద్ధి చెందింది. ఇక్కడే పోలీస్ స్టేషన్, జీహెచ్ఎంసీ కార్యాలయం, ఆసుపత్రి, పోస్టాఫీస్, విద్యుత్ శాఖ కార్యాలయం, మున్సిపల్ మైదానం, పలు ప్రజా సేవా కేంద్రాలు ఉన్నాయి. ప్రతిరోజూ ఉప్పల్, చిలుకానగర్, హబ్సిగూడ, రామంతాపూర్, నాచారం, మేడిపల్లి, పోచారం, ఘట్‌కేసర్, నారపల్లి, బోడుప్పల్ తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది ప్రజలు ఈ కార్యాలయాలకు వస్తుంటారు. అయితే ప్రస్తుతం బస్సుల నిలుపుదల వ్యవస్థలో వచ్చిన మార్పులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప్పల్ నల్లచెరువు వద్ద మాత్రమే బస్సులు ఆగుతుండటంతో అక్కడ దిగిన ప్రయాణికులు ఉప్పల్ రింగ్ రోడ్‌కు చేరుకోవడానికి సుదీర్ఘ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఒకప్పుడు సులభంగా చేరుకునే ప్రాంతానికి ఇప్పుడు దాదాపు మూడు కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నల్లచెరువు వద్ద దిగిన ప్రజలు ఉప్పల్ భాగాయత్ మీదుగా ఏషియన్ థియేటర్ సమీపానికి వెళ్లి, అక్కడి నుంచి నాగోల్ ఫ్లైఓవర్ కిందుగా తిరిగి ఉప్పల్ రింగ్ రోడ్ చేరుకోవాల్సి వస్తోంది. ఈ ప్రయాణం సమయం, డబ్బు, శ్రమను పెంచడమే కాకుండా ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోంది. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ ప్రాంతంలో ఉన్న రాతమ్మ ఆసుపత్రికి వచ్చే రోగులు, వృద్ధులు, గర్భిణీలు, అత్యవసర వైద్య సేవల కోసం వచ్చే ప్రజలు కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే వారు అదనపు దూరం నడవాల్సి రావడం తీవ్ర ఇబ్బందులకు దారితీస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదుల కోసం వచ్చే ప్రజలు, పాస్‌పోర్ట్ ధ్రువీకరణ, పోలీస్ నిర్ధారణ పత్రాల కోసం వచ్చే అభ్యర్థులు, మున్సిపల్ కార్యాలయంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆస్తి పన్ను, పారిశుధ్య సమస్యల పరిష్కారం కోసం వచ్చే పౌరులు, పోస్టాఫీస్‌లో ఆర్థిక సేవలు వినియోగించుకునే ఖాతాదారులు, విద్యుత్ శాఖ కార్యాలయంలో ఫిర్యాదులు నమోదు చేసే వినియోగదారులు అందరూ ఒకే సమస్యను ఎదుర్కొంటున్నారు.

## ఒకే కుటుంబంలో ముగ్గురు

# ప్రభుత్వ ఉద్యోగులున్నా రేషన్ కార్డు!

- అర్హులైన పేదలు రేషన్ కార్డుల కోసం పడిగాపులు
- లంచాలకు లొంగి రేషన్ కార్డు జారీ చేశారనే ఆరోపణలు
- బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి జూన్ 14 (జనం సాక్షి) : తెలంగాణలో ఒకే ఇంట్లో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా రేషన్ కార్డు జారీ అయినట్లుగా కొన్ని జిల్లాలో వెలుగులోకి వచ్చింది.అయితే ప్రభుత్వం జారీ చేసిన తాజా నిబంధనల ప్రకారం ఒక కుటుంబంలో ఒక్కరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా ఆ కుటుంబం రేషన్ కార్డుకు అనర్హులుగా పరిగణించబడతారు.రాష్ట్రంలో అనర్హులైన ఉద్యోగులు,అధిక ఆదాయ వర్గాల రూ.6 లక్షల కంటే ఎక్కువ వార్షిక ఆదాయం లేదా ఆదాయపు పన్ను చెల్లింపుదారుల ఏరివేత ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది.మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కొత్తగా లక్షలాది మంది అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డుల మంజూరు, పంపిణీని కూడా వేగవంతం చేసింది. జిల్లాలోని మల్దకల్ మండల కేంద్రానికి చెందిన ఒకే కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు నిర్వహిస్తున్నారు. వారిలో ఒకరు విద్యుత్ శాఖలో, మరొకరు వ్యవసాయ శాఖలో, ఇంకొకరు అంగన్వాడీ టీచర్ గా విధులు నిర్వర్తిస్తూ నెలకు ప్రభుత్వాల నుండి స్థిరమైన జీతాలు పొందుతున్నారు. ఇంతటి ఆర్థిక స్తోమత కలిగిన సదరు కుటుంబం పేరిట మల్దకల్ మండల కేంద్రంలో (రేషన్ కార్డు నంబర్: 369230128157) పై ఇప్పటికీ రేషన్ కార్డు కొనసాగుతుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.రేషన్ కార్డుల జారీ సమయంలో దరఖాస్తుదారుల వార్షిక ఆదాయం, ఉద్యోగ వివరాలు, కుటుంబ ఆర్థిక పరిస్థితులను పూర్తిగా పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే క్షేత్రస్థాయిలో సరైన దర్యాప్తు చేయకపోవడం వల్లే ఇలాంటి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు.గ్రామాల్లో ఎంతోమంది నిరుపేదలు, కూలీలు రేషన్ కార్డులు రాక సంక్షేమ పథకాలకు దూరమవుతుంటే,ప్రభుత్వ ఉద్యోగ కుటుంబాలకు రేషన్ కార్డులు ఎలా కొనసాగిస్తున్నారని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అంతటి ఆదాయం ఉన్నప్పటికీ సదరు కుటుంబానికి అక్రమంగా రేషన్ కార్డు మంజూరైందనే ఆరోపణలు రావడంతో ఇది స్థానికంగా పెద్ద దుమారాన్ని రేపింది. అనర్హులకు లభిస్తున్న ఈ సంక్షేమ లబ్ధిపై అధికారులు విచారణ చేపట్టే అవకాశం ఉంది.

# ఇరాన్ ఇంకా నిలబడే ఉంది..!

సంపాదకీయం
జనంసాక్షి

*చరిత్రలో చాలాసార్లు జరిగింది ఇది. బలవంతుడు బలహీనుడిని మోకాళ్ళపై వంచాలని తలపోశాడు. కానీ ఆ బలహీనుడు నేలను గట్టిగా పట్టుకుని నిలబడ్డాడు. ఇరాన్ ఈరోజు అదే పాత్ర పోషిస్తోంది. ఇజ్రాయిల్ మొదట గాజాపై దాడి మొదలుపెట్టింది. అది కేవలం హమాస్‌పై యుద్ధం కాదు, మొత్తం ప్రాంతంలో పునర్వ్యవస్థను రీసెట్ చేయాలన్న ప్రణాళిక. లెబనాన్, సిరియా, యెమెన్, ఇరాన్ ఒక్కొక్కటిగా లక్ష్యాలు మారాయి. అమెరికా వెనక నిలబడింది. ఆయుధాలిచ్చింది. రాజకీయ కవచమిచ్చింది. వీటో అధికారం వాడింది. కానీ ఒక్క ఇరాన్ మాత్రం లొంగలేదు.*

పర్షియన్ గల్ఫ్ నుంచి బయటపడే ఒకే ఒక్క మార్గం.. హార్మోజ్ జలసంధి. ప్రపంచ చమురు వ్యాపారంలో సుమారు 20 శాతం ఇక్కడి నుంచే సాగుతుంది. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఇరాక్.. వీరందరి చమురు ఎగుమతులు ఈ ఇరుకైన నీటిమార్గం మీదే ఆధారపడతాయి. యుద్ధం ముదిరినప్పుడల్లా ఇరాన్ ఒక్క మాట అంది చాలు "హార్మోజ్ మూసేస్తాం." ఆ మాటతోనే వాల్ స్ట్రీట్ కంపించింది. చమురు ధరలు గంటల్లో పెరిగాయి. పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలు చెమటలు కక్కాయి. ఇది బెదిరింపు కాదు.. భూగోళం ఇచ్చిన అస్త్రం.

అమెరికా నావికాదళం అక్కడ గస్తీ తిరుగుతోంది, నిజమే. కానీ ఇరాన్ తీరం వెంట వేలాది క్షిపణి బ్యాటరీలు, వేగంగా కదిలే చిన్న పడవలు, మైన్‌లు వేసే సామర్థ్యం ఇవన్నీ కలిపితే హార్మోజ్ ఒక శాశ్వత అనిశ్చితిగా మారుతోంది. యుద్ధం చేయడం సులభమైపోవచ్చు, కానీ ఆ జలసంధిని నియంత్రించడం అమెరికాకు కూడా అంత సులభం కాదు. ఇజ్రాయిల్ యుద్ధంలోకి దూకింది. లక్ష్యాలు పెద్దవయ్యాయి. కానీ గెలుపు ఎలా ఉంటుందో నిర్వచించలేకపోయింది. ఇరాన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేయడం సాధ్యమా? లేదు. ఆర్థిక ఆంక్షలతో మోకాళ్ళపై వంచడం సాధ్యమైందా? 45 సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నారు.. జవాబు కనిపిస్తూనే ఉంది. సైనికంగా ఓడించడం? హార్మోజ్ మూతపడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది అమెరికాకే ముందుగా. అమెరికా అధ్యక్షుడి ముందు రెండే దారులు.. లొంగిపోవడం లాంటి చర్చలు, లేదా అనంతమైన యుద్ధం. రెండూ రాజకీయంగా చేదు మాత్రలే.

వాషింగ్టన్‌లో నిరసన. లండన్‌లో నిరసన. తెల్ అవీవ్‌లో అవును, ఇజ్రాయిల్ లోపలే.. లక్షలాది మంది వీధుల్లోకి వచ్చారు. "ఇది మా పేరిట చేస్తున్న యుద్ధం కాదు" అని అరిచారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే చివరికి పెద్ద శక్తి. ఆ శక్తి తమ ప్రభుత్వాలకే వ్యతిరేకంగా నిలబడినప్పుడు నాయకత్వం చలించాల్సిందే. ఇరాన్ ప్రజలు కష్టాల్లో ఉన్నారు, నిజమే. ఆంక్షల వల్ల సాధారణ పౌరుల జీవితాలు కష్టంగా ఉన్నాయి. కానీ బాహ్య శత్రువు ముందు ఇరానీ జాతీయత మరింత బలంగా మారింది. చరిత్ర ఎప్పుడూ ఇదే చెప్పింది. ఇప్పుడు వినిపిస్తున్న మాటలు చూడండి.. "చర్చలు," "మధ్యవర్తిత్వం," "యుద్ధ విరమణ ఒప్పందం." ఇవి ఇరాన్ అడుగుతున్న మాటలు కావు. ఇవి అమెరికా, ఇజ్రాయిల్ వైపు నుంచి వస్తున్న సంకేతాలు. గెలుపు కోసం మొదలుపెట్టిన వారు ఇప్పుడు "గౌరవప్రదంగా బయటపడటం" ఎలాగా అని ఆలోచిస్తున్నారు. ఇది వ్యూహాత్మక వైఫల్యానికి అద్దం పట్టే సత్యం. ఇరాన్ మొదటి నుంచీ చెప్పింది. "మేము దాడి చేయం, కానీ దాడి జరిగితే తట్టుకుంటాం."ఆ మాటను నిజం చేసింది.

వియత్నాం అమెరికాను మోకాళ్ళపై వంచింది. ఆర్థికంగా, నైతికంగా. అఫ్ఘానిస్తాన్ 20 సంవత్సరాల తర్వాత అదే గుణపాఠం నేర్పింది. ఇరాన్ కూడా అదే సత్యాన్ని పునరావృతం చేస్తోంది. "ఒక జాతి తన భూమిపై నిలబడినప్పుడు, ఎంత పెద్ద సైన్యమైనా దాన్ని చిత్తు చేయలేదు." యుద్ధం ఎప్పుడూ బలవంతుడికి గెలుపు తీసుకురాదు. చివరికి నిలబడినవాడే చరిత్ర రాస్తాడు. ఇరాన్ ఇంకా నిలబడి ఉంది.

# బడుల పునఃప్రారంభంపై విశ్వాసాల నీడ




**(జూన్ 15న బడుల పునః ప్రారంభం వేళ)**

అజ్ఞానాన్ని తొలగించే అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య. ప్రశ్నించడం, పరిశోధించడం, సత్యాన్వేషణ చేయడం వంటి లక్షణాలను పెంపొందించేది విద్యే. కానీ ఈరోజు విద్యకే అమావాస్య చీకట్లు కమ్ముకుంటున్నాయి. తెలంగాణలో జూన్12కు బదులు జూన్ 15న విద్యాసంస్థలను తెరవాలనే విద్యాశాఖ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులలో చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే, సవరించిన ఈ తేదీ అమావాస్యతో ఏకీభవిస్తోంది, శుభమా అని అమావాస్య నాడు పిల్లలను పాఠశాలకు ఎలా పంపడమని విద్యార్థుల తల్లిదండ్రులు, నెటిజన్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అమావాస్య కారణంగా బడులు ప్రారంభ రోజు హాజరు శాతం తగ్గవచ్చని కూడా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రైవేట్ స్కూల్స్ జూన్ 12 తేదీ మంచి రోజు అని విద్యార్థులను పిలిచి ప్రారంభించారు. తదుపరి ఏ రోజు రావడమనేది విద్యార్థులకే వదిలిపెట్టారు. ఈ క్రమంలో రాజకీయ నాయకులు తాము పదవులు చేపట్టేటప్పుడు, నామినేషన్లు వేసేటప్పుడు, కొత్త పథకాలు ప్రారంభించేటప్పుడు మాత్రం ఖచ్చితంగా మంచి రోజు, ముహూర్తం చూసుకుంటారు కదా? మరి పిల్లల విద్యాసంవత్సరాన్ని ప్రారంభించడానికి మాత్రం ఇలాంటి సెంటిమెంట్స్ ఉండవా?" అని జనం ప్రశ్నిస్తున్నారు. నేడు కొత్త విద్యాసంవత్సర ప్రారంభం కూడా సెంటిమెంట్ తో ముడిపడింది. ఈ క్రమంలో రాజకీయ నాయకులు తీరు, తల్లిదండ్రుల సెంటిమెంటును పరిశీలిస్తే...మన సమాజంలో ఇంకా శాస్త్రీయ దృక్పథం ఎంత వెనుకబడి ఉందో అర్థమవుతుంది.

**అమావాస్య ఖగోళ సంఘటన**

వాస్తవంగా పిల్లల విద్య, ఆరోగ్యం లేదా భవిష్యత్తుపై అమావాస్య ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపదని సైన్స్ చెబుతుంది. అందువల్ల అమావాస్య కారణంగా పిల్లలను పాఠశాలకు దూరంగా ఉంచాలని పేరెంట్స్ అభిప్రాయ పడడం శాస్త్రీయ దృష్టిలో సమర్థించదగిన విషయం కాదు. ఖగోళ శాస్త్రం ప్రకారం అమావాస్య అనేది చంద్రుని దశలలో ఒకటి. చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతాడు. ఒక దశలో చంద్రుడు భూమి, సూర్యుని మధ్యకు వస్తాడు. ఆ సమయంలో చంద్రుని వెలుతురు పడే భాగం భూమికి ఎదురుగా ఉండదు. అందువల్ల భూమి నుండి చంద్రుడు కనిపించడు లేదా చాలా స్వల్పంగా కనిపిస్తాడు. ఇదే అమావాస్య. ఇది పూర్తిగా సహజమైన ఖగోళ సంఘటన మాత్రమే. ఇందులో ఎలాంటి శుభం, అశుభం, అదృష్టం, దురదృష్టం అనే అంశాలు లేవు. ఒకవైపు అంతరిక్ష పరిశోధనలు చేస్తున్నాం. ఇస్రో చంద్రునిపైకి రాకెట్ పంపుతోంది. కృత్రిమ మేధస్సు, డిజిటల్ విద్య, శాస్త్రీయ ఆవిష్కరణల్లో ముందుకు వెళ్తున్నాం. అయినా అమావాస్య, రాహుకాలం, వాస్తు, జాతకాల నిర్ణయాలనే ఇంకా నమ్ముతున్నాం. విద్య, ఉద్యోగం, వివాహం వంటి కీలక విషయాల్లో కూడా శాస్త్రీయ ఆలోచన కంటే భయాలు ప్రజలను గందరగోళంలోకి నెట్టుతున్నాయి. వీటి ప్రభావం విద్యార్థులపై పడి బాల్యదశలోనే అంధ విశ్వాసాలు నాటుకుంటున్నాయి. 50 రోజుల సుదీర్ఘ సెలవుల తర్వాత బడికి సిద్ధమైన విద్యార్థికి అమావాస్యను అడ్డం పెట్టి ఆపితే అతనిలోని శాస్త్రీయ ఆలోచనలను చప్పినట్లే కదా!. అందువల్లనే మంచిని గ్రహించి, చెడును విడిచిపెట్టే అభ్యుదయ సమాజ నిర్మాణానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ(హ్) చేర్చారు. ఇదీ ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం, పరిశోధనా స్ఫూర్తిని పెంపొందించాలనీ నొక్కి చెబుతుంది.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

## అజ్ఞానాన్ని తొలగించే ఆయుధం విద్యనే

అమావాస్య రోజు కొత్త పనులు ప్రారంభించకూడదు, పిల్లలను పాఠశాలకు పంపకూడదు, ప్రయాణాలు చేయకూడదనే నమ్మకాలు తప్పని మన సైన్స్ చెబుతుంది. ఇవన్నీ కూడా వర్ణ వ్యవస్థలో ఆదిపత్య సంప్రదాయ వాదులు తరతరాలుగా ప్రజల మనసుల్లో నూరిపోసిన తప్పుడు ఆచారాలు, విశ్వాసాలు. శాస్త్రీయ ఆధారాలు లేని ఇలాంటి అంధ విశ్వాసాల ఉచ్చులో బడుగు, బలహీన వర్గాలు పడి బలవుతున్నారు. చారిత్రకంగా కుల-వర్ణ ఆధారిత అసమానతలకు ఛాందస దృక్పథమే మూలకారణం. ఈ దృక్పథమే దళిత, బహుజనులను, ఉన్నత వర్గ మహిళలను చదువుకు దూరం చేసింది. పూలే, అంబేద్కర్ పోరాటం, భారత రాజ్యాంగం వల్ల అందరికీ విద్య చేరువైనది. కానీ ఆ చదువును మూఢ నమ్మకాల పరిధిలో బంధిస్తే అది మన అజ్ఞానానికి, మానసిక బలహీతకు పరాకాష్టగా మారుతుంది. సాంప్రదాయాలు, మూఢనమ్మకాల ప్రభావంతో ప్రశ్నించే స్వభావం తగ్గి, చదువు లక్ష్యం దెబ్బతింటోంది. అందువల్ల అమావాస్యను ఒక సహజ ఖగోళ సంఘటనగా, పిల్లల విద్యను అంశాలను శాస్త్రీయ ఆలోచనతో చూడడం ఆధునిక సమాజ లక్షణం. సంప్రదాయాలను గౌరవించాలి. కానీ అవి విద్యకు, అవకాశాలకు అడ్డంకిగా మారకూడదు. ప్రభుత్వ విధానాలు సైతం హేతుబద్ధంగా ఉండాలి. చీకటిని పారద్రోలీ, వెలుగు నింపే బలమైన ఆయుధం విద్య మాత్రమే. కావున తల్లిదండ్రులు అంధ విశ్వాసాలను వీడి తమ పిల్లలను పాఠశాలకు పంపండి. విజ్ఞానానికి బాటలు వేయండి.

# భారతదేశం ఒక చారిత్రక కూడలిలో...

నేటి భారతదేశం ఒక సాధారణ పరివర్తన దశలో కాదు. అది తన చరిత్రను, వర్తమానాన్ని, భవిష్యత్తును ఒకేసారి ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన చారిత్రక కూడలిలో నిలిచింది. ఈ దశలో దేశం సాధించిన పురోగతి ఎంత వాస్తవమో, అదే స్థాయిలో పెరిగిన అసమానతలు కూడా అంతే వాస్తవం. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా గుర్తింపు పొందింది. సాంకేతిక రంగం, అంతరిక్ష విజ్ఞానం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. కానీ ఈ అభివృద్ధి సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా చేరలేదన్నది కఠినమైన నిజం. ఆకలి, నిరుద్యోగం, రైతాంగ సంక్షోభం, విద్య-వైద్యాల అసమానతలు, కుల-లింగ వివక్షలు ఇవన్నీ "మరో భారతదేశం"గా మన ముందున్నాయి. ఈ రెండు భిన్న చిత్రాలు ఒకే దేశంలో సహజీవనం చేయడం యాదృచ్ఛికం కాదు; అది ప్రస్తుత అభివృద్ధి నమూనా స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది.

1991 అనంతర నయా ఉదారవాద విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను గణనీయంగా మార్చాయి. కానీ అదే క్రమంలో సంపద కేంద్రీకరణ, కార్పొరేట్ ఆధిపత్యం, ప్రజా రంగ బలహీనత, గ్రామీణ సంక్షోభం మరింత తీవ్రతరమయ్యాయి. అభివృద్ధి ఫలాలు కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతున్న పరిస్థితి ప్రజాస్వామ్యానికి సవాలుగా మారింది.నేటి భారత రాజకీయ ఆర్థిక వ్యవస్థలో కార్పొరేట్ శక్తుల ప్రభావం అనేక రంగాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. భూమి, ఖనిజాలు, బ్యాంకింగ్, మీడియా, డిజిటల్ వేదికలు వంటి కీలక రంగాల్లో ఈ కేంద్రీకరణ ప్రజా ప్రయోజనాలపై ప్రభావం చూపుతోంది. ఆర్థిక శక్తి రాజకీయ శక్తిగా మారుతున్న ఈ పరిణామం ప్రజాస్వామ్య సమతుల్యతను దెబ్బతీసే ప్రమాదాన్ని కలిగి ఉంది. ఇక ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల ప్రక్రియకు పరిమితం కావడం అత్యంత ఆందోళనకరం. ప్రశ్నించే హక్కు, విమర్శించే హక్కు, సంఘటితమయ్యే హక్కు, నిరసన తెలిపే హక్కు వంటి ప్రజాస్వామ్య మూల సూత్రాలు బలహీనపడినప్పుడు, వ్యవస్థ రూపంలో ప్రజాస్వామ్యం ఉన్నప్పటికీ దాని సారాంశం క్షీణిస్తుంది. లింగ అసమా నతలు ఇంకా పరిష్కారం పొందలేదు. ప్రాంతీయ అసమానతలు కొత్త ఉద్రిక్తతలకు దారి తీస్తున్నాయి. ఇవన్నీ కలిసి సమాజ నిర్మాణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో మతోన్మాద రాజకీయాల పెరుగుదల కూడా ఒక కీలక రాజకీయ వాస్తవం. సామాజిక-ఆర్థిక సమస్యలపై చర్చను పక్కదారి పట్టించి భావోద్వేగ ధ్రువీకరణను పెంచే ప్రయత్నాలు ప్రజాస్వామ్య సంభాషణను బలహీనపరుస్తున్నాయి. ఇది యాదృచ్ఛిక పరిణామం కాకుండా, ప్రస్తుత ఆర్థిక-రాజకీయ నిర్మాణంతో అనుబంధమైన ప్రక్రియగా చూడాల్సిన అవసరం ఉంది.

ఈ సమగ్ర పరిస్థితుల నేపథ్యంలో నేటి భారతదేశంలోని ప్రధాన వైరుధ్యం స్పష్టమవుతోంది. ఒకవైపు రాజ్యాంగం, లౌకికత, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం వంటి విలువలను కాపాడే శక్తులు; అందుకే నేటి దశలో కేవలం విమర్శలు సరిపోవు. ఒక స్పష్టమైన ప్రజా ప్రత్యామ్నాయం అవసరం. ఆ ప్రత్యామ్నాయం సామాజిక న్యాయం, లౌకికత, రాజ్యాంగ విలువలు, మహిళా సమానత్వం, పర్యావరణ న్యాయం మరియు ప్రజా సంక్షేమాన్ని కేంద్రంగా కలిగి ఉండాలి. అభివృద్ధి అనే భావనను కొద్దిమంది లాభాల నుండి కోట్లాది ప్రజల జీవితాలకు తిరిగి మళ్లించాల్సిన చారిత్రక అవసరం నేడు ఎదురుగా ఉంది.

చివరికి ప్రశ్న ఒకటే: భారతదేశం ఏ దిశగా ప్రయాణించాలి?

ఈ ప్రశ్నకు సమాధానం పాలక వర్గాల నిర్ణయాల్లో మాత్రమే కాదు--ప్రజల చైతన్యంలో, వారి సంఘటిత పోరాటాల్లో, ప్రజాస్వామ్య ఉద్యమాల శక్తిలో దాగి ఉంది.చరిత్ర నిశ్శబ్దంగా లేదు. అది అడుగుతోంది.సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఇప్పుడు సమాజంపైనే ఉంది.

మామిండ్ల రమేష్ రాజా,
రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్

# "ఆర్థిక వృద్ధి"పై ప్రభుత్వ ప్రచారాలు - గణాంకాల వాస్తవాలు




భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ప్రచారం పొందుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి రేటు 6.5 నుండి 6.6 శాతం మధ్య ఉండవచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు అంచనా వేస్తున్నాయి. అయితే ఒక ఆర్థిక వ్యవస్థ విజయాన్ని కేవలం జీడీపీ వృద్ధి ద్వారా మాత్రమే కొలవలేం. ఉపాధి, ఆదాయం, కొనుగోలు శక్తి, వ్యవసాయ స్థితి, విద్య, ఆరోగ్యం, సామాజిక సమానత్వం వంటి అంశాలు కూడా అంతే ముఖ్యమైనవి.

స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం ప్రభుత్వ రంగ ఆధారిత మిశ్రమ ఆర్థిక వ్యవస్థను నిర్మించింది. ఉక్కు కర్మాగారాలు, ఆనకట్టలు, విద్యుత్ ప్రాజెక్టులు, శాస్త్రీయ పరిశోధనా సంస్థలు, ఐఐటీలు, ప్రభుత్వ బ్యాంకులు వంటి నిర్మాణాలు దేశ పారిశ్రామికీకరణకు పునాది వేశాయి. 1991 తర్వాత సరళీకరణ విధానాలు ప్రారంభమయ్యాయి. 2014 తర్వాత ప్రైవేటీకరణ, కార్పొరేట్ ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు, ప్రభుత్వ రంగ సంస్థల విక్రయాలు మరింత వేగం పుంజుకున్నాయి.

ఈ కాలంలో అత్యంత కీలక నిర్ణయాల్లో ఒకటి 2019 కార్పొరేట్ పన్ను కోత. అప్పటి వరకు సుమారు 30 శాతం ఉన్న కార్పొరేట్ పన్నును 22 శాతానికి, కొత్త తయారీ పరిశ్రమలకు 15 శాతానికి తగ్గించారు. పెట్టుబడులు పెరుగుతాయని, ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. కానీ తరువాతి గణాంకాలు అంత స్పష్టమైన విజయాన్ని చూపలేదు.

పార్లమెంట్‌లో ప్రభుత్వం ఇచ్చిన వివరాల ప్రకారం కార్పొరేట్ పన్ను రాయితీలు, మినహాయింపుల వల్ల ప్రభుత్వానికి కోల్పోయిన ఆదాయం 2021-22లో ₹ 96,892 కోట్లు, 2022-23లో ₹ 88,109 కోట్లు, 2023-24లో దాదాపు ₹ 98,999 కోట్లు. అంటే ప్రతి సంవత్సరం సుమారు లక్ష కోట్ల రూపాయల మేర ప్రభుత్వ ఆదాయం తగ్గుతోంది. అయితే ఈ భారీ రాయితీలకు సమాన స్థాయిలో ఉద్యోగాల పెరుగుదల లేదా పారిశ్రామిక పెట్టుబడుల విస్ఫోటనం కనిపించలేదని విమర్శకులు పేర్కొంటున్నారు. దేశంలో సంపద పంపిణీ కూడా ఆందోళనకరంగా మారుతోంది. ప్రపంచ అసమానతలపై వచ్చిన అనేక అధ్యయనాలు భారతదేశంలో సంపద కేంద్రీకరణ పెరుగుతోందని సూచిస్తున్నాయి. దేశంలోని అత్యంత ధనిక వర్గం సంపద వేగంగా పెరుగుతుండగా, గ్రామీణ కుటుంబాల వాస్తవ ఆదాయాల పెరుగుదల నెమ్మదిగా సాగుతోంది. ఫలితంగా జీడీపీ పెరిగినా మార్కెట్‌లో విస్తృత కొనుగోలు శక్తి పెరగడం లేదు.

2016 నోట్ల రద్దు నిర్ణయం కూడా భారత ఆర్థిక చరిత్రలో కీలక మలుపు. అసంఘటిత రంగం, చిన్న వ్యాపారాలు, గ్రామీణ మార్కెట్లు తీవ్ర ప్రభావానికి గురయ్యాయి. భారతదేశంలో ఉపాధిలో సగానికి పైగా వాటా ఉన్న అసంఘటిత రంగం ఇప్పటికీ ఆ దెబ్బ నుంచి పూర్తిగా కోలుకోలేదని అనేక ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగాల విషయంలో పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. అధికారిక గణాంకాలు ఉపాధి పెరుగుదలను చూపించినా, ఉద్యోగాల నాణ్యతపై ప్రశ్నలు కొనసాగుతున్నాయి. 2017-18లో క్రమబద్ధ వేతన ఉద్యోగాలు మొత్తం ఉపాధిలో 22.8 శాతం ఉండగా, 2022-23 నాటికి అవి 20.9 శాతానికి తగ్గినట్లు కార్మిక గణాంకాల విశ్లేషణలు సూచిస్తున్నాయి. అంటే స్థిరమైన ఉద్యోగాల కంటే అస్థిరమైన ఉపాధి పెరుగుతోందన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి.

"మేక్ ఇన్ ఇండియా" ప్రారంభించి దశాబ్దం దాటినా తయారీ రంగం జీడీపీలో వాటా ఇంకా 15-17 శాతం మధ్యే ఉంది. చైనా అభివృద్ధి దశలో తయారీ రంగం 30 శాతానికి పైగా చేరి కోట్లాది ఉద్యోగాలను సృష్టించింది. భారతదేశం ఆ స్థాయికి ఇంకా చేరుకోలేదు. ఫలితంగా ప్రతి సంవత్సరం ఉద్యోగ మార్కెట్లోకి వచ్చే లక్షలాది యువతకు తగిన అవకాశాలు లభించడం లేదు. వ్యవసాయ రంగం పరిస్థితి కూడా అంత సంతృప్తికరంగా లేదు. జీడీపీలో వ్యవసాయం వాటా సుమారు 15 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జనాభాలో పెద్ద భాగం ఇంకా వ్యవసాయంపైనే ఆధారపడుతోంది. చిన్న కమతాలు, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, నీటి సమస్యలు, వాతావరణ మార్పులు రైతులపై ఒత్తిడి పెంచుతున్నాయి.

రూపాయి విలువ క్షీణత కూడా ఆర్థిక బలహీనతకు సంకేతం. 2014లో ఒక అమెరికన్ డాలర్ విలువ సుమారు రూ. 60-63 ఉండగా, ఇప్పుడు అది రూ. 96కు పైగా చేరిన స్థాయిలు నమోదయ్యాయి. రూపాయి బలహీనప డటం వల్ల చమురు, ఎరువులు, యంత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాల దిగుమతులు ఖరీదవుతున్నాయి. భారతదేశం తన ముడి చమురు అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపై ఆధారపడుతోంది. కాబట్టి అంతర్జాతీయ చమురు ధరల పెరుగుదల నేరుగా భారత వినియోగదారులపై ప్రభావం చూపుతోంది. విదేశీ పెట్టుబడుల విషయంలో కూడా మిశ్రమ చిత్రం కనిపిస్తోంది. ఇటీవలి కాలంలో స్థూల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరిగినా, తిరిగి వెనక్కి వెళ్లే పెట్టుబడులు, లాభాల తరలింపు కారణంగా నికర విదేశీ పెట్టుబడులు చాలా తక్కువ స్థాయికి పడిపోయిన సంవత్సరాలు ఉన్నాయి. ఇది పెట్టుబడి నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో కూడా సవాళ్లు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ద్రవ్య లోటు లక్ష్యాన్ని జీడీపీలో 4.9 శాతంగా నిర్ణయించింది. అంతకుముందు అది 5.8 శాతం స్థాయిలో ఉంది. ఇది ఆర్థిక క్రమశిక్షణకు సంకేతమే అయినప్పటికీ, అప్పులు, వడ్డీ చెల్లింపులు, సంక్షేమ ఖర్చులు, మౌలిక వసతుల పెట్టుబడుల మధ్య సమతుల్యతను కొనసాగించడం పెద్ద సవాలు.

అంతర్జాతీయ సూచికలు కూడా భారత అభివృద్ధి నమూనాపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. 2023 మానవాభివృద్ధి సూచికలో భారత్ 193 దేశాల్లో 130వ స్థానంలో నిలిచింది. ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న దేశానికి ఇది గొప్ప స్థానం కాదు. ఆరోగ్యం, విద్య, ఆదాయ పంపిణీ రంగాల్లో ఇంకా పెద్ద అంతరాలు ఉన్నాయని ఇది సూచిస్తోంది.

భారత ఆర్థిక వ్యవస్థకు అవసరమైనది కేవలం అధిక జీడీపీ వృద్ధి కాదు. వ్యవసాయ రంగంలో ఉత్పాదక పెట్టుబడులు పెరగాలి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు చౌక రుణాలు అందాలి. తయారీ రంగం వాటాను కనీసం 25 శాతం వరకు పెంచే దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. విద్య, ఆరోగ్యం, పరిశోధన రంగాలపై ప్రభుత్వ వ్యయం పెరగాలి. కార్మికుల వేతనాలు పెరిగి కొనుగోలు శక్తి బలపడాలి. పునరుత్పాదక ఇంధన రంగంలో భారీ పెట్టుబడులు పెట్టి చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలి. జీడీపీ వృద్ధి గణాంకాలు ఒక దేశానికి గర్వకారణం కావచ్చు. కానీ నిరుద్యోగ యువకుడు ఉద్యోగం కోసం ఎదురుచూస్తుంటే, రైతు అప్పులతో పోరాడుతుంటే, చిన్న వ్యాపారి మార్కెట్ కోసం తంటాలు పడుతుంటే, కేవలం వృద్ధి శాతాలను చూపించడం సరిపోదు. ఒక ఆర్థిక వ్యవస్థ విజయాన్ని చివరికి నిర్ణయించేది స్టాక్ మార్కెట్ కాదు, కార్పొరేట్ లాభాలు కాదు, జీడీపీ సంఖ్యలు కూడా కాదు. సాధారణ పౌరుడి జీవితం ఎంత మెరుగుపడిందనేదే అసలు ప్రమాణం. అదే ప్రశ్నకు భారత ఆర్థిక విధానాలు ఇంకా పూర్తిస్థాయి సమాధానం ఇవ్వాల్సి ఉంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# మౌన వీణ

*నేటి మొక్కలే రేపటి వృక్షాలు అన్నట్లుగా నేటి బాలలే రేపటి పౌరులు. ఈనాడు వారు నేర్చుకునే విద్యాబుద్ధులే రేపటి తరానికి ఆశాజ్యోతులు. నేల పదునుగా ఉన్నప్పుడే విత్తనాలు వేయాలన్నట్లు బాల్యంలోనే వారి బంగారు భవిష్యత్తుకు కావలసిన మూల్యాలను,మూలాలను తెలియపరచాలనే ఉద్దేశంతో నర్మెట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న కవయిత్రి, విదుషిమణి త్రిపురారి పద్మ పిల్లలలో మన తెలుగు భాష సంస్కృతుల పట్ల అవగాహనను పెంచడానికి తను పనిచేస్తున్న పాఠశాలనే ప్రయోగశాలగా చేసుకుని కవి సమ్మేళనం, భువన విజయం వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.*




సమాచార సాంకేతిక విప్లవం ఆవరించిన కాలంలో కూడా ఆమె తన పాఠశాల విద్యార్థులచే సినారె, చుక్క రామయ్య లాంటి ప్రముఖులకు లేఖలు రాయించి, వారి నుంచి వచ్చిన జవాబు లేఖలతో "అమృత లేఖలు" అనే సంకలనాన్ని వెలువరించడం అభినందనీయం. ఇటు పుట్టినిల్లు అటు మెట్టినిల్లు రెండు పండిత కుటుంబాలే కావడం వల్ల ఆ సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకున్న పద్మ ఒకవైపు తన విద్యార్థులచే రచన వ్యాసంగాన్ని కొనసాగింప చేస్తూనే మరోవైపు తన ప్రతిభను మొక్కవోనీయకుండా కవిత్వాన్ని వెలువరిస్తున్నారు. ఇలా ఇప్పటివరకు ఆమె వెలువరించిన మౌన వీణ, చిద్విలాస శతకము, పూలదండ మొదలైన ముద్రిత రచనలతో పాటు మరెన్నో గేయాలు, పాటలు ఉన్నాయి. అవన్నీ ఇటు పిల్లలచే అటు వర్ధమాన గాయకులచే గానం చేయబడి బహుళ ప్రచారంలోని ఉన్నాయి.

ఒకచోట తన రచనల నేపథ్యాన్ని గురించి ఆమె రాస్తూ "పిల్లలను ప్రేమించడమే నాకు ప్రాణవాయువులా అనిపిస్తుంది. నిష్కల్మషమైన మనసున్న చందమామ లాంటి పిల్లలతో గడపడం కన్నా మరొక సంతృప్తికరమైన పని లేదు. ఆ భావనే నాలోని రచన వ్యాసంగాన్ని తట్టి లేపి పిల్లలకు సంబంధించిన రచనలు చేసేలా ప్రోత్సహించాయి"అనే మాటలు వీటిని చదివినప్పుడు అక్షర వాస్తవం అనిపిస్తుంది. మొదటి కవితా సంపుటి మౌన వీణలో అరవై నాలుగు కళలు అన్నట్లు ఇందులో 64 కవితలు రాసింది. మంగళా దీని, మంగళ మధ్యానీ, మంగళాంతాని కావ్యాని అన్నట్లు వినాయకుని స్తుతితో ఆరంభించి ఆధునిక కాలంలో కాళికలా ఆడపిల్ల అగ్గి బరాటా కావాలని ప్రబోధిస్తుంది. దైవభక్తి, దేశభక్తి, సామాజిక సమస్యల పట్ల అనురక్తి అన్నవి వెరసి త్రివేణి సంగమం పద్మ కవిత్వంలో అంతర్వాహినులై ప్రవహిస్తున్నాయి. ఉదాహరణకు అమ్మదనమున ఎంత కమ్మదనం ఉన్నదో తెలియజేస్తూ "చిటికెన వేలే చిరు జగత్తుగా, బ్రతుకు నేర్పే ఆది గురువు అమ్మ" అని తండ్రిని గురించి చెబుతూ "కరుగుతూ వెలుగునిచ్చే, జీవన రేఖగా" భావిస్తుంది. కాయకష్టం చేసి బతుకునీడ్చే బడుగు జీవుల పిల్లలకు విద్యనందిస్తున్న పాఠశాలలను కుదించి వేయబోతున్న తరుణంలో అందులో చదువుకుంటున్న పిల్లల సామాజిక ఆర్థిక పరిస్థితుల్ని గుర్తు చేస్తూ "ప్రభుత్వ బడి అంటే చదువులమ్మ గుడి" అని మనకు జ్ఞాపకం చేస్తుంది. అలాగే మాతృభాష తెలుగు గొప్పతనాన్ని వివరిస్తూ "మల్లెలమ్మ విరిగంధం, మంచి మనసు మకరందం, మందారపు సుమ గంధం, అమ్మ భాష సొగసందం" అని వర్ణిస్తుంది. పద్మ గారికి సంస్కృతి పట్ల ఎంత ఆసక్తి ఉందో మరోవైపు సామాజిక సమస్యల పట్ల అంతే ఆసక్తి ఉందని ఆమె కవితలు వెల్లడిస్తున్నాయి. మచ్చుకు తెలంగాణలో జరిగిన పత్తి రైతుల ఆత్మహత్యల్ని ప్రస్తావిస్తూ, వాళ్లలో ధైర్యాన్ని నూరిపోస్తూ బ్రతుకు పట్ల ఆశను రేకెత్తిస్తూ "చిగురాశల సవ్వడిలో ఆశల పంట వెలుగన్నా!" అని భరోసా కల్పిస్తుంది. బాధ్యత కలిగిన కవులు, రచయితలు బతుకు పట్ల,భవిష్యత్తు పట్ల చైతన్యాన్ని కలిగించడమే కర్తవ్యం గా కలాలను కదిలించాలి. అందుకు ఇది స్ఫూర్తిని కలిగిస్తుంది. అలాగే నేతన్నలను గురించి రాస్తూ "కనుకొనలలోన కొడిగట్టిన ,వెలిగెడు కాంతిని, కండెల దారపు ఉండగ చేసిన నేతన్న" అని గంభీరంగా వివరిస్తుంది. సిరిసిల్లలో పుట్టి పెరగడం వల్ల అక్కడి చేనేత కార్మికుల సమస్యలను కళ్ళారా చూచిన కవయిత్రి కనుకనే పద్మ అంత ఆర్ద్రంగా రాసింది. కాగా తెలుగు సాహిత్య ఉద్యానంలో సతత హరితంగా భాసిల్లుతున్న విశిష్ట ప్రక్రియ శతకం. చిన్మయ! శశిధరా! హర! చిద్విలాస! అనే మకుటంతో తేట తెలుగు తేటగీతుల్లో కొనసాగిన ఈమె శతక రచన "ఆత్మ నివేదనకు" అక్షర రూపాన్ని అందించింది. ఉదాహరణకు "ఇతరులం దునెపుడు దోషమెంచకుండ, నాది తప్పు నెరిగి నేను నడచు నటుల, కనికరించు దేవ! దయను కలిగియుండి"అని ప్రార్థిస్తుంది. వేమన కూడా అందుకే "తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరు" అన్నాడు. అలాగే సోమరితనం కూడదని చెబుతూ "సోమరితనమందున నెట్టి శోభరాదు, బద్ధకమె జనులందరి బద్ద వైరి, బద్ధకంబు వదలకున్న భవిత లేదు" అని నేటి తరానికి ప్రబోధిస్తుంది. బాల సాహిత్యానికి సంబంధించి వివిధ రకాల పూలను తెచ్చి దండగా గుదిగుచ్చినట్టుగా రకరకాల భావాలను ప్రోది చేస్తూ పద్మ వెలువరించిన "పూలదండ" బాల గేయాలు బంగరు భవిష్యత్తుకు సోపానాలు. సంస్కృతి నాగరికతలు, పర్యావరణ పరిరక్షణ, మానవతా విలువల పట్ల అవగాహనను ఆసక్తిని రేకెత్తించి పిల్లలలో పాదుకొనేలా చేయడానికి ఈ గేయాలు ఎంతో స్ఫూర్తినిస్తాయి. ఒకనాడు చందమామ, బొమ్మరిల్లు లాంటి పత్రికలు బాలసాహిత్యాన్ని పరిపుష్టం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. ఉత్పల లాంటి మహాకవులు అర్జునుని తీర్థయాత్ర, గంగావతరణం లాంటి గేయ కావ్యాలు రాశారు. ఇటీవల కాలంలో తెలంగాణ సారస్వత పరిషత్తు వారు రాష్ట్రంలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుల ద్వారా గేయాలను, కథలను రచింపజేసి బాల సాహిత్యాన్ని అందిస్తున్నారు.

త్రిపురారి పద్మ స్వయంగా ఉపాధ్యాయురాలు కనుక ప్రశ్న వేయడం, తద్వారా పిల్లలలో ఆలోచన శక్తిని రేకెత్తించడం మరల వారిచేత జవాబులు రాబట్టడం అనేవి బోధన అభ్యసన ప్రక్రియలో భాగమైనా, రచనల్లో అదొక శిల్పంగా భాసించింది. ఉదాహరణకు "మనుజుల దైవం ఇతనంట ఎవరో?ఎవరో? చెప్పమ్మా! " అని ప్రశ్నించి సమాధానాన్ని రాబడుతుంది. ముఖ్యంగా వివిధ సామాజిక నేపథ్యాల నుంచి, స్వభావాల నుంచి వచ్చే పిల్లలకు నీతిని ప్రబోధించడానికి కూరగాయలను ప్రతీకగా తీసుకొని ఆమె రచించిన "కూరగాయల బడి" అనే కవితను రాష్ట్రవ్యాప్తంగా చదివే ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యాంశంగా నేర్పదగినది. భక్తిసాంద్రమై భావుకతతో కూడిన ఆమె కలం నుండి మరెన్నో రచనలు వెలువడాలని ఆశిస్తూ, అభినందిస్తున్నాను.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

## ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

- ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్



**చేవెళ్ల, జూన్ 14 (జనంసాక్షి) :** ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ వస్తువులను బలవంతంగా విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆరోపించారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో అంబేద్కర్ భవన్లో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ ముఖ్య కార్యకర్త సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యను వ్యాపారంగా మార్చి ఇష్టానుసారంగా ఫీజులు పెంచడం బాధాకరమన్నారు. విద్యార్థులు పాఠశాలల వద్ద నుంచే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తేవడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న, పుస్తకాలు--యూనిఫాంల విక్రయాలను బలవంతం చేస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్ గౌడ్, మాల చందు, డివిజన్ ఉపాధ్యక్షులు మణికంఠ, డివిజన్ నాయకులు వినోద్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎకో టౌన్‌కు వ్యతిరేకంగా ప్రజాగర్జన

- 15 గ్రామాల ప్రజల ప్రాణాలను కాపాడండి
- జీవో నెం.20 రద్దు చేయాలి
- డంపింగ్ యార్డ్ మాకొద్దు..
- యూనివర్సిటీ ఏర్పాటు చేయండి
- భారీ పాదయాత్ర, రోడ్డుపై బైఠాయించి నిరసన

**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 14 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గువ్వలేటి గ్రామ ఎక్స్‌రోడ్ నుండి చిన్న రావిరాల, బండరావిరాల మీదుగా సద్దుపల్లి ఎక్స్‌రోడ్ వరకు ఆదివారం ఎకో టౌన్ పేరుతో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు భారీ పాదయాత్ర నిర్వహించారు. చిన్న రావిరాల సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పాదయాత్రలో 15 గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా గళమెత్తారు.సుమారు ఐదు కిలోమీటర్ల మేర సాగిన ఈ పాదయాత్రలో మహిళలు, యువకులు, రైతులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "గో బ్యాక్ ఎకో టౌన్", "డంపింగ్ యార్డ్ మాకొద్దు", "ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దు", "జీవో నెంబర్ 20 రద్దు చేయాలి" అంటూ నినాదాలతో ప్రాంతమంతా మారుమోగింది.సద్దుపల్లి ఎక్స్‌రోడ్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించిన ప్రజలు రోడ్డుపై



బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం సర్వే నెంబర్ 268లోని 494 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఎకో టౌన్ పేరుతో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలనే ప్రయత్నం ప్రజల జీవితాలతో ఆడుకోవడమేనని మండిపడ్డారు.వారు మాట్లాడుతూ ఇప్పటికే మూసీ నది కాలుష్యం, పరిసర ప్రాంతాల్లో ఉన్న క్రషర్ మిల్లుల కారణంగా ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో నగర ప్రాంతాల చెత్తను గ్రామీణ ప్రాంతాల్లో పడేసే విధంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో భూగర్భ జలాలు కలుషితమవుతాయని, పచ్చని వ్యవసాయ భూములు నాశనమవుతాయని, రైతుల జీవనాధారం దెబ్బతింటుందని పేర్కొన్నారు. చెత్త నిల్వల వల్ల దుర్వాసనలు వ్యాపించి ప్రజలు శ్వాసకోశ వ్యాధులు, చర్మవ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రభుత్వం ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని వెంటనే జీవో నెంబర్ 20ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్‌కు బదులుగా విద్యా సంస్థలు, యూనివర్సిటీలు, పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి, విద్యా అవకాశాలు కల్పించాలని కోరారు. కాలుష్యాన్ని పెంచే ప్రాజెక్టులకు బదులుగా అభివృద్ధి, ఉపాధి కల్పించే సంస్థలను ఏర్పాటు చేస్తే ప్రాంత భవిష్యత్తు బాగుంటుందని అభిప్రాయపడ్డారు."మా గ్రామాల ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు, రైతుల వ్యవసాయం ప్రమాదంలో పడేలా ఎలాంటి ప్రాజెక్టులను మేము అంగీకరించము. ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి కలెక్టరేట్ ముట్టడి, మహాధర్నాలు, నిరవధిక ఆందోళనలు చేపడతాం" అని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, రైతులు, మహిళలు, యువకులు, విద్యార్థులు, బాధిత గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని ఎకో టౌన్‌కు వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు.

## మందుముల పరమేశ్వర్ రెడ్డి కృషితో పెద్ద చెరువు సుందరీకరణ పనులకు శ్రీకారం

- హైడ్రా ఆధ్వర్యంలో అభివృద్ధి పనుల ప్రారంభం
- చిలుకానగర్ వాసులకు దోమల బెడదకు చెక్
- ఆహ్లాదకరంగా మారనున్న పెద్ద చెరువు పరిసరాలు

**ఉప్పల్, జూన్ 14 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు మందుముల పరమేశ్వర్ రెడ్డి కృషి ఫలితంగానే పెద్ద చెరువు సుందరీకరణ పనులు ప్రారంభమవుతున్నాయని చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్ల ప్రజలు పెద్ద చెరువులో పేరుకుపోయిన మురుగు, కలుషిత నీటి కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మందుముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను పరమేశ్వర్ రెడ్డి పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు. ప్రజల



సమస్యల పట్ల స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పెద్ద చెరువు సుందరీకరణ మరియు అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులను మంజూరు చేశారని అన్నారు. ఆ నిధులతో హైడ్రా ఆధ్వర్యంలో పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో, కొందరు నాయకులు ఈ పనులను తమ కృషి ఫలితంగా చూపించే ప్రయత్నం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. పెద్ద చెరువు సుందరీకరణకు నిధుల మంజూరు, పనుల ప్రారంభం అన్నీ మందుముల పరమేశ్వర్ రెడ్డి నిరంతర కృషి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల స్పందన వల్లే సాధ్యమయ్యాయని రాజేష్ ముదిరాజ్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పెద్ద చెరువు సుందరీకరణ పూర్తయితే పరిసర ప్రాంతాల్లో దోమల సమస్య గణనీయంగా తగ్గడంతో పాటు, చెరువు పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా మారనున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ పనులు దోహదపడతాయని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారని, వాస్తవాలను గుర్తించి తగిన సమయంలో ప్రజలే సరైన తీర్పు ఇస్తారని ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ పేర్కొన్నారు.

## ఆయిల్‌ఫామ్, నీలగిరి తోట దగ్ధం



**నంగునూరు, జూన్ 14 (జనం సాక్షి) :** మండలం పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చల్లారం రవీందర్ రెడ్డి, చల్లారం, సురేందర్ రెడ్డి, చల్లార వెంకటకృష్ణారెడ్డికి సంబంధించిన నర్మేట శివారులో గల 4 ఎకరాల ఆయిల్ ఫామ్ తోట, డ్రిప్పు స్పింకర్ పైపులు , చల్లారం గాల్ రెడ్డికి సంబంధించిన 1 ఎకరం నీలగిరి తోట మంటల్లో పూర్తిగా దగ్ధం కావడం జరిగింది. దీనితో భారీ నష్టం వాటిల్లింది. బాధితులు చల్లారం రవీందర్ రెడ్డి ,చల్లారం సురేందర్ రెడ్డిలు మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారని, అనుమానం వ్యక్తం చేస్తూ, తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరడం జరిగింది, అదేవిధంగా ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించుకున్నారు.ఈ దగ్ధమైన ఆయిల్ ఫామ్ తోటను సర్పంచ్ చేర్యాల రాజు , ఉప సర్పంచ్ కలకుంట్ల యాదగిరి, వార్డ్ మెంబర్ అంజయ్య సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పడం జరిగింది.

## ఆదిభట్ల పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

- పోలీసుల ఏకపక్ష చర్యలపై హిందూ వాహిని, బీజేపీ భారీ నిరసన

**ఇబ్రహీంపట్నం, జూన్ 14 (జనం సాక్షి) :** ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిసరాల్లో శనివారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బొంగుళూరులోని సప్తగిరి కాలనీలో మతపరమైన ప్రచారం విషయమై రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ రాజకీయ, సామాజిక ఉద్రిక్తతకు దారితీసింది. బొంగుళూరు పరిధిలోని సప్తగిరి కాలనీలో ఉన్న ఒక నివాస గృహంలో అన్యమత ప్రచారం సాగుతోందనే పక్కా సమాచారంతో హిందూ వాహిని సంఘానికి చెందిన నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న క్రిస్టియన్ పాస్టర్లకు, హిందూ సంఘాల ప్రతినిధులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘర్షణ పరస్పర తోపులాటకు దారితీయగా, హిందూ సంఘాల నేతలు తమపై భౌతిక దాడికి పాల్పడ్డారని క్రిస్టియన్ మత పెద్దలు ఆరోపించారు. సమాచారం అందుకున్న ఆదిభట్ల పోలీసులు ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే, పోలీసులు ఈ ఘటనపై ఏకపక్షంగా వ్యవహరించారంటూ హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. గొడవకు కారణమైన క్రిస్టియన్ పాస్టర్లను వదిలేసి, కేవలం హిందూ వాహిని నేతలపైనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై బీజేపీ, హిందూ సంఘాల నేతలు మండిపడ్డారు.పోలీసుల పక్షపాత వైఖరిని నిరసిస్తూ వందలాది మంది హిందూ వాహిని, బీజేపీ కార్యకర్తలు ఆదిభట్ల పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. పోలీస్ స్టేషన్‌ను ముట్టడించే ప్రయత్నం చేస్తూ ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అన్యాయంగా పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఇరువర్గాలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.పరిస్థితి చేయిదాటకుండా చూసేందుకు ఉన్నతాధికారులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. పోలీస్ స్టేషన్ పరిసరాల్లో భారీగా భద్రతను మోహరించి, నిరసనకారులను శాంతింపజేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే కొనసాగుతోంది.



## డాక్టర్లు లేని ప్రభుత్వ దవాఖానా..

- పేదల ప్రాణాలతో చెలగాటం
- ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు గైర్హాజరు
- జ్వరంతో వచ్చిన మహిళను ప్రైవేట్ ఆసుపత్రికి పంపిన సిబ్బంది..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



**మోమిన్‌పేట, జూన్ 14 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దుర్గం చెరువు గ్రామానికి చెందిన ఓ మహిళ తీవ్రమైన చలి జ్వరంతో బాధపడుతూ వైద్యం కోసం ఆసుపత్రికి రాగా, అక్కడ డాక్టర్లు లేరని సిబ్బంది చెప్పి ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాలని సూచించినట్లు సమాచారం. దీంతో ఆమె తప్పనిసరి పరిస్థితుల్లో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాల్సి వచ్చింది. ప్రజలకు ఉచిత వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "పేదల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ దవాఖానలోనే వైద్యం అందకపోతే పేద ప్రజలు ఎక్కడికి వెళ్లాలి..? ప్రైవేట్ ఆసుపత్రుల ఖర్చులు భరించే స్తోమత లేని నిరుపేదల పరిస్థితి ఏమిటి..?" అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. "ప్రజల ఆరోగ్యంతో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు.. ప్రభుత్వ దవాఖానలు ప్రజలకు అందుబాటులో లేకపోతే వాటి అవసరం ఏమిటి..?" అంటూ మండల ప్రజలు ఘాటుగా ప్రశ్నిస్తున్నారు.

# దళిత, బహుజనులు చైతన్యం కావాలి


**బోడుప్పల్, జూన్ 14 (జనంసాక్షి) :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 382వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి భారత రాజ్యాంగ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ మన రాజ్యాంగం భారతీయులందరికీ సమానమైన హక్కులు, విధులు, కల్పించిందని, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం రిజర్వేషన్లు కల్పించిందని, స్వాతంత్రం వచ్చి సుమారు 80 సంవత్సరాలు గడిచిన బడుగు, బలహీన వర్గాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందాలేదని నాతిమస్య ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రతి ఒక్కరు భారత రాజ్యాంగాన్ని చదివినప్పుడే అందులో పొందుపరిచిన అన్ని అంశాలు తెలుస్తాయని, ముఖ్యంగా బడుగు, బలహీన, బహుజన వర్గాల ప్రజలు రాజ్యాంగం తమకు కల్పించిన హక్కులను వినియోగించుకోకుండా నిరుపేదలుగానే ఉన్నారని, వారు చైతన్యవంతులై డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు విజ్ఞానవంతులు కావాలని, విద్య, వైద్య ,రాజకీయ, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, రాపోల శ్రీరాములు, గరుగుల యాకయ్య, రాపోలు వెంకటేష్, మేడే శ్రీకాంత్, గణేష్ రామకృష్ణ, మాలాద్రి, వెంకటేశ్వర్లు, జె శ్రీనివాస్, బెక్కంశివ, జి వెంకటేశ్వర్ లుఉప్పరి అనిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

**నిజాంపేట్, జూన్ 14 (జనం సాక్షి) :** సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి ప్రగతి నగర్ లోని జిపిఆర్ లేఔట్ కాలనీవాసులు కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు వంటి మౌలిక వసతులను కల్పించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని కాలనీలలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వై.ఎస్, కాలనీవాసులు రమణారెడ్డి, శ్యామ్ సింగ్, శివ నాగరాజు, వెంకట దుర్గాప్రసాద్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునర్విమర్శ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియ కొనసాగాలి
- ఉప్పల్ నియోజకవర్గంలో బూత్ స్థాయి ప్రతినిధులకు అవగాహన సదస్సు

**ఉప్పల్, జూన్ 14 (జనం సాక్షి) :** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునర్విమర్శ ప్రక్రియపై ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితాల సవరణ అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని బూత్ స్థాయి ప్రతినిధులకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునర్విమర్శ ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉప్పల్ భగాయత్‌లోని శ్రీ రస్తు ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి పార్లమెంటు పరిధి బాధ్యులు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, ఇందిర శోభన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఓటరు జాబితాల పునర్విమర్శ ప్రక్రియ అమలులో ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు. నిజమైన ఓటర్ల పేర్లు పొరపాటున జాబితా నుంచి తొలగించబడకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించి, పునర్విమర్శ ప్రక్రియను సజావుగా నిర్వహించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా వెలుపల ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు తమ ఓటరు వివరాలను స్వయంగా పరిశీలించుకుని, అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఖచ్చితమైన,



విశ్వసనీయమైన ఓటరు జాబితాలు అవసరమని, ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ ప్రత్యేక సమగ్ర పునర్విమర్శ ప్రక్రియ ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి ప్రతినిధులు, ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని విభాగాల అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
15 జూన్ 2026

# వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

- రైతులు అధైర్యపడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది
- జిల్లాలో యూరియా కొరత లేకుండా ఆన్‌లైన్ విధానంలో సరఫరా చేస్తాం
- పెద్దాపూర్, లక్ష్మాపూర్ వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**ఉప్పునుంతల, జూన్ 14 (జనంసాక్షి) :** ఉప్పునుంతల మండల పరిధిలోని పెద్దాపూర్, లక్ష్మాపూర్ గ్రామాల్లో ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఇటీవల జిల్లాలో కురిసిన అకాల భారీ వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం పరిస్థితిని స్వయంగా పరిశీలించిన కలెక్టర్, రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శనివారం కురిసిన భారీ వర్షాలకు వరి ధాన్యం తడిసిన విషయం తన దృష్టికి వచ్చినందున కొనుగోలు కేంద్రాలను ప్రత్యక్షంగా సందర్శించినట్లు కలెక్టర్ తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ఎక్కువ కాలం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచకుండా వెంటనే బాయిల్ మిల్లులకు తరలించాలని, ఇందుకోసం రవాణా ఏర్పాట్లను వేగవంతం చేయాలని సివిల్ సప్లైస్, ఐకేపీ, మెప్మా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ధాన్యం నిల్వలు, తేమ శాతం, తూకం ప్రక్రియ, హమాలీల ఏర్పాటు, రవాణా సదుపాయాలు, రైతులకు అందిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాల కారణంగా ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే అదనపు టార్పాలిన్లు, కవర్లు ఏర్పాటు చేసి ధాన్యాన్ని రక్షించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం రైతులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ధాన్యం తడవడం, కొనుగోలు ప్రక్రియ ఆలస్యమవుతుందనే ఆందోళన రైతుల్లో కనిపించడంతో వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఎవ్వరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రైతుల శ్రమ వృథా కాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు, జాప్యాలు జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కువసేపు వేచి ఉండకుండా వేగవంతంగా తూకాలు నిర్వహించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే బాయిలర్ మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులకు చెల్లింపులు కూడా సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా రైతులు ఈ వర్షాకాల సాగు సీజన్‌కు అవసరమైన యూరియా ఎరువుల లభ్యతపై కొరత లేకుండా చూడాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో కొన్ని ప్రాంతాల్లో యూరియా కోసం ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈసారి ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. రైతుల విజ్ఞప్తిపై స్పందించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లాలో యూరియా కొరత తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ విధానంలోనే యూరియా పంపిణీ జరిగేలా వ్యవసాయ శాఖ ద్వారా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. అవసరమైన నిల్వలను ముందుగానే సమకూర్చి ప్రతి రైతుకు సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగు సలహాలు అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ సూచించారు. ఈ వర్షాకాల వ్యవసాయ సీజన్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, రైతులకు అవసరమైన సేవలు గ్రామ స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఎటువంటి లోపాలు చోటుచేసుకోకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నరసింహా రావు, ఉప్పునుంతల మండలం తాహసిల్దార్ అద్దంకి సునీత ఎంపీడీవో వరుణ్ తేజ్ వ్యవసాయ శాఖ మండల అధికారి రమేష్ నాయక్ మార్కెటింగ్ శాఖ, సివిల్ సప్లైస్ శాఖ, ఐకేపీ, మెప్మా అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు ఉన్నారు.

## పాలమూరులో జరిగే వ్యవసాయ కూలీ సభను జయప్రదం చేయండి

- సిపిఎం మండల కార్యదర్శి డి.బాల్ రెడ్డి



**వీపనగండ్ల, జూన్ 15 (జనం సాక్షి) :** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం వీపనగండ్ల మండల కమిటీ సమావేశం మహబూబ్ బాషా అధ్యక్షతన పార్టీ మండల కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి డి.బాల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి బడ్జెట్ లో కోత విధించడం,పథకం పేరు మార్చి రోజుకు రెండుసార్లు ఫోటోలు దింపే పద్ధతి వల్ల కూలీలు చాలా ఇబ్బందులు గురవుతున్నారు అని అన్నారు. పాత పద్ధతిలోనే ఈ వ్యవస్థ ఉండాలని 200 రోజులు పని దినాలు రోజుకు 600 రూపాయలు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీ సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం దేశవ్యాప్తంగా పోరాటం చేస్తుందని,ఈ సందర్భంలోనే మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు జూన్ 20,21,22వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 20న రాష్ట్ర స్థాయి బహిరంగసభ నిర్వహిస్తున్నామని,ఈ సభకు ముఖ్యఅతిథిగా త్రిపుర మాజీ ముఖ్యమంత్రి సిపిఎం పొలిటి బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సభను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. వర్షాకాలం ప్రారంభమైన నేటికీ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలలో వడ్లు ఇంకా కొనుగోలు కాక పోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు,యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసి, రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని మండల కమిటీ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు మహబూబ్ పాషా,రవిప్రసాద్, మండల నాయకులు వి కృష్ణయ్య,ఆశన్న,ఈశ్వర్, సిహెచ్. వెంకటయ్య,ఖాజా హుస్సేన్,నిరంజన్,బాల గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రణాళిక ఉత్తదే..

- పడకేసిన పారిశుద్ధ్యం, అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం..



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 14 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో పారిశుధ్య నిర్వహణ పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ పలు ప్రాంతాల నుండి ఫిర్యాదులు, విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య సమస్యల తీరుపై వస్తున్న,గద్వాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ పెట్రోల్ బంక్ సమీపంలో గల అమ్మ హాస్పిటల్ వద్ద మురుగుకాల్వ చెత్తాచెదారంతో నిండిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు చేరి అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య నిర్వహణ పడకేసిందని, ప్రభుత్వం ఈ ప్రణాళికలో పరిశుభ్రతకు అగ్రతాంబూలం ఇస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో చాలా మున్సిపాలిటీలు మరియు వార్డుల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయని, దుర్వాసన, దోమల బెడద,మురుగు పేరుకుపోవడం, రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో ఆయా ప్రాంతాల్లో తీవ్రమైన దుర్వాసన వస్తోందని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 16వ వార్డు నవరంగ్ టాకీస్ ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ పైప్లాన్ కోసం తవ్విన గుంతను పూడ్చకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు కిందపడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లోపం లేకుండా ముఖ్యమంత్రి నేరుగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించినప్పటికీ స్థానిక అధికారులు, మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్షాల ఆందోళనలు, నిర్దిష్ట ప్రాంతాలలో పారిశుధ్య కార్మికుల సమస్యలు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల కూడా చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో మొదటి వారం పూర్తిగా పారిశుధ్యానికే కేటాయించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షణ లోపించిందని నివేదికలు చెబుతున్నాయి.

## క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**కొల్చారం, జూన్ 14 (జనం సాక్షి) :** మండల కేంద్రం కొల్చారంలో యువకులకు వాలీబాల్ కిట్లు అందించిన కొల్చారం బిఆర్ఎస్ మండల యువత అధ్యక్షులు సంతోష్ రావు మాట్లాడుతూ యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తమ జీవితాలను సరైన దారిలో మలుచుకోవాలని ప్రతి ఒక్క యువకుడు క్రీడల్లో మంచి నైపుణ్యాన్ని కనబరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్చారం బి ఆర్ఎస్ అధ్యక్షులు దుర్గ ప్రసాద్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ అంజనిపుత్ర కొల్చారం యువత అధ్యక్షులు వనమాల శ్రీధర్ వార్డు సభ్యులు చింతల కృష్ణ నేరెళ్ల సత్యనారాయణ ,భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

- కేపీఎల్ టోర్నమెంట్ విజేత లయన్స్ జట్టు



**కొల్చారం, జూన్ 14 (జనం సాక్షి) :** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతోపాటు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని టిఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు చౌరి గారి భాస్కర్ స్పష్టం చేశారు. మండల కేంద్రమైన కొల్చారంలో దివంగత ముత్యం ప్రవీణ్ కుమార్ స్మారకార్థం కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంటును చౌరి గారి భాస్కర్ తన సొంత డబ్బులతో ప్రవీణ్ కుమార్ పై ఉన్న అభిమానంతో ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు గ్రామానికి చెందిన యువకులు ఆరు జట్లుగా ఏర్పడి టోర్నమెంటులో పాల్గొన్నారు. ఆదివారం నాడు ఫైనల్ మ్యాచ్ లో లయన్స్ జట్టు, వారియర్స్ జట్టు, పోటీ పడగా రన్నర్‌గా వారియర్స్ జట్టు, ఫైనల్ విజేతగా లయన్స్ జట్టు గెలుపొందారు. ఫైనల్ విజేతకు కేపీఎల్ ట్రోఫీతో పాటు 4000 రూపాయలు నగదు పురస్కారం అందజేశారు. రన్నర్ విజేతకు రన్నర్ ట్రోఫీ తో పాటు 2000 రూపాయలు నగదు పురస్కారం అందజేశారు. అలాగే మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ బ్యాగరి కృష్ణ, అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాగల్ల ఆనంద్, ముత్యం అనిల్, రాజేందర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, సంతోష్ కుమార్, ఆరు జట్ల క్రీడాకారులు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు గేదె మృతి



**కేటీదొడ్డి, జూన్ 14 (జనంసాక్షి) :** మండల పరిధిలోని మల్లాపురం తండాలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వర్షం పడుతున్న సమయంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో లక్ష రూపాయల విలువైన గేదె అక్కడికక్కడే మృతి చెందింది. బాధిత యజమాని పంపా నాయక్ తెలిపిన వివరాల మేరకు.. రాత్రి కురిసిన భారీ వర్షం సమయంలో గేదెను ఎప్పటిలాగే పొలం వద్ద కట్టేశారు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా పిడుగుపాటుకు గురై గేదె మృతి చెంది ఉంది. విషయం తెలుసుకున్న సర్పంచ్ పాండు నాయక్ వెంటనే స్పందించి, పశువైద్య అధికారులకు ఫోన్లో సంప్రదించగా వారు అక్కడికి వచ్చి పంచనామా నిర్వహించారు. జీవనాధారమైన పశువు మరణించడంతో బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం స్పందించి తమకు తగిన ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాల్ మిత్ర, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయండి

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి
- పాలకమండలి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం



**ఊర్కొండ, జూన్ 14 (జనం సాక్షి) :** ఆలయ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. మండలంలోని ఊర్కొండపేట శ్రీశ్రీశ్రీ పబ్బతి ఆంజనేయస్వామి వారి ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డిని హైదరాబాద్ లోని ఆయన స్వగృహంలో కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా పాలకమండలి నూతనంగా ఏర్పాటు చేయడంలో సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని, ధర్మకర్తల మండలి భక్తులకు అందుబాటులో ఉండి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సినటువంటి బాధ్యత మీపై ఉందని అన్నారు. దాంతో పాటు భక్తులకు భద్రత విషయంలో రాజీ పడకుండా ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. సన్మానించిన వారిలో ఆలయ చైర్మన్ చింతల మనోహర్ రెడ్డి, సభ్యులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అయూబ్ పాషా, తదితరులు ఉన్నారు.

## నిర్లక్ష్యపు నీడలో ప్రభుత్వ పాఠశాల

**కేటీ దొడ్డి, జూన్ 14 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉన్నతాధికారులు నిరంతరం ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. జోగులాంబ గద్వాల్ జిల్లా కేటీ దొడ్డి మండలం గంగన్‌పల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇందుకు నిదర్శనంగా నిలిచింది. శనివారం కురిసిన వర్షానికి పాఠశాల ప్రాంగణం మొత్తం నీట మునిగి, ఒక చిన్నపాటి చెరువును తలపిస్తోంది. స్కూల్ ముందు భాగంలో నూతనంగా నిర్మించిన సిసి (జజ) రోడ్డును శాస్త్రీయత లేకుండా, ఎత్తుగా వేయడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని తెలుస్తోంది. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో, నీరంతా పాఠశాల మైదానంలోనే నిలిచిపోయింది. ఇది అధికారుల నిర్లక్ష్యమా, లేక కాంట్రాక్టర్ యొక్క అవగాహన లోపమా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నడవడానికి వీల్లేని పరిస్థితి ప్రాంగణమంతా నీరు నిలిచిపోవడంతో సోమవారం పాఠశాలకు వచ్చే చిన్నారి విద్యార్థులు, ఉపాధ్యాయులు లోపలికి వెళ్లడానికి కనీసం నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి ఏర్పడింది. నిలిచిన నీటి వల్ల దోమలు చేరి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "పై అధికారులు నెత్తీ నోరూ బాదుకుంటున్నా ఇక్కడి పరిస్థితి మారడం లేదు" అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు, మండల అధికారులు



తక్షణమే స్పందించి, పాఠశాల ప్రాంగణంలో నిలిచిన నీటిని తొలగించి, భవిష్యత్తులో నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని గంగన్‌పల్లి గ్రామ ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## మోడీ సుపరిపాలనను ప్రజలకు వివరించాలి



**నారాయణపేట, జూన్ 14 (జనం సాక్షి) :** కేంద్రంలో 12 ఏళ్ల అప్రతిహత ప్రధాని నరేంద్రమోడీ సుపరిపాలనను ప్రజలకు వివరించాలనీ బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నితిన్ నందకర్ అన్నారు. ఆదివారంనారాయణపేట జిల్లా కేంద్రంలో నమో జెడ్ కన్లివ్ కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి జె వై ఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నితిన్ నందకర్ హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి గా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నరేం ద్ర మోడీ సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ముక్యంగా యువతకు దేశం పట్ల, మన పరిపాలన పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.భరత్ కుమార్, పట్టణ అధ్యక్షుడు జాజాపూర్ మణిశంకర్, రాష్ట్ర నాయకులు ప్రవీణ్, చంద్రశేఖర్ రెడ్డి, మోహన్, కార్తికేయ,ప్రకాష్, డి.మణి, మనీ మోడీ,.శివ, అంజి, ఆశిష్, నవీన్ ముఖ్యమైన కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 14 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలో మహిళలు, యువతులు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ యూనిట్లు నిరంతరం పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, బాలికలు ఆకతాయిల వేధింపులు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గృహహింస, లైంగిక వేధింపులు లేదా ఇతర ఏ విధమైన అన్యాయాలకు గురైనప్పుడు భయపడ కుండా ధైర్యంగా పోలీసు లను సంప్రదించాలని ఆయ న కోరారు. విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులు బస్టాండ్లు, పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, కాలనీలు వంటి ప్రాంతాల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు గురైనప్పటికీ, ఉద్యోగ మహి ళలు తమ కార్యాలయాల్లో వేధింపులకు గురైనప్పటికీ వెంటనే షీ టీమ్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు, బాలికలపై జరిగే వేధింపుల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గృహహింసకు గురవుతున్న మహిళలు కూడా మౌనంగా బాధపడ కుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, బాధితులకు అవసరమైన న్యాయం అందించేందుకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళల ఫిర్యాదులపై సత్వర స్పందనతో పాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నా రు. జిల్లా వ్యాప్తంగా షీ టీమ్స్ ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాల్లో మహిళా భద్రత, సైబర్ నేరాల నివారణ, సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికలను ఉపయోగించే సమయంలో అపరిచితుల తో



వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమ యంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మైనర్ బాలిక లను వేధించడం, లైంగికంగా వేధించడం వంటి ఘటనల్లో సంబంధిత నిందితులపై పోక్సో చట్టం కింద కఠిన కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం శిక్షించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయలేని మహిళ లు, బాలికలు లేదా వారి కుటుంబ సభ్యులు షీ టీమ్ ఫోన్ నెంబర్ 8712670398 లేదా డయల్ 100 కు సమా చారం అందించాలని సూచిం చారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యం గా ఉంచి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

# రక్తదానంతో ప్రాణాలు కాపాడదాం


- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- ఐటీ మాస్టర్ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రక్తదానంతో ప్రాణాలు కాపాడదామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. మానవత్వాన్ని తలపించేలా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం రక్తదాన శిబిరం ఉత్సాహంగా జరిరింది. ఐటీ మాస్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం జీఎస్సార్ మాట్లాడుతూ రక్తదానం అత్యున్నతమైన మానవతా సేవ అని అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు, పెద్ద పెద్ద శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులు, గర్భిణీలు, థాలసీమియా లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే పిల్లలకు రక్తం ప్రాణాధారం అని గుర్తు చేశారు. ఒక యూనిట్ రక్తం ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి ఏడాదికి మూడు నాలుగు సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం వల్ల దాత ఆరోగ్యానికి ఎలాంటి నష్టం లేదన్నారు. కొత్త రక్తం ఉత్పత్తి అవుతుంది, శరీరానికి మేలు జరుగుతుందని వివరించారు. యువత ముందుకు వచ్చి సామాజిక బాధ్యతతో ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని సూచించారు. భూపాలపల్లి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జీఎస్సార్ చెప్పారు. జిల్లా కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. వచ్చే ఆరు నెలల్లో భవనం అందుబాటులోకి వస్తుందని, అప్పుడు రక్త సరఫరా ఇంకా సులభం అవుతుందని ప్రకటించారు. శిబిరంలో రక్తదానం చేసిన ప్రతి దాతను జీఎస్సార్ స్వయంగా అభినందించారు. సర్టిఫికెట్లు అందజేసి ప్రోత్సహించారు. రక్తదాన శిబిరాన్ని చక్కగా నిర్వహించిన నిర్వాహకులు వేముల శంకర్, ఐటీ మాస్టర్ బృందాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. శిబిరంలో మొత్తం 200 మందికి పైగా యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. భూపాలపల్లిలో ఎమ్మెల్యే జీఎస్సార్ రాకతో యువతలో రక్తదానంపై అవగాహన పెరిగింది. ఒకరి ప్రాణం కాపాడటమే అసలైన సేవ అన్న సందేశం పలువురిని మేలుకొల్పినట్లు అయింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లూరి మధు, పిప్పాల రాజేందర్, నాగపూరి సమ్మయ్య, దాట్ల శ్రీనివాస్, సాంబమూర్తి, తోట రంజిత్, సుభాష్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఐటీ మాస్టర్ సభ్యులు, కళాశాల విద్యార్థులు, యువకులు, రక్తదాతలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూపాలపల్లి బీఆర్ఎస్‌లో తగ్గని 'వార్'

- రెండు ఆఫీసులు, రెండు సామ్రాజ్యాలు ఒకే పార్టీలో రెండు యుద్ధాలు
- గండ్ర వర్గం వర్సెస్ సిరికొండ వర్గం
- పెరుగుతున్న అంతర్గత విబేధాలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి బీఆర్ఎస్ లో 'వార్' పెట్రేగి పోతుంది.. రెండు ఆఫీసులు, రెండు సామ్రాజ్యాలు ఒకే పార్టీలో రెండు యుద్ధాలు.. ఇక్కడ గండ్ర వర్గం, సిరికొండ వర్గం రెండు వేర్వేరు దారుల్లో నడుస్తున్నాయి.. రోజురోజుకు అంతర్గత విబేధాలు పెరిగి పోతున్నాయి.. భూపాలపల్లి బీఆర్ఎస్ అంటే ఇప్పుడు పార్టీ కాదు.. అది రెండు శత్రు సైన్యాల వార్ జోన్.. హైకమాండ్ మాటలు ఇక్కడ సాగవు.. మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు వచ్చిన సందర్భంగా "గో బ్యాక్" అనే బాంబు పేలింది.. ఇది కేవలం టికెట్ ఫైట్ కాదు.. ఇది పాత ఓటమికి తీర్చుకునే కక్ష.. ఒక ఉద్యమకారుడికి జరుగుతున్న అన్యాయం కూడా.. ఈ కక్ష ఇప్పుడు బహిరంగంగా రోడ్డు మీదకు వచ్చింది.. సింగరేణి సదస్సు కోసం టిబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, సిరికొండ మధుసూదనాచారి ఇంటికి వెళితే ఆయన వర్గీయులు తరిమికొట్టారు.. "గో బ్యాక్" నినాదాలతో సదస్సు ఆహ్వానాన్ని అవమానించారు.. మాజీ స్పీకర్‌కు సరైన చోటు దక్కడం లేదు అన్నది వారి కోపం..

## ఒకప్పుడు సిరికొండ.. ఇపుడు గండ్ర..

భూపాలపల్లి బీఆర్ఎస్ ఒకప్పుడు సిరికొండ మధుసూదనాచారి చేతిలో ఉండగా, ఇపుడు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేతుల్లోకి వెళ్లింది. తెలంగాణ ఉద్యమం మొదలై అప్పటి టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుండి సిరికొండ మధుసూదనాచారి ఈ ప్రాంతంలో కలియ తిరుగుతూ ప్రత్యేకస్థానం సంపాదించుకున్నాడు. తెలంగాణ ఉద్యమనేతగా పేరుగాంచిన సిరికొండ మధుసూదనాచారి, కేసీఆర్ వెన్నంటే ఉండి రాష్ట్ర సాధనలో ముఖ్య భూమిక పోషించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత భూపాలపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్ గా బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో భూపాలపల్లి బీఆర్ఎస్ ఆయన అజమాయిషీలో ఉండేది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న గండ్ర వెంకటరమణారెడ్డి చేతిలో బోల్తా పడ్డాక ఆ గాయం ఇంకా పచ్చిగా ఉంది. గండ్ర పార్టీ మారి బీఆర్ఎస్ సీటు లాక్కున్నాడు. అప్పటి నుంచి మధుసూదనాచారి ఎటు పాలుపోని స్థితిలో పడిపోయి, అధిష్టానంపై గంపెడాశతో ఉన్నాడు. ఈ క్రమంలోనే ఇటీవలె సదస్సు నిర్వహణలో మధుసూదనాచారికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నది ఆయన వర్గం ప్రధాన అసంతృప్తి. మాజీ స్పీకర్ హోదాకు తగిన గౌరవం ఇవ్వలేదని, ఆహ్వానించే విధానం కూడా సరిగ్గా లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. పరిస్థితి చేయి దాటిపోయే దశలో మధుసూదనాచారి స్వ యంగా రంగంలోకి దిగి తన అనుచరులను శాంతిం పజేశారు. ఆయన జోక్యంతోనే గొడవ సద్దుమణిగింది. గండ్ర వెంకటరమణారెడ్డి వర్గం ఆధిపత్యం చెలాయిస్తోందని, తమను పక్కన పెడుతున్నారని మధుసూదనాచారి వర్గం ఆరోపణ.

## ఎవరి ఆఫీసులు వారివే..

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పార్టీ ఆఫీసులో కార్యకలాపాలు కొనసాగిస్తుండగా, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి తాను ఓ ఆఫీసు పెట్టుకుని కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన సతీమణి పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రాజ్యం ఏలుతున్నారు. మధుసూదనాచారి మంజూర్ నగర్ లో వేరే ఆఫీస్ పెట్టుకుని ప్రతి సర్కారు నడుపుతున్నాడు. ఒకే నియోజకవర్గంలో రెండు పార్టీ కార్యాలయాలు. ఒకే పార్టీకి ఇద్దరు బాస్ లు. క్యాడర్ పరిస్థితి అయితే ఇంకా ఘోరం. ఒకరి ఫ్లెక్సీ చూస్తే ఇంకో వర్గం చించేస్తుంది. ఒకరి మీటింగ్‌కు ఇంకో వర్గం రాళ్లు వేస్తుంది. సమావేశం అంటే రెండు గ్రూపుల మధ్య కురుక్షేత్రం. "గతంలో సీటు గెలిచింది మేము. డబ్బు పెట్టింది మేము. క్యాడర్ మాది" అనేది గండ్ర వర్గం ధీమా వ్యక్తం చేస్తుండగా, "పదవి మాది. హోదా మాది. హైక మాండ్ దగ్గర పలుకుబడి మాది" అనేది సిరికొండ వర్గం ధీమా. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు టికెట్ ప్రకటించిన రోజే భూపాల పల్లి బీఆర్ఎస్ ఖతం. గండ్రకు ఇస్తే సిరికొండ రెబల్ అయ్యి కాంగ్రెస్‌తో డీల్ పెడతాడు. సిరికొండకు ఇస్తే గండ్ర స్వతంత్రంగా దిగి ఓట్లు చీలుస్తాడు. రెండూ జరిగితే బీఆర్ఎస్ కు డిపాజిట్ కూడా దక్కదు. హైకమాండ్ ఇక్కడి విషయంలో చావు, బతుకు మధ్యలో ఉంది. మౌనంగా చూస్తే పార్టీ ఖతం. జోక్యం చేసుకున్నా రెండు వైపుల నుంచి ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి.

## రెండు వర్గాలతో బీఆర్ఎస్ సతమతం..

గ్రౌండ్ లెవెల్ లో రెండు వర్గాలు పూర్తిగా చీలిపోయాయి. ఒకరి మీటింగ్ కు మరొకరు వెళ్లడం లేదు. ఫ్లెక్సీలు, కార్యక్రమాలు వేరు వేరుగా జరుగుతున్నాయి. టికెట్ ఇస్తామన్న మాట వినగానే రెబల్ లేపుతామనే సంకేతాలు ఇరువైపుల నుంచి వస్తున్నాయి. ఒకప్పుడు ప్రత్యర్థులు, ఇప్పుడు ఒకే పార్టీలో శత్రువులు. సిరికొండ వర్గం పాత ఓటమికి లెక్కలు తేలుస్తోంది. గండ్ర వర్గం నాడు గెలిచిన సీటు వదిలేది లేదంటోంది. ఈ అంతర్గత కుమ్ములాట భూపాలపల్లి బీఆర్ఎస్ భవిష్యత్ ను దెబ్బతీసే ప్రమాదం ఉంది. హైకమాండ్ ఎవరిని ఎంచుకున్నా మరో వర్గం రగులుతుంది. రెండింటిని సంతృప్తి పరచడం ఇప్పుడు అసాధ్యం. గండ్ర వెంకటరమణారెడ్డి వర్గం, మధుసూదనాచారి వర్గం మధ్య టికెట్ ఫైట్ నడుస్తోంది. ఒకప్పుడు ప్రత్యర్థులుగా ఉన్న ఇద్దరూ ఇప్పుడు ఒకే గూటిలో టికెట్ కోసం తలపడుతున్నారు. ఈ ఘటనతో పార్టీలోని అంతర్గత కుమ్ములాటలకు తావిచ్చినట్లయింది. వచ్చే ఎన్నికల్లో దీని ప్రభావం తప్పదని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. హైకమాండ్ ఇప్పుడు ఈ చీలికను ఎలా పూడ్చుతుంది అన్నదే ఇక్కడ కీలకంగా మారింది.

# వేషాలపల్లిలో దారుణ హత్య

- గొర్లకాపరిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మండలం వేషాలపల్లి గ్రామంలో దారుణ హత్య కలకలం రేపింది. గొర్ల కాపరిగా బతుకుతున్న వృద్ధుడిని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున దారుణంగా చంపేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొడారి సమ్మయ్య(70) అనే గొర్రెల కాపరి ప్రతి రోజులాగానే గ్రామ శివారులో గొర్ల మంద వద్ద మంచం వేసుకుని నిద్రపోయారు. తెల్లవారుజామున జరిగిన ఈ ఘాతుకంలో దుండగులు సమ్మయ్య తలపై బలంగా కొట్టారు. తీవ్ర గాయాలతో సమ్మయ్య అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. విషయం తెలుసుకున్న మృతుడి అన్న కొడారి కొమురయ్య భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఫిర్యాదు ఆధారంగా భూపాలపల్లి పట్టణ ఎస్సై కె. పవన్ కుమార్ కేసు నమోదు చేసి సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఆధారాలు సేకరించారు. నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. ఈ కేసు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు. వృద్ధుడిని అర్ధరాత్రి హతమార్చడంతో గ్రామంలో తీవ్ర భయాందోళన వాతావరణం నెలకొంది. హత్య వెనుక కారణం ఏంటి, పాత గొడవలా లేక దోపిడీ ఉద్దేశమా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని పోలీసులు చెప్పారు.

# రైతులకు ఉచిత వ్యవసాయ స్ప్రే పంపుల పంపిణీ

**ముఖ్య అతిథిగా పాల్గొన్న జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్**




**మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 14 (జనం సాక్షి):** ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) వారి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల సహకారంతో మహబూబాబాద్‌లో రైతులకు ఉచితంగా వ్యవసాయ స్ప్రే పంపులు, టార్పాలిన్ షీట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ హాజరై రైతులకు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల అభ్యున్నతే దేశాభివృద్ధికి పునాది అని అన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పరికరాల వినియోగం వల్ల రైతుల శ్రమ తగ్గడంతో పాటు ఉత్పాదకత పెరుగుతుందని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సదుపాయాలు అందించేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. వ్యవసాయ సమాజ సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, రైతుల సాధికారత కోసం సిఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా సహకారం అందిస్తున్న ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు రైతులకు ఆర్థికంగా, సాంకేతికంగా బలాన్ని చేకూర్చడంతో పాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులకు స్ప్రే పంపులు, టార్పాలిన్ షీట్లు పంపిణీ చేయడంతో వారు ఆనందం వ్యక్తం చేసి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఘనంగా చేగువేరా జయంతి వేడుకలు

**మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 14 (జనంసాక్షి):** సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో స్థానిక నలంద డిగ్రీ కళాశాలలో విప్లవ నాయకుడు చేగువేరా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ, చేగువేరా పోరాట పటిమను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. చేగువేరా గెరిల్లా ఉద్యమం ద్వారా క్యూబా దేశ విముక్తి కోసం పోరాడి ప్రపంచవ్యాప్తంగా యువతకు స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం కూడా ముందుకు సాగి ప్రత్యేక రాష్ట్ర సాధనకు దోహదపడిందని అన్నారు. యువత చేగువేరా జీవిత చరిత్రను అధ్యయనం చేసి ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పార్నంది రామయ్య, కోట సుధాకర్, బుర్ర గోవర్ధన్, పమ్మి నాగబ్రహ్మం, బాలాజీ నాయక్, తోడేటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితులకు ప్రాణదాత!

- 15 సార్లు రక్తదానం చేసిన 108 పైలెట్ వైనాల నాగరాజు



**చెన్నారావుపేట, జూన్ 14 (జనంసాక్షి) :** అన్నదానం ఆకలిని తీరుస్తుంది... విద్యాదానం జీవితాన్ని ఇస్తుంది... రక్తదానం నిండు జీవితాన్ని నిలబెడుతుంది... ప్రమాద బాధితులకు అత్యవసర సమయంలో తన రక్తాన్ని దానం చేస్తూ ప్రాణ దాతగా నిలుస్తున్నాడు చెన్నారావుపేట మండలంలో 108 వాహన పైలట్ గా పనిచేస్తున్న వైనాల నాగరాజు. సంగెం మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన వైనాల నాగరాజు వృత్తి రిత్యా 108 అంబులెన్స్ వాహన పైలెట్‌గా చెన్నారావుపేటలో పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసరంగా రక్తం అవసరమయ్యే పరిస్థితులను ప్రత్యక్షంగా చూసిన ఆయన చలించిపోయాడు. ఆపదలో ఉన్న బాధితులకు రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నాడు. అప్పటి నుండి నిరంతరం రక్తదానం చేస్తూ పలువురికి ప్రాణదాతగా నిలుస్తున్నాడు. ఇప్పటివరకు ప్రమాదంలో ఉన్న బాధితులకు 15 సార్లు రక్తాన్ని అందించాడు. అత్యవసరమైన సమయంలో రక్తదానం చేసి ప్రాణాలను కాపాడడం ఒక గొప్ప సేవ అని పేర్కొంటున్నాడు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా యువత కూడా స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చి ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పైలట్ వైనాల నాగరాజు కోరుతున్నాడు.


# నేడు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి టీఆర్ఎస్ అధినేత్రి కవిత రాక




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 14(జనంసాక్షి) :** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం తోపాటు పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి టీఆర్ఎస్ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత హాజరవతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కిర్మిల్ల వినోద్ తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు పార్టీ జెండా కార్యక్రమం తోపాటు పార్టీ కార్యాలయం కూడా ప్రారంభోత్సవం,జెండా ఆవిష్కరణ ఉంటుందని ఆయన తెలిపారు.అంతకు ముందు జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ చెక్ పోస్ట్ నుండి ప్రజా ర్యాలీ ( రోడ్ షో)ప్రారంభమై గాంధీ చౌక్, వివికనంద్ చౌక్ , అంబెద్కర్ చౌక్ మీదుగా కోమరం భీమ్ చౌక్ వరకు వెళ్లి మహనేయులందరికీ పూల మాలలు వేసి తిరిగి ర్యాలీ తో గుండి రోడ్లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయానికి చేరుకొని టీ ఆర్ ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు,పార్టీ అభిమానులతో సమావేశం నిర్వహిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఆమె తోపాటు ఆసిఫాబాద్ జిల్లా టీ ఆర్ ఎస్ పార్టీ పరిశీలకులు మాజీ మంత్రి బొడ జనార్దన్, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, పలువురు నాయకులు పాల్గొంటారని తెలిపారు.ఈ సంధ్బంగా వివిధ పార్టీల నుండి తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ లో చేరికలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ క్రార్యక్రమానికి జిల్లాలోని పార్టీ నాయకులు, తెలంగాణ జాగృతి నాయకులు, పార్టీ కార్యకర్తలు,పార్టీ అభిమానులు తరలి రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దుర్గం శ్యామ్ రావు,రామ్ ప్రసాద్ గౌడ్ సాయి, మైనొద్దిన్, ఆత్రం వినోద్,తిరుపతి,శ్రీనివాస్, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

# రంగాపురంలో విషాదం

- విద్యుత్ వైర్లు తాగి ఏడు గేదెలు మృతి



**మొగుళ్ళపల్లి జూన్ 14 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపురం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వడగళ్ల వర్షం ప్రభావంతో తీవ్ర ప్రభావం ఏర్పడి గ్రామంలో భారీ వృక్షాలు విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి ఈ క్రమంలో గ్రామ పోలిమిరలో విద్యుత్ వైరు తెగిపడి ఏడు పాడి గేదెలు మృతి చెందాయి.గ్రామంలోని పశువుల కాపరి రోజువారి లాగా గ్రామంలోని పశువులను మేత కోసం గ్రామ పొలిమేరలోకి తొలుకుపోగా వర్ష ప్రభావంతో తెగిపడ్డ విద్యుత్ వైరు తాకి ఏడు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి మృతి చెందిన పశువుల విలువ సుమారుగా 5 లక్షలు ఉంటుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రెండు రోజుల క్రితం తెగిపడిన విద్యుత్ తీగలు విద్యుత్ అధికారులు గుర్తించి సరి చేసి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని ఈ నష్టానికి విద్యుత్ శాఖ అధికారులు బాధ్యత వహించి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# మామునూరు మండల కేంద్రం ఏర్పాటుకు సహకరిస్తాం

- మాజి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**వరంగల్ ఈస్ట్, జూన్ 14 (జనం సాక్షి) :** మామునూరు మండల కేంద్రం ఏర్పాటు కు అన్ని విధాల సహకారం అందిస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే లు పెద్ది సుదర్శన్ రెడ్డి,అరూరి రమేష్,మాజీ జడ్పి చైర్మన్ మారేపల్లి సుదీర్ బాబు తో కలిసి గత తొమ్మిది రోజులుగా సాగుతున్న మామునూరు మండల సాధన సమితి రిలే నిరాహార దీక్షల్లో దయాకర్ రావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మామునూరు మండల సాధన రిలే నిరాహార దీక్షకు సంఘీభావం ప్రకటించి,మద్దతును తెలిపారు.మామునూరు మండల కేంద్రం చేయడానికి అన్ని అర్హతలు ఉన్నాయని పేర్కొన్నారు. తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రం కోసం చేస్తున్న పోరాటం పై దృష్టి పెట్టాలని కోరారు.వారి చిరకాల ఆకాంక్ష ను నెరవేర్చాలని ప్రభుత్వానికి విన్నవించారు. మా వంతు సహాయంగా మీ పోరాటంలో భాగస్వాములు అవుతామని అన్నారు..రిలే దీక్ష లో కన్వీనర్ ఎర్ర విజయ్ కుమార్,కో కన్వీనర్స్ బి జయశంకర్,మాచర్ల యాదగిరి,నోముల ముత్తారెడ్డి,బండి సాంబయ్య యాదవ్,నల్ల తీగల కోటేశ్వర్,అడ్వకేట్స్ అంబాల షద్రక్, ఊరుగొండ నరేందర్,జన్ను ప్రభాకర్, మేకల బుచ్చిబాబు, ఈదురు ప్రవీణ, చింత రమాదేవి, గంటా నరేందర్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి ఊరుగొండ రమేష్, నల్లతీగల పెద్ద శ్రీనివాస్, సోల్తి భూమాత రామస్వామి, మేకల రాణి,దురిశెట్టి వెంకటలక్ష్మి, ఇనుముల ఎలిషా, మాచర్ల కుమారస్వామి, తాళ్లపల్లి శ్రీనివాస్, పోశాల సదానందం,మేకల సూరన్న, ఎండి షకిల్,కలకోట్ల క్రాంతి, ఉసిల్ల కిరణ్,తేలు రాకేష్, రేగోరి లక్ష్మారెడ్డి,తాళ్ల పెల్లి కుమారస్వామి, మాదిరెడ్డి పాపిరెడ్డి,మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి,మల్లాడి తిరుపతిరెడ్డి,సాంబా రి కిషోర్, సల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# తాగునీటి కోసం అక్కల్‌చెడ గ్రామస్తుల ఇబ్బందులు

- చోద్యం చూస్తున్న మిషన్ భగీరథ అధికారులు
- ట్యంకర్ సహాయంతో త్రాగునీటిని అందించిన గ్రామ సర్పంచ్
- మిషన్ భగీరథ తాగునీరు అందించాలని గ్రామస్తుల డిమాండ్



**చెన్నారావుపేట, జూన్ 14 ( జనంసాక్షి) :** మిషన్ భగీరథ త్రాగునీరు సరఫరా కాక మండలంలోని అక్కల్ చెడ గ్రామస్తులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత మూడు రోజులుగా మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరా గ్రామానికి నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు త్రాగు నీటి కోసం అష్ట కష్టాలు పడుతున్నారు. గ్రామ శివారులో మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీకి గురికావడంతో గ్రామానికి త్రాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్ మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు సిబ్బందిని పంపించారు.అనంతరం వారు పైపు లీకేజిని గుర్తించి మరమ్మత్తులు చేయగా త్రాగు నీరు సరఫరా అవుతుందని ఎదురు చూస్తున్న గ్రామస్థులకు నిరాశే ఎదురయ్యింది.త్రాగు నీరు రావడం లేదని గమనించిన సర్పంచ్ స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకువెళ్లి చూడగా మిషన్ భగీరథ సిబ్బంది ఇనుప వాచర్ అమర్చి గ్రామానికి నీటి సరఫరా కాకుండా పూర్తిగా నిలిపివేసినట్లు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం, అలసత్వం మూలంగా మూడు రోజులు త్రాగు నీరు సరఫరా కాక గ్రామస్తులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామస్తుల త్రాగునీటి ఇబ్బందులను చూడలేక గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా గ్రామపంచాయతీ సిబ్బందితో గ్రామస్తులకు త్రాగు నీటిని అందించారు. వెంటనే మిషన్ భగీరథ అధికారులు మిషన్ భగీరథ త్రాగునీటిని అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
15 జూన్ 2026

# సీత్యా తండాలో ఎమ్మెల్యే పల్లె నిద్ర

- ప్రగతి సింగిడితో జనంలోకి బత్తుల లక్ష్మారెడ్డి
- అర్ధరాత్రి వరకు ప్రజా సమస్యలపై చర్చ ఉదయాన్నే వీధుల్లో పర్యటన
- ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన నూతన పంచాయతీ భవనం ప్రారంభం



**మాడ్గులపల్లి, జూన్ 14 (జనం సాక్షి) :** మిర్యాలగూడ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రగతి సింగిడి - జనంతో మాట.. పల్లె బాట నూతన కార్యక్రమం క్షేత్రస్థాయిలో ప్రజల ఆదరణతో విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మండల పరిధిలోని సీత్యా తండా గ్రామంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఆయన శనివారం రాత్రి తండాకు చేరుకుని గ్రామస్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు అర్ధరాత్రి వరకు తండావాసుల అవసరాలు, సమస్యలు, ఊరి అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు అనంతరం స్థానిక ప్రజల మధ్యే ఆయన పల్లె నిద్ర చేసి వారితో మమేకమయ్యారు.
ఆదివారం ఉదయం సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గ్రామంలోని ప్రతి వీధిలో కాలినడకన పర్యటించారు ప్రజలను నేరుగా కలుసుకుని వారి ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి, పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు అనంతరం తండాలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడం, గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడమే ప్రగతి సింగిడి కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు పర్యటనలో భాగంగా గ్రామస్థులు సమర్పించిన పలు సమస్యలు, వినతి పత్రాలను స్వీకరించిన ఆయన, వాటిని అత్యవసర ప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాయరపు ఉమా వెంకన్న, తాసిల్దార్ సరోజ పావని, ఎంపీడీఓ వంశీధర్, పంచాయతీ రాజ్ ఏఈ మధు, గ్రామ కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మృతదేహంతో ధర్నాకు దిగిన కుటుంబసభ్యులు



**భద్రాచలం, జూన్ 14 (జనంసాక్షి) :** అశ్వాపురం మండలం బీజీకొత్తూరు వద్ద శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ ప్రయివేటు ట్రావెల్స్ కు చెందిన డ్రైవరు మల్లెల సత్యసాయి మృతదేహంతో ఆదివారం కుటుంబ సభ్యులు భద్రాచలం కూనవరం రోడ్డులో ఉన్న ప్రయివేటు ట్రావెల్స్? కార్యాలయం ఎదుట మృతదేహాన్ని ఉంచి ధర్నాకు దిగారు. రెండు గంటలకు పైగా ధర్నా చేపట్టడంతో రోడ్డుపై ట్రాఫిక్ నిలిచింది. సత్యసాయి భార్య, పిల్లలు రోదిస్తుండటంతో కుటుంబ ఆధారం కోల్పోవడంతో వారి కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆదుకోవాలని యాజమాన్యాంను డిమాండ్ చేసారు. దీంతో సంఘటన స్థలంకు వచ్చిన పోలీసులు మృతుని కుటుంబ సభ్యులతో పాటు యజామాన్యం వారితో మాట్లాడారు. విధి నిర్వహణలో భాగంగా మణుగూరు రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకోవడంతో సంస్థే బాధ్యత వహించాలని, కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. అనంతరం మృతదేహాన్ని అక్కడ నుంచి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు.

## కేటీదొడ్డిలో అత్యధికంగా 82.8 మి.మీ వర్షపాతం నమోదు

**కేటీదొడ్డి, జూన్ 14 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి (కలూర్ తిమ్మనదొడ్డి) మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా విడుదలైన రోజువారీ వర్షపాత నివేదిక ప్రకారం, జిల్లాలోనే అత్యధికంగా కేటీదొడ్డి మండలంలో 82.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన ఈ వర్షం వ్యవసాయ పనులకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని మిగిలిన మండలాల వర్షపాత వివరాలు చూస్తే.. ఐజలో 44.5 మి.మీ, ధరూర్ లో 43.9 మి.మీ, ఘట్టులో 39.0 మి.మీ, రాజోలిలో 25.5 మి.మీ చొప్పున వర్షం పడగా, జిల్లా సగటు వర్షపాతం 26.6 మి.మీ గా నమోదైంది. అన్ని మండలాల కంటే కేటీదొడ్డిలోనే అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

## జనంసాక్షి వార్తకు స్పందన

- గంటల్లోనే కదిలిన కరెంటు వైర్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు


మంత్రి ఆదేశాలకే దిక్కులేదు ఇక సామాన్యుడి గతేంది?
- మాడుగులపల్లిలో నిలిచిన రూ.14.70 కోట్ల ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ పనులు
- భవనానికి అడ్డంగా విద్యుత్ వైర్లు తొలగించని అధికారులు
- ఈ నెల 10న స్వయంగా ఆదేశించిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ప్రజలు, ప్రజాప్రతినిధుల ఆగ్రహం

**మాడుగులపల్లి, జూన్ 14 (జనం సాక్షి) :** మాడుగులపల్లి మండల కేంద్రంలో నిర్మిస్తున్న సమీకృత మండల స్థాయి కార్యాలయాల సముదాయ భవన (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) నిర్మాణానికి అడ్డంగా ఉన్న విద్యుత్ వైర్ల వ్యవహారంలో అధికారులు ఎట్టకేలకు దిగివచ్చారు ఈ నెల 10న రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా ఆదేశించినా అధికారులు పట్టించుకోకపోవడం, భవన పనులు నిలిచిపోవడంపై మంత్రి ఆదేశాలకే దిక్కులేదు ఇక సామాన్యుడి గతేంది? అనే శీర్షికతో ఆదివారం జనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై విద్యుత్ శాఖ అధికారులు వెనువెంటనే



స్పందించారు.
యుద్ధప్రాతిపదికన పనులు
పత్రికలో వార్త ప్రచురితమైన కొద్ది గంటల్లోనే విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కదిలారు. నిర్మాణంలో ఉన్న రూ. 14.70 కోట్ల భవన సముదాయం వద్దకు అవసరమైన సామగ్రితో చేరుకున్న విద్యుత్ సిబ్బంది భవన నిర్మాణానికి అడ్డంగా ఉన్న కరెంటు వైర్లను యుద్ధప్రాతిపదికన తొలగించే పనులను ప్రారంభించారు ప్రమాదకరంగా ఉన్న లైన్లను క్లియర్ చేయడంతో నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం కావడానికి మార్గం సుగమం అయ్యింది

**జనం సాక్షికి కృతజ్ఞతలు**
మంత్రి చెప్పినా కదలని అధికారులు, జనం సాక్షి లో వార్త రాగానే గంటల వ్యవధిలోనే స్పందించి పనులు చేపట్టడంపై స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ, అధికారుల్లో చలనం తెప్పిస్తున్న జనం సాక్షి యాజమాన్యానికి, ప్రతినిధులకు మండల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ముత్తిరెడ్డిగూడెంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- జ్ఞాపకాలను నెమరవేసుకున్న 2011-12 బ్యాచ్



మోటకొండూరు, జూన్ 14 (జనం సాక్షి) : మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుకలు అత్యంత వైభవంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగాయి. స్థానిక మానస విద్యా మందిర్ పాఠశాలకు చెందిన 2011-12 విద్యాసంవత్సరం బ్యాచ్ విద్యార్థులంతా ఒకచోటుకి చేరి తమ పాత జ్ఞాపకాలను, మధురానుభూతులను నెమరవేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల నిర్వాహకులు సామా భూపాల్ రెడ్డి,నిమ్మ శేఖర్ రెడ్డ, మరియు ప్రముఖ బి ఏం అర్ ఎస్ విద్యాసంస్థల అధినేత బొప్పిడి మల్లారెడ్డి హాజరయ్యారు. తాము ఈరోజు ఈ స్థాయిలో ఉండటానికి కారణమైన గురువులను విద్యార్థులు భక్తిశ్రద్ధలతో స్మరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రియతమ ఉపాధ్యాయులు మదర్ వెంకటేశం, సంతోష్, ఆనంద్, నరసింహ, లత, నిర్మల విద్యార్థులంతా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి, గురువందనం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పాత విద్యార్థులంతా ఒకే వేదికపైకి రావడం ఆనందంగా ఉందంటూ, వారంతా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. పదేళ్ల క్రితం నాటి స్కూల్ రోజులను గుర్తుచేసుకుంటూ విద్యార్థిని, విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు శివరాజ్ గౌడ్, వినయ్ రాజు, సునీల్, వినయ్, మధు, స్రవంతి, పుష్పలత, శ్రీవాణి, మాధవి, శ్రావణి, లావణ్య, కళ్యాణి తదితరులు పాల్గొని పాత స్నేహితులతో కలిసి సందడి చేశారు.

## నకిలీ విత్తనాల సరఫరాదారులపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయాలి



**చింతకాని, జూన్ 14 (జనం సాక్షి) :** నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేసే సంస్థలపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని, గుర్తింపు పొందిన విత్తన సంస్థలకు మాత్రమే అనుమతులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం చింతకాని మండల కేంద్రంలోని రాయల వీరయ్య భవనంలో తోటకూరి వెంకట నరసయ్య అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.నాసిరకం విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, గతంలో దిగుబడులు తగ్గడంతో పాటు పురుగుల సమస్యలు పెరిగాయని ఆయన అన్నారు. నకిలీ విత్తనాల తయారీ, విక్రయాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే, మార్కెట్ కొనుగోలు కేంద్రాల ద్వారా మొక్కజొన్న విక్రయించిన రైతులకు రెండు నెలలు గడిచినా చెల్లింపులు జరగలేదని, వారి ఖాతాల్లో బకాయి మొత్తాలను వెంటనే జమ చేయాలని కోరారు. గత సీజన్‌లో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేస్తూ, ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుగుల్లి గోపాలరావు, వత్సవాయి జానకిరాములు, దేశబోయిన ఉపేందర్, ఆలస్యంరవి, మడుపల్లి కిరణ్‌బాబు తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో ఓటర్లకు అండగా నిలబడాలి

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి
- ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అధ్యక్షతన శిక్షణ శిబిరం



**కోదాడ, జూన్ 14 (జనం సాక్షి) :** సర్ ప్రక్రియలో ఓటర్లకు అండగా నిలబడాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ పట్టణం గుడుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ ఆవరణలో ఎమ్మెల్యే పద్మావతి అధ్యక్షతన బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రక్రియపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలం తర్వాత సర్ ప్రక్రియ జరుగుతుందన్నారు. అధికారులు అడిగిన పత్రాలను నిరక్షరాస్యులైన ఓటర్లు అందించలేరని, వారికి బూత్ లెవల్ ఏజెంట్లు అండగా నిలబడి, అవసరమైన పత్రాలను సమకూర్చిపెట్టి అధికారులకు సకాలంలో అందించి, ఓటు హక్కుపై ప్రభావం పడకుండా చూసుకోవాలన్నారు. పేద, నిరక్షరాస్య ఓటర్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ తరపున బాధ్యత తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ వెంకట్, నాయకులు రాజేష్, నర్సయ్య, కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

## త్వరలో ప్రారంభం కానున్న మేడారం 33/11 కెవి సబ్ స్టేషన్

- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు,వివిధ గ్రామాల ప్రజలు



**పి.ఏ.పల్లి, జూన్ 14 (జనంసాక్షి) :** పి.ఏ.పల్లి మండలం మేడారం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నూతన సబ్ స్టేషన్ త్వరలో ప్రారంభానికి నోచుకోనుంది.ఈ సబ్ స్టేషన్ ప్రారంభమైతే రంగారెడ్డిగూడెం స్టేజీ,రంగారెడ్డిగూడెం,మేడారం మరియు మదార్ గూడెం గ్రామాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుంది. దీనితో పాటు వ్యవసాయ అవసరాల కొరకు లో వోల్టేజీ విద్యుత్ సమస్య లేకుండా రైతులకు ఆమోదయోగంగా ఉంటుంది.దీంతో పలు ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతన సబ్ స్టేషన్ మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు,వివిధ గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

# పోక్సో చట్టంపై మహిళా కానిస్టేబుళ్ల అవగాహన

- మైనర్ బాలికల రక్షణలో మహిళా పోలీస్ కానిస్టేబుళ్ల పాత్ర కీలకం
- ప్రజలతో మమేకమై బాధ్యతగా పనిచేయాలి
- హుజూర్ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చరమంద రాజు

**హుజూర్‌నగర్, జూన్ 14 (జనంసాక్షి) :** పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళా కానిస్టేబుళ్లకు పోక్సో చట్టంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చరమంద రాజు, ఎస్సై నరేష్ లు దిశానిర్దేశం చేశారు. ఆదివారం ఈ సందర్భంగా సీఐ చరమంద రాజు మాట్లాడుతూ మైనర్ బాలికల రక్షణలో మహిళా పోలీస్ కానిస్టేబుళ్ల పాత్ర కీలకమన్నారు. పోక్సో చట్టంలోని నిబంధనలను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని, క్షేత్రస్థాయిలో బాలికలకు చట్టాలపై చైతన్యం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు 'పోలీస్ భరోసా' కార్యక్రమం ద్వారా భద్రతా అంశాలు, ఆపదలో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అంతేకాకుండా, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మహిళా కానిస్టేబుళ్లు ఎలా వ్యవహరించాలి, బాధితుల ఫిర్యాదులను స్వీకరించేటప్పుడు పాటించాల్సిన మర్యాదపూర్వక పద్ధతులు, జనరల్ డైరీ ఎంట్రీలు నమోదు చేయడం, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. సమాజంలో బాధ్యతాయుతమైన పోలీస్ సిబ్బందిగా పనిచేస్తూ, మహిళలు, బాలికల రక్షణకు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు.



## భద్రాద్రి రామాలయంలో భక్తుల రద్దీ

- దర్శనంకు 2 గం.లకు పైగా ఆర్జిత సేవలు రద్దు
- రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం



భద్రాచలం, జూన్ 14 (జనంసాక్షి) : భద్రాచలంలో ఆదివారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో రామాలయంతో పాటు ఆలయ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. వేసవి సెలవులు ముగియడం, సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానుండటంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనం కొరకు వచ్చారు. భక్తులు తెల్లవారుజాము నుంచే పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించి రామయ్య దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. భక్తుల సంఖ్య అధికంగా ఉండటంతో దేవస్థానంలో ఆర్జిత సేవలన్నీ రెండు గంటలకు పైగా రద్దు చేసి నేరుగా భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100 శీఘ్ర దర్శనంపై భక్తులను అనుమతించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తుల రద్దీ కొనసాగగా అనంతరం సాధారణ స్థితికి చేరుకుంది. అలాగే సాయంత్రం సైతం భక్తుల రద్దీ అధికంగానే ఉంది. దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం**
ఆదివారం సందర్భంగా రామాలయంలో భద్రాద్రి రామయ్యకు ప్రత్యేక అభిషేకం, నిత్యకల్యాణం నిర్వహించారు. నిత్యకల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేన అర్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

## ఫౌంటైన్‌ను తలపిస్తున్న మిషన్ భగీరథ పైప్‌లైన్

- వృధాగా పోతున్న మల్లాపురం మిషన్ భగీరథ మంచినీటి పైప్లైన్ నీరు



**పి.ఏ.పల్లి, జూన్ 14 (జనంసాక్షి) :** పి.ఏ.పల్లి మండలం మల్లాపురం గ్రామానికి వెళ్లే మిషన్ భగీరథ మంచినీటి పైపులైను పగిలి రోడ్డు వెంబడి మంచి నీరు వృధాగా పోతుంది.వివరాలకేలితే ఆదివారం నాడు రోడ్డు వెంబడి ప్రవైట్ వ్యక్తి తన సొంత పొలంలో జేసీబీ తో చెట్లు తొలగిస్తుండంగా మిషన్ భగీరథ పైప్ లైన్ రోడ్డు వెంబడి ఉండడంతో మరమ్మతులకు గురై ఆకస్మాత్తుగా ఒకేసారి నీరు బయటకు వచ్చి రోడ్డు వెంబడి నీరు పారింది.దీంతో రోడ్ వెంబడి వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఆకస్మాత్తుగా ఆందోళనకు గురయ్యారు.ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు స్పందించి పిలిగుండ్ల తండా, మల్లపురం గ్రామానికి మంచినీరు సకాలంలో వెళ్లే లాగా చూడాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.




# భద్రతాపరమైన ఆందోళనలే అసలు కారణం

### ఆంత్రోపిక్ ఫేబుల్ 5, మిథోస్ 5 నిలిపివేతపై అమెరికా ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యం

**దిల్లీ:** జాతీయ భద్రతాపరమైన ఆందోళనలను ఉటంకిస్తూ అమెరికా ప్రభుత్వం జారీ చేసిన ఎగుమతి నియంత్రణ ఆదేశాల నేపథ్యంలో, కృత్రిమ మేధ దిగ్గజం ఆంత్రోపిక్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తన వినియోగదార్లందరికీ తన అధునాతన ఏఐ మోడళ్లయిన ఫేబుల్ 5, మిథోస్ 5లకు యాక్సెస్‌ను ఆకస్మికంగా నిలిపివేసింది. కంపెనీ ప్రకటన ప్రకారం, అమెరికాలో ఉన్నా లేదా బయట ఉన్నా సరే – ఆంత్రోపిక్ సంస్థలో పని చేసే విదేశీయులతో పాటు ఏ విదేశీ పౌరుడైనా ఫేబుల్ 5, మిథోస్ 5లను యాక్సెస్ చేయడాన్ని నిలిపివేయాలని అమెరికా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 'అమెరికా ప్రభుత్వ ఆదేశాల ఫలితంగా నిబంధనల పాటింపును నిర్ధారించడానికి మేము మా వినియోగదార్లందరికీ ఫేబుల్ 5, మిథోస్ 5 సేవలను తక్షణమే నిలిపివేయాల్సి ఉంటుంది. దీని వల్ల ఇతర ఆంత్రోపిక్ మోడల్స్ వినియోగంపై ఎలాంటి ప్రభావం ఉండద'ని కంపెనీ వెల్లడించింది. ఆంత్రోపిక్ సంస్థకు భారత్ రెండో అతి పెద్ద మార్కెట్ కావడంతో, ఈ నిలిపివేత భారతీయ వినియోగదార్లు, సంస్థలపై ప్రభావం చూపుతుందని అంచనా. దేశంలో ఏఐ విప్లవాన్ని ఎదుర్కోవడంలో సాయపడేలా 'ఇండియా ఏఐ మిషన్'ను రూపొందించాలని, అలాగే డీప్‌టెక్, ఏఐ అభివృద్ధికి రూ.50,000 కోట్లు కేటాయించాలని ఆరిన్ క్యాపిటల్, మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఛైర్మన్ టి.వి.మోహన్‌దాస్ పాయ్ శనివారం ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. జోహో కార్పొరేషన్ మాజీ సీఈఓ శ్రీధర్ వెంబు ఎక్స్‌లో చేసిన పోస్ట్‌ను షేర్ చేస్తూ.. 'ఏఐ విప్లవాన్ని ఎదుర్కోవడంలో సాయపడటానికి నందన్ నీలేకని వైస్ ఛైర్‌గా, ప్రైవేటు, ప్రభుత్వ రంగాల నుంచి ఇతరులతో ప్రధాని మోదీ నేతృత్వంలో మాకు ఒక ఇండియా ఏఐ మిషన్ అవసరం' అని పోస్టు చేశారు. కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, అమిత్ షా, భాజపా ఐటీ విభాగం అధినేత అమిత్ మాలవీయ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జోక్యాన్ని కూడా ఆయన కోరారు. అమెరికా వెలుపల ఉన్న వారందరికీ మిథోస్, ఫేబుల్ ఏఐ మోడల్స్ అందుబాటులో లేకుండా చేశారని శ్రీధర్ వెంబు ఎక్స్ వేదికగా తెలిపారు. ప్రపంచీకరణ అంతరించిన ప్రస్తుత తరుణంలో, దేశ సార్వభౌమాధికారాన్ని రక్షించుకోవడానికి సాంకేతికతే అత్యంత శక్తిమంతమైన ఆయుధమని, కాబట్టి భారత్ తనకంటూ ఒక స్వతంత్ర మార్గాన్ని అన్వేషించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.




# ఐపీఓ సందడి.. మళ్లీ మొదలైంది

### రాబోయే రెండు నెలల్లో రూ.60,000 కోట్ల సమీకరణ! ఇష్యూకొస్తున్న డజనుకు పైగా కంపెనీలు




**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో ఈ ఏడాదిలో ఇప్పటిదాకా పెద్దగా పబ్లిక్ ఇష్యూల సందడి కనిపించ లేదు. అంతర్జాతీయంగా ఒక్కసారిగా అనిశ్చితులు తలె త్తడంతో ఓ వైపు చమురు ధరలు భగ్గుమన్నాయి. ఇంకో వైపు డాలరుతో పోలిస్తే రూపాయి విలువ బక్కచిక్కి పోయింది. ఇవన్నీ కలిసి స్టాక్ మార్కెట్లలో సెంటిమెం టును బలహీనం చేశాయి. ఇన్ని ఊగిసలాటల మధ్య తొలి పబ్లిక్ ఆఫర్(ఐపీఓ)కు రావాలనుకున్న కంపెనీల్లో చాలా వరకు వెనకడుగు వేశాయి. అయితే ఇపుడు పరిస్థితి మారుతోంది. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు ఐపీఓల ద్వారా మొత్తంగా 3.5 బిలియన్ డాలర్లనే (సుమారు రూ.33,500 కోట్లు) కంపెనీలు సమీకరించాయి. గత రెండు సంవత్సరాల్లో రికార్డు స్థాయిలో 20 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.1,90,000 కోట్లు) పైగా నిధుల సమీకరణ జరిగింది. ఆ రెండు సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది ఐపీఓల ద్వారా నిధుల సమీకరణ చాలా తక్కువగానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే రాబోయే రెండు నెలల్లో ప్రాథమిక మార్కెట్ కాస్త పుంజుకోనుండటం ఊరటనిచ్చే విషయం. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ), సంస్థాగత మదుపర్లకు షేర్ల కేటాయింపు (ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్), ప్రభుత్వ వాటాల విక్రయాలకు సంబంధించిన ఇష్యూల ద్వారా డజనుకు పైగా కంపెనీలు మొత్తంగా రూ.60,000 కోట్ల నిధుల సమీకరణకు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు నిస్తేజంగా ఉన్న మార్కెట్‌కు.. ఈ ఐపీఓలు మళ్లీ పునరుత్తేజాన్ని తీసుకొనిరానున్నాయి.

**ఏవేవి.. ఎంతెంత?**

రాబోయే కొన్ని నెలల్లో ఐపీఓకు రానున్న కంపెనీల్లో ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ అత్యధికంగా రూ.13,000 కోట్ల నిధులను సమీకరించే అవకాశం ఉంది. మలివిడత వాటా విక్రయం ద్వారా వారీ ఎనర్జీస్ రూ.7,000 కోట్లు, జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.7,500 కోట్లు సమీకరించాలని భావిస్తున్నాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మలివిడత పబ్లిక్ ఆఫర్ ద్వారా 2% వాటాను విక్రయించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ లావాదేవీ ద్వారా సుమారు రూ.10,000 కోట్లను ప్రభుత్వం సమీకరించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. హిందుస్థాన్ జింక్‌లోనూ 2% వాటా విక్రయం ద్వారా రూ.5000 కోట్లను సమీకరించే యోచనలో ప్రభుత్వం ఉంది. 1 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.9,500 కోట్లు) నిధులను సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీకి జెప్టో ముసాయిదా పత్రాలను సమర్పించింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) కూడా 2.5 బిలియన్ డాలర్ల సమీకరణ కోసం పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రైమ్ డేటాబేస్ గణాంకాల ప్రకారం.. సుమారు 163 కంపెనీలు ఐపీఓకు వచ్చేందుకు సెబీ నుంచి అనుమతిని పొందాయి. మరో 62 కంపెనీలు ముసాయిదా పత్రాలను దాఖలు చేసి నియంత్రణ సంస్థల అనుమతి కోసం ఎదురుచూస్తున్నాయి. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత చురుకైన ప్రాథమిక మార్కెట్లలో ఒకటిగా కొనసాగుతోందడానికి ఇదే నిదర్శనం. ఇదేకాకుండా.. రాబోయే రెండు నెలల్లో 50కి పైగా నమోదిత (లిస్టెడ్) కంపెనీల లాక్-ఇన్ పీరియడ్‌లు ముగియనున్నట్లు నువామా వెల్త్ మేనేజ్‌మెంట్ వద్ద లభ్యమవుతున్న వివరాల ఆధారంగా తెలుస్తోంది. దీని వల్ల వ్యవస్థాపకులు, కంపెనీల తొలి పెట్టుబడుదార్లు అమ్ముకోవడానికి రూ.80,000 కోట్లకు పైగా (8.4 బిలియన్ డాలర్లు) విలువైన షేర్లు అందుబాటులోకి రావచ్చు. ఈ పరిణామం స్టాక్ మార్కెట్లో షేర్ల సరఫరాను మరింత పెంచే అవకాశం ఉంది. అయితే ఒకేసారి అనేక పెద్ద ఇష్యూలు ప్రారంభిస్తే కొత్త షేర్ల సరఫరాను గ్రహించే మార్కెట్ సామర్థ్యం పరీక్షకు గురికావచ్చని కొంతమంది పెట్టుబడిదార్లు హెచ్చరిస్తున్నారు. మరో వైపు దేశీయ సంస్థలు, రిటెయిల్ పెట్టుబడిదార్ల నుంచి బలమైన ప్రాతినిధ్యం కొనసాగుతుండటంతో డిమాండు నిలకడగానే ఉంటుందని బ్యాంకర్లు విశ్వాసంతో ఉన్నారు.

## ఆంత్రోపిక్ మోడళ్ల నిషేధం వెనుక అమెజాన్ హస్తం!

కృత్రిమ మేధ సంస్థ 'ఆంత్రోపిక్' ఇటీవల విడుదల చేసిన తమ సరికొత్త ఏఐ మోడళ్లు 'ఫ్యాబిల్ 5', 'మిథోస్ 5' సేవలను నిలిపివేసింది. అయితే దీని వెనకాల అమెజాన్ ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఏఐ మోడళ్లలో కొన్ని ఇబ్బందులను గుర్తించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే అమెరికా ఆంత్రోపిక్ ఆధునాతన మోడళ్లను విదేశీయులు వాడకుండా నిషేధించినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఆంత్రోపిక్ 'ఫ్యాబిల్ 5' మోడల్‌ను ఇటీవల విడుదల చేయగా.. దీనిపై అమెజాన్ పరిశోధకులు కొన్ని పరీక్షలు చేసినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఏఐ మోడల్స్ సాఫ్ట్‌వేర్ లోపాలను బయటపెట్టకుండా ఉండేందుకు అందులో భద్రతపరమైన ఫిల్టర్లు ఉంటాయి. కానీ అమెజాన్ పరిశోధకులు ప్రత్యేకమైన ప్రాంప్ట్‌లను ఉపయోగించడంతో ఫ్యాబిల్-5 మోడల్‌లో భద్రతా నిబంధనలను దాటవేసే సాఫ్ట్‌వేర్ లోపాలను గుర్తించినట్లు సమాచారం. ఈ విషయాన్ని అమెరికా ట్రెజరీ విభాగానికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అధునాతన సాంకేతికత సాయంతో సైబర్ నేరగాళ్లు సులువుగా హ్యాకింగ్‌కు పాల్పడే అవకాశం ఉందని ట్రంప్ సర్కారు ఆరోపించింది. ఈ ఏఐ టూల్స్‌తో సాఫ్ట్‌వేర్ కోడ్‌లోని లోపాలను సులువుగా గుర్తించి హ్యాకర్లు దుర్వినియోగం చేసే ముప్పు ఉందనే ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే ఫ్యాబిల్ 5, మిథోస్ 5 ఏఐ మోడళ్లను విదేశీ పౌరులకు నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆంత్రోపిక్‌లో పనిచేసే విదేశీ ఉద్యోగులకు కూడా ఈ మోడళ్ల యాక్సెస్ ఉండకూడదని స్పష్టంచేసింది.

# మే నెల్లోనూ రష్యా నుంచి భారీగా చమురు కొనుగోళ్లు

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ కొనసాగిస్తోంది. మే నెలలో రష్యా నుంచి అత్యధిక చమురు కొనుగోలు చేసిన రెండో దేశంగా నిలిచింది. ఈ నెలలో మొత్తంగా 5.8 బిలియన్ యూరోల విలువైన రష్యా ఇంధనం, బొగ్గు భారత్ కొన్నట్లు ఐరోపాకు చెందిన సెంటర్ ఫర్ రీసెర్చ్ ఎనర్జీ అండ్ క్లీన్ తన నివేదికలో వెల్లడించింది. రష్యా నుంచి దిగుమతుల్లో 83శాతం చమురు ఉండగా.. ఇతర పెట్రోలియం ఉత్పత్తులు 429 మిలియన్ యూరోలు, బొగ్గు 550 మిలియన్ యూరోల మేర భారత్ కొనుగోలు చేసింది. ఏప్రిల్ నెలతో పోలిస్తే మేలో రష్యా ముడిచమురు దిగుమతులు 21శాతం పెరిగాయి. వడినార్ రిఫైనరీ కొనుగోళ్లు 36 శాతం, జామ్‌నగర్ రిఫైనరీ కొనుగోళ్లు ఈ సమయంలో 14శాతం వృద్ధి చెందాయి. ఇక ప్రభుత్వ రంగ చమురు కర్మాగారాలు కూడా రష్యా క్రూడ్ ఆయిల్ దిగుమతులను గణనీయంగా పెంచాయి. గతేడాది నవంబర్‌లో రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేసిన ది న్యూ మంగళూరు, విశాఖపట్నం రిఫైనరీలు తాజాగా మార్చిలో తిరిగి మొదలుపెట్టాయి. మే నెల నాటికి భారీగా పెంచాయి. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా రష్యా నుంచి చమురు కొనగోలు చేస్తున్న భారత్, తుర్కియే, బ్రూనై, జార్జియాలు 641 మిలియన్ యూరోల చమురును ఎగుమతి చేశాయి. వీటిల్లో అత్యధికంగా ఐరోపా, ఆస్ట్రేలియా, అమెరికా, న్యూజిలాండ్‌లు వీటి నుంచి కొనుగోలు చేశాయి.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,95,000

# రాజ్యసభలో 2/3 మెజారిటీ దిశగా ఎన్డీయే!

**దిల్లీ:** పార్లమెంటు ఉభయసభల్లో ఎన్డీయే బలం పెరుగుతోంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల అనంతరం తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకున్న పరిణామాల నేపథయంలో ఎగువ, దిగువ సభల్లో ఎన్డీయే బలం పుంజుకుంటోంది. ముఖ్యంగా రాజ్యసభలో మూడింట రెండొంతుల (2/3) మెజారిటీకి చేరువవుతోంది. రాజ్యాంగ సవరణ బిల్లుల సమయంలో ఈ మెజారిటీ ఎన్డీయేకు ఉపయోగపడుతుంది. అదే సమయంలో లోక్‌సభలో మాత్రం మూడింట రెండొంతుల మెజారిటీకి ఇంకాస్త దూరంలో నిలవనుంది. ఝార్ఖండ్, మిజోరంలో రాజ్యసభ స్థానాలకు జరిగే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు (భాజపా మద్దతు) గెలిస్తే ఎన్డీయే బలం 151కి చేరుకుంటుంది. తృణమూల్ నుంచి ఇటీవల ముగ్గురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేసిన నేపథ్యంలో ఉపఎన్నికలు రానున్నాయి. ఉప ఎన్నికలు నిర్వహించే ఈ మూడుసీట్లనూ భాజపా గెలుచుకునే అవకాశం ఉంది. దీంతో ఎన్డీయే సంఖ్యా బలం 154కు చేరనుంది. అయినప్పటికీ మూడింట రెండొంతుల మెజారిటీకి 163 మంది ఎంపీల మద్దతు అవసరం. అంటే 9 స్థానాలు తక్కువ పడతాయి. మరింత మంది తృణమూల్ రాజ్యసభ సభ్యులు రాజీనామా చేసి ఎన్డీయేలో చేరితే 163 మార్కును చేరుకోవడం సాధ్యమవుతుంది. ఈ ఏడాది నవంబర్‌లో ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 10 మంది రాజ్యసభ సభ్యుల పదవీ కాలం ముగియనుంది. అసెంబ్లీలో సమాజ్‌వాదీ పార్టీ బలం పెరిగిన నేపథ్యంలో ఆ పార్టీ కొందరు ఎంపీలను రాజ్యసభకు పంపేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఆ మేర భాజపా ఎంపీల సంఖ్య తగ్గనుంది. ఒకవేళ 2/3 మెజారిటీ సాధించినా కొన్ని నెలల మురిపెం కానుంది. మరోవైపు ఇండియా కూటమికి పెద్దల సభలో 64 మంది ఎంపీలు ఉన్నారు. డీఎంకేకు చెందిన 8 మంది, ఆప్‌నకు చెందిన ముగ్గురు ఇండియా కూటమికి దూరంగా ఉండడంతో విపక్ష కూటమి బలం తగ్గుముఖం పట్టింది. మరోవైపు వైఎస్సార్‌సీపీ 7, బీజేడీ 7, వైగోకు చెందిన ఎండీఎంకేకు ఒక ఎంపీ ఉన్నారు. కీలక బిల్లుల సమయంలో వీరు ఎటువైపైనా మొగ్గు చూపొచ్చు. లోక్‌సభలో ఇప్పట్లో కష్టమే: రాజ్యసభలో ఎన్డీయే ఎంపీల సంఖ్యా బలం పెరిగినా లోక్‌సభలో 2/3 కష్టమేనంటున్నాయి రాజకీయ వర్గాలు. తృణమూల్ నుంచి వేరుపడిన 20 మంది ఎంపీలు ఎన్డీయేకు మద్దతు తెలుపుతూ సోమవారం లేఖ ఇవ్వనున్నారు. దీంతో ఎన్డీయే సంఖ్య బలం 314కు చేరనుంది. మూడింట రెండొంతుల బలం సాధించాలంటే 363 మంది ఎంపీల మద్దతు అవసరం.



## రష్యా చమురు కేంద్రాలపై ఉక్రెయిన్ దాడి

**క్రిమియా:** క్రిమియా సహా దేశంలోని పలు కీలక చమురు కేంద్రాలు, రైల్వే సదుపాయాలపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు చేసినట్లు రష్యా అధికారులు ప్రకటించారు. శనివారం రాత్రి ప్రారంభమైన దాడులు ఆదివారం తెల్లవారుజాము వరకు కొనసాగినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో యారోస్లావ్ చమురు శుద్ధి కర్మాగారం సమీపంలోని స్పెట్‌స్టోర్గ్ ప్లస్ చమురు డిపో పూర్తిగా ధ్వంసమైనట్లు తెలిపారు. ఘటనా స్థలంలో పెద్ద ఎత్తున మంటలు, పొగ ఎగసిపడుతున్నాయి. ఇందులో మూడు లక్షల క్యూబిక్ మీటర్ల కంటే ఎక్కువ సామర్థ్యం గల చమురు ట్యాంకులు ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ డిపోను గతంలోనూ పలుమార్లు కీవ్ లక్ష్యంగా చేసుకుంది. ఉక్రెయిన్ డ్రోన్ దాడుల వేళ ఇళ్ల నుంచి బయటకు రావద్దని యారోస్లావ్ గవర్నర్ ప్రజలకు సూచించారు. యారోస్లావ్ నుంచి మాస్కో వైపు వెళ్లే మార్గాన్ని మూసివేసినట్లు తెలిపారు. మరోవైపు.. ఉక్రెయిన్ పౌర ప్రాంతాలపై రష్యా ప్రతిదాడులు కొనసాగిస్తోంది. రష్యాలోని చమురుశుద్ధి కర్మాగారాలు, ఇంధన నిల్వ కేంద్రాలు, పైప్‌లైన్లపై ఉక్రెయిన్ విరుచుకుపడుతుండడంతో స్థానికంగా ఇంధన కొరత ఏర్పడిందని పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి.

## జీవ వైవిధ్యం క్షీణిస్తే భారత క్రెడిట్ రేటింగ్ తగ్గొచ్చు!




**లండన్:** జీవ వైవిధ్యం క్షీణిస్తే, 20 పాయింట్ల స్కేలుపై భారత క్రెడిట్ రేటింగ్ 4 గ్రేడ్‌లు పడిపోవడంతో పాటు రుణ సేవా వ్యయాలు ఏటా అదనంగా 49 బిలియన్ డాలర్లు (సుమారు రూ.4.65 లక్షల కోట్లు) పెరుగుతాయని నిపుణులు కొత్త అధ్యయనంలో హెచ్చరించారు. జీవ వైవిధ్యంతో కూడిన పర్యావరణాలు.. పంటలకు కీటకాలు పరాగ సంపర్కం చేయడం, సముద్రపు ఆహార వాల్యూ చైన్‌కు మహా సముద్రాలు ఆధారం కావడం వంటి విలువైన ఆర్థిక సహకారాలను అందిస్తాయని, వీటిని ఆర్థికవేత్తలు 'పర్యావరణ వ్యవస్థ సేవలు' అని పిలుస్తారని అధ్యయనం పేర్కొంది. ఈ సేవలను కోల్పోవడం వల్ల భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని తెలిపింది. సార్వభౌమ రేటింగ్‌లు దేశాల రుణాన్ని తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని అంచనా వేస్తాయి. ఇది ప్రభుత్వాలు రుణం తీసుకోవడానికి చెల్లించే ధరను నేరుగా ప్రభావితం చేస్తుంది. పరోక్షంగా ఇది పన్ను చెల్లింపుదార్లను కూడా ప్రభావితం చేస్తుంది. మత్స్య పరిశ్రమ, సహజ పరాగ సంపర్కం, ఉష్ణమండల కలప రంగాల్లో పాక్షిక పతనం కూడా ప్రపంచ జీడీపీలో ఏటా 2 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.190 లక్షల కోట్ల) క్షీణతకు కారణమవుతోందని పరిశోధకుల సంప్రదాయ అంచనాలు వెల్లడిస్తున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ షెఫీల్డ్, యూనివర్సిటీ ఆఫ్ ససెక్స్, ఎడిన్‌బర్గ్ బిజినెస్ స్కూల్, ఎస్ఓఏఎస్ యూనివర్సిటీ ఆఫ్ లండన్‌లకు చెందిన పరిశోధక బృందం ఈ అధ్యయనాన్ని చేపట్టింది.

## డిస్కవరీ, పారామౌంట్ విలీనం ప్రతికూల ప్రభావం చూపదు


### అమెరికా న్యాయశాఖ వెల్లడి

వాషింగ్టన్: వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ, పారామౌంట్ స్కైడ్యాన్స్ విలీనం వల్ల పరిశ్రమలో పోటీతత్వానికి, వినియోగదార్లకు ఎలాంటి హాని కలిగే అవకాశం లేదని అమెరికా న్యాయశాఖ తెలిపింది. వార్నర్ బ్రదర్స్‌ను కొనుగోలు చేయాలన్న పారామౌంట్ స్కైడాన్స్ ప్రతిపాదనపై విచారణను ముగించినట్లు పేర్కొంది. ఈ దిగ్గజ హాలీవుడ్ మీడియా సంస్థల విలీనం వినోద రంగంలో పోటీని పెంచుతుందని, అమెరికాలోని వినియోగదార్లకు, సిబ్బందికి ప్రయోజనాలు చేకూరుతాయని తమ యాంటీట్రస్ట్ విభాగం గుర్తించిందని వెల్లడించింది. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీని కొనుగోలు చేయడానికి డేవిడ్ ఎల్లిసన్‌కు చెందిన పారామౌంట్ స్కైడ్యాన్స్ ఫిబ్రవరి ఆఖర్లో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. నెలలపాటు చర్చలు జరపడంతో పాటు పోటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ బిడ్‌ను వెనక్కి నెట్టి పారామౌంట్ ఈ విజయాన్ని సొంతం చేసుకుంది. పారామౌంట్‌ను గతేడాదే స్కైడాన్స్ కొనుగోలు చేసింది. ఈ విలీనం వల్ల పరిశ్రమ వృద్ధి వేగం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. హెచ్‌బీఓ మ్యాక్స్, పారామౌంట్+ లైబ్రరీల కలయికతో వినియోగదారులకు మరింత కంటెంట్ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. అయితే ఇప్పటికే పరిశ్రమ కొన్ని ప్రధాన సంస్థల నియంత్రణలో ఉన్నందున మరిన్ని విలీనాలకు దారితీస్తున్న పరిణామాలపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.




# రోల్స్ రాయిస్ ఇంజిన్ ఎంఆర్ఓ కేంద్రం!

**న్యూఢిల్లీ:** భారత్‌లో 2025 శాంతి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత, అణుశక్తి రంగంలో ఉన్న అవకాశాలను కూడా కంపెనీ పరిశీలిస్తోంది. దేశంలో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లను (ఎస్ఎంఆర్‌లు) తయారుచేసేందుకు చూస్తున్నట్లు ముకుందన్ వివరించారు. మన దేశంలో పౌర విమానాల ఇంజిన్‌ల కోసం నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ) కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి బ్రిటన్ ఇంజినీరింగ్ దిగ్గజం రోల్స్ రాయిస్ ఆసక్తి చూపుతోంది. విలాసవంత కార్లతో పాటు విమాన ఇంజిన్లకు ఈ సంస్థ ప్రఖ్యాతి గాంచిన విషయం విదితమే. వైమానికదళ కార్యక్రమాల కోసం, భారత్‌లో విమాన ఇంజిన్ల అభివృద్ధికి మద్దతుగా 'ఏరో గ్యాస్ టర్బైన్ కాంప్లెక్స్' ఏర్పాటు చేయాలనీ ప్రతిపాదించింది. భారత అణువిద్యుత్ రంగంలో అవకాశాలనూ రోల్స్‌రాయిస్ అన్వేషిస్తోంది. ఈ ప్రణాళికలు కార్యరూపం దాలిస్తే, గణనీయమైన పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తాయని అంచనా. భారత్‌లో విమాన ఇంజిన్ తోడ్పాటు సేవలకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఎయిరిండియా, ఇండిగో సంస్థలు.. రోల్స్ రాయిస్ ఇంజిన్‌లతో నడిచే 100కు పైగా ఎయిర్‌బస్ ఏ350 విమానాల కోసం ఆర్డర్లు ఇవ్వడమే ఇందుకు కారణమని రోల్స్‌రాయిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (ట్రాన్స్‌ఫర్మేషన్ ఇండియా) శశి ముకుందన్ తెలిపారు. ప్రస్తుతం దేశంలో దాదాపు 100 విమానాలు రోల్స్ రాయిస్ ఇంజిన్‌లతో నడుస్తున్నాయని, వీటికి సంబంధించిన నిర్వహణ పనులు సింగపూర్, హాంకాంగ్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భారత్‌లో ఎంఆర్ఓ కేంద్రం ఏర్పాటు ద్వారా ఈ సేవలు ఇక్కడే లభిస్తాయన్నారు. బ్రిటన్ ప్రభుత్వ మద్దతుతో, పూర్తి సాంకేతిక పరిజ్ఞాన బదిలీతో భారత్‌లో ఏరో గ్యాస్ టర్బైన్ గ్యాస్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడానికి రోల్స్ రాయిస్ ప్రతిపాదించిందని ముకుందన్ పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మక అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) కార్యక్రమం కోసం ప్రతిపాదించిన విమాన ఇంజిన్‌ను భారత్‌లో అభివృద్ధి చేయొచ్చని, దీనికి సంబంధించి గ్రౌండ్ ట్రయల్స్ 2032 నాటికి, మొదటి విమాన ప్రయాణం 2034 నాటికి లక్ష్యంగా పెట్టుకోవచ్చన్నారు. ప్రస్తుతం దేశంలో సివిల్, డిఫెన్స్ ఏరోస్పేస్, పవర్‌సిస్టమ్స్, నేవల్, ల్యాండ్ డిఫెన్స్ రంగాల్లో రోల్స్ రాయిస్ కార్యకలాపాలు సాగిస్తోంది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్, ఫోర్స్ మోటార్స్ సంస్థలతో సంయుక్త సంస్థలు ఉన్నాయి. రక్షణ, అణుశక్తి రంగాల్లో ప్రణాళికలు కార్యరూపం దాలిస్తే, కంపెనీ దేశంలో బిలియన్ డాలర్ల (రూ.9500 కోట్ల) పెట్టుబడులు పెట్టడమే కాకుండా, 10,000 కంటే ఎక్కువ ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉందని ముకుందన్ స్పష్టం చేశారు.




## ఒమన్ తీరంలో భారత నౌక మునక..

టెహ్రాన్: ఒమన్ తీరంలో భారత్ జెండాతో ప్రయాణిస్తున్న ఓ నౌక నీటమునిగింది. యాంత్రిక లోపం కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకోగా.. అందులోని 14 మంది భారతీయ సిబ్బందిని కాపాడినట్లు అధికారులు తెలిపారు. వారంతా సురక్షితంగా, ఆరోగ్యంగా ఉన్నారని.. ముంబయికి వెళుతున్న మరో నౌకలో వారిని ఎక్కించినట్లు ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. "భారత జెండాతో ప్రయాణిస్తున్న 'ఎంఎస్‌వీ విరాట్ 1' నౌకకు సంబంధించిన సహాయక చర్యలు విజయవంతంగా పూర్తయ్యాయి. మొత్తం 14 మంది సిబ్బందిని రక్షించాం. వీరంతా ప్రస్తుతం 'జబల్ అలీ 9' నౌకలో ముంబయికి బయలుదేరారు" అని భారత ఎంబసీ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది. అంతకుముందు.. ఒమన్ తీరంలో ఓ నౌక నిలిచిపోయిందని, ఇంజిన్ వైఫల్యమే దీనికి కారణమని పేర్కొంది. "నౌకలోని సిబ్బంది లైఫ్ రాఫ్ట్‌లోకి మారారు. ఒమన్ అధికారుల సమన్వయంతో సమీపంలోని నౌకల ద్వారా వారి తరలింపు చర్యలు కొనసాగుతున్నాయి" తెలిపింది. నిశాంత్ భౌతికకాయం తరలింపునకు ఏర్పాట్లు: ఒమన్ తీర ప్రాంతానికి సమీపంలో ఓ చమురు ట్యాంకర్‌లో విధులు నిర్వహిస్తున్న భారతీయ నావికుడు నిశాంత్ ఉర్తనాథన్ అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఘటనపైనా రాయబార కార్యాలయం స్పందించింది. "నిశాంత్ కుటుంబ సభ్యులు, ఆ నౌక సిబ్బంది, సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. ఆయన భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా నౌక నుంచి దించి, స్వదేశానికి తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి" అని పేర్కొంది. ఇటీవల ఒమన్ తీరం సమీపంలో భారతీయులు ఉన్న నౌకలపై వరుసగా దాడులు జరిగాయి.

జనంసాక్షి www.janamsakshi.org

సోమవారం 15 జూన్ 2026





# 99 రోజుల ప్రజాపాలనలో ప్రగతి ప్రణాళిక.. అమలులో జగిత్యాల జైత్రయాత్ర

## అధికారులు సమన్వయంతో పని

### జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, అవగాహన కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాల సాధనకు కృషి చేశామని చెప్పారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు నాణ్యమైన సేవలు అందిం చేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉంటుందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు.

మంత్రి నుంచి సర్పంచ్, వార్డు మెంబర్ వరకు.. ప్రజల నుంచి అధికారుల వరకు అందరి భాగస్వామ్యంతో ఘన విజయం

## సంక్షేమ పథకాలతో లక్షలాది కుటుంబాలకు భరోసా

జిల్లాలో 38,417 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి వేలాది కుటుంబాలకు ఆహార భద్రత కల్పించారు. మహాలక్ష్మి పథకం కింద 1,61,896 మంది మహిళలు అర్హులుగా గుర్తించబడ్డారు. 55,65,913 గ్యాస్ సిలిండర్లకు రూ.22.42 కోట్ల సబ్సిడీ అందించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 7,680 ఇళ్లకు అనుమతులు మంజూరు చేయగా, 6,370 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇప్పటికే 1,146 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. గృహజ్యోతి పథకం కింద 1,71,437 కుటుంబాలకు రూ.147.49 కోట్ల ప్రయోజనం అందింది.



## జగిత్యాల జిల్లాకు కొత్త గుర్తింపు

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

99 రోజుల కార్యాచరణ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలును వేగవంతం చేసిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి వంటి సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. యువత నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.

## సంక్షేమం ఇంటింటికీ... అభివృద్ధి ప్రతి గ్రామానికీ...

- 1.78 లక్షల మంది రైతులకు రూ.131 కోట్ల రైతు భరోసా జమ
- 38,417 కొత్త రేషన్ కార్డులు.. 1.71 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి
- 7,680 ఇందిరమ్మ ఇళ్లకు అనుమతులు.. 1,146 ఇళ్ల నిర్మాణం పూర్తి

**జగిత్యాల బ్యూరో జూన్ 14 (జనంసాక్షి) :**

జగిత్యాల జిల్లా గత 99 రోజులుగా అభివృద్ధి, సంక్షేమం, ప్రజా చైతన్య కార్యక్రమాలకు వేదికగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి శాసనసభ నియోజకవర్గాల్లో విజయవంతంగా అమలై ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పును తీసుకువచ్చింది. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచనలు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పర్యవేక్షణలో గ్రామ, మండల, మున్సిపల్, నియోజకవర్గ, జిల్లా స్థాయిల లో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, సర్పంచ్ లు, వార్డు సభ్యులు, అధికారులు, స్వయం సహాయక సంఘాలు, రైతు సంఘాలు, యువజన సంఘాలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను ప్రజా ఉద్యమంగా మార్చారు.

**రైతు సంక్షేమానికి పెద్ద పీట**

రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలు 99 రోజుల కార్యక్రమంలో విస్తృతంగా ప్రజలకు చేరాయి. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కలిపి 1,78,489 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.131 కోట్లకు పైగా పెట్టుబడి సాయం అందించారు. 275 రైతు బీమా క్లెయిమ్‌లను పరిష్కరించి రూ.13.01 కోట్ల ఆర్థిక సహాయాన్ని రైతు కుటుంబాలకు అందజేశారు.





**యువత భవిష్యత్తుకు బలమైన పునాది**

నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు వేగవంతమయ్యాయి. జగిత్యాల ఏటీసీలో సీఎన్‌సీ లాథ్ మెషిన్ ఆపరేషన్, ప్రోగ్రామింగ్, ఆటోమేషన్, రోబోటిక్ వెల్డింగ్, ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ, ఆటో క్యాడ్ డిజైనింగ్ వంటి కోర్సులను ప్రారంభించి యువతకు ఆధునిక నైపుణ్యాలు అందిస్తున్నారు. జిల్లాలో రెండు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జగిత్యాలలో రూ.200 కోట్ల వ్యయంతో పాఠశాల పనులు పురోగతిలో ఉండగా, ధర్మపురిలో మరో పాఠశాలకు పరిపాలనా అనుమతులు లభించాయి. జిల్లాలో 14 పరిశ్రమల స్థాపనకు ప్రతిపాదనలు నమోదయ్యాయి. వాటి ద్వారా రూ.9.59 కోట్ల పెట్టుబడులు, 129మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

## అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా

### జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్

జగిత్యాల నియోజకవర్గంలో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా విస్తృత చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంట ర్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు యువత భవిష్య త్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి, ప్రతి కుటుం బానికి చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

# న్యాయవ్యవస్థను ప్రలోభాల నుంచి కాపాడాలి

- బార్ కౌన్సిల్ సభ్యునిగా వెంకట్ యాదవ్ రెండో విజయం
- న్యాయవాదుల బాధ్యత పెరిగింది: మధుయాష్కి గౌడ్
- బీసీలకు 42 శాతం కోటా సాధనకు కృషి
- సామాజిక న్యాయం కోసం పోరాటం అవసరం



**హయత్ నగర్, జూన్ 14 ( జనం సాక్షి) :**

తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యునిగా రెండోసారి ఘన విజయం సాధించిన సీనియర్ న్యాయవాది చలకాని వెంకట్ యాదవ్‌ను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఘనంగా సన్మానించి, అభినందించారు. భాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విజయోత్సవ సభకు మధుయాష్కి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయం లో న్యాయవాదులను సమీకరించి కీలక పాత్ర పోషించిన చలకాని వెంకట్ యాదవ్ బార్ కౌన్సిల్ సభ్యునిగా రెండోసారి గెలవడం అభినందనీయమన్నారు.

గతంలో హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేసిన వెంకట్ యాదవ్‌కు న్యాయవాదుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సమర్థవంతంగా కృషి చేస్తారని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ సభ్యునిగా పేద వర్గాల అభ్యున్నతికి ప్రత్యేకంగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ న్యాయవాదులకు ఇచ్చిన హామీల అమలుకు వెంకట్ యాదవ్ కృషి చేయాలని, ఇందుకు తాను సహకారం అందిస్తానని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు అధికంగా నష్టపోయాయని, సామాజిక న్యాయం కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. బీజేపీ పాలనలో ప్రలోభాలకు గురవుతున్న న్యాయవ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని పేర్కొన్నారు. చలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ హయాంలో హైకోర్టు, జిల్లా కోర్టుల్లో స్టాండింగ్ కౌన్సిల్, జీపీ తదితర పోస్టుల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలని మధుయాష్కి గౌడ్ పట్టుబట్టి 42 శాతం కోటా సాధించారని తెలిపారు. "బీసీలకు 42 శాతం" అనే నినాదం మధుయాష్కి గౌడ్ ద్వారానే ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, ట్రైకార్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్, పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ శ్రీనివాస్, స్టేట్ పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యుడు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, అఖిల భారత యాదవ సంఘం నేషనల్ జనరల్ సెక్రటరీ లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల అభివృద్ధి తన లక్ష్యం

- ఉప్పల్ నియోజకవర్గం ప్రతి చెరువు అభివృద్ధి చేస్తా.. ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి
- హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన



**కాప్రా, జూన్ 14 (జనం సాక్షి) :**

ఉప్పల్ నియోజకవర్గం ప్రతి చెరువు అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ఘట్టంగా నాచారం డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనుల శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాని కి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రూ.37.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు పరిసర ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఈ అభివృద్ధి పనులు ప్రారంభం కావడం సంతోషకరమని అన్నారు. చెరువును కేవలం నీటి వనరుగా కాకుండా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే ఆధునిక విహార కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాగుతోందని తెలిపారు.

సుందరీకరణ పనులలో భాగంగా చెరువు చుట్టూ ఆధునిక వాకింగ్ ట్రాక్‌లు, సైక్లింగ్ ట్రాక్‌లు, అందమైన ల్యాండ్‌స్కేపింగ్, హరితవనాలు, సిట్టింగ్ ఏరియాలు, అలంకార లైటింగ్, పిల్లల ఆట స్థలాలు, ఫుడ్ కోర్టులు, పర్యావరణ హిత సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఈ ప్రాంతం నగర ప్రజలకు ఒక ప్రధాన ఆకర్షణీయ కేంద్రంగా మారనుందని తెలిపారు.

అంతేకాకుండా చెరువు పరిరక్షణ, వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెంపు, భూగర్భ జలాల సంరక్షణ వంటి అంశాలకు కూడా ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత హెచ్ఎంటి నగర్ పరిసర ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, స్థానిక ఆస్తుల విలువలు కూడా పెరుగుతాయని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఉప్పల్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తాం... ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కట్టుబడి ఉన్నాం" అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం తాజా మాజీ కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, శ్రీనివాస్ రెడ్డి, కొత్త రామారావు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు,భారీ సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణం

### రూ.2.56 కోట్లు మంజూరు : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు జూన్ 14(జనంసాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణం కోసం సుమారు రూ.2.56 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు సురక్షితమైన మరియు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అనేక పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించగా, ప్రస్తుతం మిగిలిన పాఠశాలలకు కూడా నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ప్రహరీ గోడల నిర్మాణం ద్వారా పాఠశాల ఆస్తుల రక్షణతో పాటు విద్యార్థుల భద్రత మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత ప్రజాప్రతినిధులు, సర్పంచులు, అధికారులు సమన్వయంతో వెంటనే పనులను ప్రారంభించి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. తాండూర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## అంబర్పేట్‌లో బిజెపి విస్తృతస్థాయి బిజెపి కార్యకర్తల సమావేశం



**అంబర్ పేట్ జూన్ 14( జనం సాక్షి) :** బిజెపి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, దృఢ సంకల్పంతో ఉండాలని అన్నారు. అంబర్పేట్ అసెంబ్లీ నియోజకవర్గంలో బిజెపి విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి సికింద్రాబాద్ ఎంపీ గంగాపురం కిషన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నా రు. రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె .లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం లోని సమస్యలు, పార్టీ బలోపేతానికి చేయాల్సిన పనులు, ప్రజలకు నిరంతరం కార్యకర్తలు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రముఖులతోపాటు స్థానిక లీడర్ యశ్వంత్ పాల్గొని ఈ సమావేశం విజయవంతమైనదని తెలిపారు.

## తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయొద్దు

- ముఖ్యమంత్రి 23 వేల పాఠశాలల మూసివేత ప్రకటనను ఉపసంహరించుకోవాలి.
- తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ సమితి : సలహాదారుడు ఎన్ .జనార్ధన్



**తాండూరు జూన్ 14(జనంసాక్షి) :**

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా వేసవి సెలవులంతా ఉపాధ్యాయులు, సర్పంచులు, యువజనులు, తల్లిదండ్రులు కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు ఎంతో శ్రమించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, పోస్టర్లు పంపిణీ చేస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు అందిస్తామని తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. అనేక మంది ఉపాధ్యాయులు తమ వేసవి సెలవులను కూడా త్యాగం చేసి ప్రవేశాల పెంపు కోసం కృషి చేశారు. కొందరు "బడి బాట" వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి ఒక్క చిన్నారి కూడా విద్యకు దూరం కాకుండా చూసే ప్రయత్నం చేశారు. వారి అంకితభావం, నిబద్ధత ప్రశంసనీయం. ఇలాంటి సానుకూల వాతావరణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను 27,000 నుండి 4,000కు తగ్గించాలని అధికారులను ఆదేశించినట్లు వచ్చిన వార్త తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ప్రకటన నిజమైతే, ప్రభుత్వ పాఠశాలలపై ఆధారపడే లక్షలాది మంది పేద పిల్లలు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళనను కలిగించింది. పాఠశాలలను మూసివేయడం సమస్యకు పరిష్కారం కాదు. దానికి బదులుగా ప్రభుత్వం ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలి. తగిన తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, డిజిటల్ విద్యా వనరులు, అవసరమైన ఉపాధ్యాయులు మరియు బోధనేతర సిబ్బందిని సమకూర్చాలి.

ప్రతి చిన్నారికి తన నివాస ప్రాంతానికి సమీపంలోనే నాణ్యమైన ప్రభుత్వ పాఠశాలలో చదివే హక్కు ఉంది. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం వల్ల ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీనపడటమే కాకుండా, విద్యలో అసమానతలు మరింత పెరుగుతాయి. ముఖ్యంగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పిల్లలు తమ రాజ్యాంగబద్ధమైన విద్యా హక్కును కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం కాదు రాష్ట్ర బడ్జెట్ లో 20 శాతం నిధులను కేటాయించి తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విద్య పట్ల తన నిబద్ధతను చాటుకోవాలి. కావున ముఖ్యమంత్రి పాఠశాలల మూసివేత ప్రకటన ను వెంటనే ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## అక్షర రూపం దాల్చుతున్న ప్రగతి

### ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు

**ఇబ్రహీంపట్నం, జూన్ 14 (జనం సాక్షి )**

మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు సందర్శించారు. పాఠశాలలో ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల కల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్శన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్ రావ్ , ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వారితో పాటు పాఠశాల హెచ్ఓడీ గిరిధర్ గౌడ్, ప్రిన్సిపల్ రాములు, తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్, మరియు తపస్ మంచాల మండల ప్రధాన కార్యదర్శి కావలి దత్తాత్రేయ హాజరయ్యారు. పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, మరియు వివిధ శాఖల అధికారులు కూడా ఈ పరిశీలనలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా విద్యా కమిషన్ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# రెనే హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

- గోదావరిఖనిలో గల సింగరేణి రెనే కార్డియాక్ సెంటర్ హెడ్ రామకృష్ణ



**కరీంనగర్ బ్యూరో/ జైపూర్ 14 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలో సోమవారం సర్పంచ్ మహమ్మద్ ఫయాజుద్దీన్, ఉపసర్పంచ్ ఎలకటూరి శివ ఆధ్వర్యంలో కరీంనగర్ రెనే హాస్పిటల్, సింగరేణి రెనే కార్డియాక్ సెంటర్ గోదావరిఖని సంయుక్త ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి అనూహ్య స్పందన వెల్లువెత్తింది. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ వంటి అవసరమైన పరీక్షలు నిర్వహించి హాజరైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా మందులు అందజేశారు. సింగరేణి రెనే కార్డియాక్ సెంటర్ హెడ్ రామకృష్ణ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో గుండె వ్యాధులపై అవగాహన లోపించడం వల్ల అనేకులు ఈ సమస్యలకు గురవుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో గోదావరిఖని కార్డియాక్ సెంటర్‌కు చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డా. తులసి రామ్, డా. ధర్మతేజ, క్రిటికల్ కేర్ వైద్యులు డా. సంతానం, డా. క్రాంతి కుమార్, డా. తేజస్విని తదితరులు పాల్గొని సుమారు 410 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పెద్దపల్లి జిల్లాలో ఫుల్ టైమ్ కార్డియాలజిస్ట్ ఉన్న ఏకైక హాస్పిటల్ సింగరేణి కార్డియాక్ సెంటర్ అని రామకృష్ణ తెలిపారు. ఇది సింగరేణి కార్మిక ప్రాంత ప్రజలకు పెద్ద ఊరటనిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రతి గ్రామంలో నిర్వహించి గ్రామీణుల్లో గుండె వ్యాధులు, ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచాలని ఆయన ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు గుండె సమస్యలకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గోదావరిఖని సింగరేణి ఏరియా రెనే హాస్పిటల్‌లో అత్యాధునిక పరికరాలు, అనుభవజ్ఞులైన డాక్టర్లతో కార్డియాక్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని రామకృష్ణ చెప్పారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సామాన్యులకు అందుబాటులో అసమాన వైద్య సేవలు అందించాలనే చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి ఆశయాలను అనుసరించి గ్రామీణ ప్రాంతాల్లోకి అత్యాధునిక వైద్య సౌకర్యాలను విస్తరించడానికి తామంతా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసిన సర్పంచ్ మహమ్మద్ ఫయాజుద్దీన్, ఉపసర్పంచ్ ఎలకటూరి శివలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రెనే హాస్పిటల్ కరీంనగర్ మార్కెటింగ్ మేనేజర్ అభిలాష్ రెడ్డి, సింగరేణి కార్డియాక్ సెంటర్ హెడ్ రామకృష్ణ, మేనేజర్లు అవినాష్, గౌతం, వైద్యులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# డయాబెటిస్ నియంత్రణకు ఆధునిక వైద్య విధానాలు అవసరం

- మధుమేహం ప్రజారోగ్య సమస్యగా మారుతోంది
- యువతలోనూ వేగంగా పెరుగుతున్న కేసులు
- తాజా పరిశోధనలు, చికిత్సా విధానాలపై చర్చ



**కరీంనగర్ బ్యూరో జూన్ 14 (జనంసాక్షి) :** మధుమేహ వ్యాధి దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఆధునిక వైద్య విధానాలు, తాజా పరిశోధనలపై వైద్యులు నిరంతరం అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని టీజీఆర్ఎస్ఎస్‌డీఐ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. జి. దీప తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని ప్రతిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిమ్స్)లో నిర్వహించిన "పంచమ్ – 2026" డయాబెటిస్ వైద్య శాస్త్రీయ సదస్సులో ఆమె మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య నిపుణులు, ప్రొఫెసర్లు, పీజీ విద్యార్థులు, ఇంటర్న్‌లు, వైద్య విద్యార్థులతో కలిపి సుమారు 800 మంది ప్రతినిధులు పాల్గొనడం సంతోషకరమని డా. దీప అన్నారు. ప్రస్తుతం మధుమేహం ప్రధాన ప్రజారోగ్య సమస్యగా మారిందని, ఐసీఎంఆర్ అధ్యయనాల ప్రకారం దేశంలో మధుమేహం, ప్రీ–డయాబెటిస్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని వివరించారు. తక్కువ వయస్సులోనే మధుమేహం బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, దీని నివారణ, ముందస్తు గుర్తింపు, సమర్థవంతమైన చికిత్సపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సదస్సులో డయాబెటిస్ చికిత్సలో తాజా పురోగతులు, కొత్త చికిత్సా విధానాలు, సాంకేతిక ఆవిష్కరణలు, క్లిష్ట వైద్య పరిస్థితుల నిర్వహణ వంటి అంశాలపై నిపుణులు చర్చించడం వైద్య రంగానికి ఎంతో ఉపయోగకరమని ఆమె పేర్కొన్నారు. శాస్త్రీయ చర్చలు, అనుభవాల మార్పిడి ద్వారా రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చన్నారు. మధుమేహ చికిత్సతో పాటు వ్యాధి నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడం కూడా వైద్యుల సామాజిక బాధ్యత అని డా. జి. దీప స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రతిమ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఎల్. జాన్ ఇజ్రాయిల్, డాక్టర్ డీసీ తిరుపతి రావు, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎం. విజయ్ మోహన్ రెడ్డి, డాక్టర్ సిఎల్ ప్రసాద్, సీఈఓ రామచంద్రం రావు, డాక్టర్ రఘురామ రెడ్డి, డాక్టర్ కుమార్ నేత, ప్రతిమ జనరల్ వైద్య బృందం, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్రాలు కలిస్తేనే అభివృద్ధి సాధ్యం

### గత ప్రభుత్వ మూర్ఖత్వం వల్ల తెలంగాణ నష్ట పోయింది

- గ్రామాలను మండలాలు, నియోజకవర్గాలకు కనెక్ట్ చేసేలా రోడ్లు నిర్మిస్తున్నాం
- స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో కరీంనగర్ ఎంపీ సెగ్మెంట్‌ను అభివృద్ధి చేస్తున్నా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి/ వేములవాడ రూరల్ జులై 15 (జనంసాక్షి) :** కేంద్రం, రాష్ట్రం కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమని, రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. గత ప్రభుత్వ మూర్ఖపు పాలన వల్ల తెలంగాణ చాలా నష్టపోయిందని విమర్శించారు. వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామ శివారులో వేములవాడ–సిరికొండ రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తున్నందువల్లే కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయని తెలిపారు. గ్రామాలను మండలాలతో కనెక్ట్ చేసేలా తగిన నిధులు మంజూరు అవుతున్నాయన్నారు.

గత ఏడేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.22 వేల కోట్లకు పైగా కేంద్ర నిధులు తీసుకొచ్చానని బండి సంజయ్ వెల్లడించారు. సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద వేములవాడ నుంచి సిరికొండ వరకు 18.21 కి.మీ. రోడ్డు విస్తరణ, బలోపేతం పనులకు రూ.23 కోట్లు మంజూరు చేశారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని గడువు విధించారు. రహదారి విస్తరణ, సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టులు, భద్రతా చర్యలు చేపట్టనున్నారు. ఈ రోడ్డు ద్వారా మామిడిపల్లి, బావుసాయిపేట, రామన్నపల్లి, గోవిందరావుపేట తండా తదితర గ్రామాల ప్రయాణీకులు, వాహనదారులు ఎంతో సమయం ఆదా చేసుకోవచ్చన్నారు.

కరీంనగర్–వరంగల్, ఎల్కతుర్తి–సిద్దిపేట నేషనల్ హైవేలు, చొప్పదండి–మల్యాల రోడ్డు విస్తరణ, కరీంనగర్–జగిత్యాల రోడ్డు విస్తరణకు కూడా భారీ నిధులు మంజూరు చేశామని తెలిపారు. గతంలో ఏ ఎంపీ కూడా ఈ స్థాయిలో నిధులు తీసుకురాలేదని గుర్తు చేశారు. ఎన్నికల వరకే రాజకీయాలు, ఎన్నికల తర్వాత ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా అందరినీ కలుపుకొని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, వికాస్ రావు, గోపి, రాపల్లి శ్రీధర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.



# ఏరులై పారుతున్న మద్యం

- భిక్కనూరు మండలంలో ఒక్క లైసెన్స్‌తో ఐదుగురు అక్రమ విక్రయాలు
- పెద్దమల్లారెడ్డిలో ఒక్కగ్రామంలోనే 19 బెల్ట్ షాపులు
- తక్షణం దాడులు, రద్దు చేయాలి : ప్రజలు

## ఎక్సైజ్ శాఖ 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహారం

**భిక్కనూరు జూన్ 14 (జనం సాక్షి):** భిక్కనూరు మండలంలోని వివిధ గ్రామాలలో పెద్దమల్లారెడ్డి, కాచాపూర్, జంగంపల్లి, తిప్పాపూర్ మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి,ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ బెల్ట్ షాపులు,అక్రమ మద్యం విక్రయాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఏరులై పారుతున్నా,స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం "మాకేం పట్టనట్టు" నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఒక్క లైసెన్స్... ఐదుగురికి పర్మిషన్!**

మండలంలో ఎక్సైజ్ శాఖ తీరు చూస్తుంటే ఒక్కరికి లైసెన్స్ ఇచ్చి.. ఐదుగురిని అమ్ముకోమన్నట్టు తయారైంది. అధికారికంగా అనుమతి పొందిన మద్యం దుకాణాల యాజమాన్యాలు, గల్లీ గల్లీకీ తమ సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నాయి. గ్రామాల్లో ఇష్టానుసారంగా బెల్ట్ షాపులను ఏర్పాటు చేస్తూ,చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యాడు. ఒక్క గ్రామం పెద్దమల్లారెడ్డిలోనే సుమారు 19కి పైగా షాపులా? పరిస్థితి ఎంత దారుణం! మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో పరిస్థితి మరీఘోరంగా తయారైంది. కేవలం ఒక్క గ్రామంలోనే దాదాపు 19 కంటే ఎక్కువ అక్రమ మద్యం విక్రయ కేంద్రాలు బెల్ట్ షాపులు నడుస్తున్నాయంటే ఇక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.ప్రతి వీధిలోనూ,కిరాణా షాపుల్లోనూ మద్యం అందుబాటులో ఉంచుతూ యువతను, కూలీలను మద్యానికి బానిసలుగా మారుస్తున్నారు. ఇదంతా అధికారుల కళ్ల ముందే జరుగుతున్నా, వారు కళ్లున్నా కనపడనట్లే నటిస్తుండటం వెనుక ఉన్న "అంతర్యమేమిటో" బహిరంగ రహస్యమే!

**ప్రజల ఆగ్రహం: తిరుగుబాటు తప్పదా?**

జిల్లా అధికారులు నిద్రమత్తు వీడి ఎప్పుడు స్పందిస్తారో వేచి చూడాలి.బెల్ట్ షాపుల నిర్వాహకులకు,అధికారులకు మధ్యఉన్న 'ఆర్థిక బంధం' వల్లే ఈఅక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు.ప్రజలే కలిసికట్టుగా తిరుగుబాటు మొదలుపెట్టే రోజు వరకు ఈఅక్రమ దందా ఆగేలా కనిపించడం లేదు" అని స్థానిక మహిళలు,యువజన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

**తక్షణమే చర్యలు చేపట్టాలి**

మద్యం మహమ్మారి వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, భిక్కనూరు మండలంలో ముఖ్యంగా పెద్దమల్లారెడ్డి గ్రామంలో గతంలో ఒక వైన్ షాప్ ఉండేది దాంతో ఆగ్రామానికి ఉన్న చుట్టుపక్కల గ్రామాల యువత కూలి చేసే పేదవాడు, రెక్కాడితే కానీ డొక్కాడని కూలిపని చేసి మద్యంకు బానిసై పొద్దుమాపు అని తేడా లేకుండా మద్యం తాగుతూ ఊగుతూ మధ్యతరగతి కుటుంబంలో గొడవలు కలహాలు జరుగుతున్న క్రమంలో ఇప్పుడు అక్కడ ఉన్న గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధుల అండదండలతో మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా మద్యం ఏరులై పారుతుంది దీంతో ముఖ్యంగా యువత మద్యానికి బానిసై భవిష్యత్తు నాశనం అయ్యే రోజులు,ఉన్న అక్రమ మద్యం కేంద్రాలపై దాడులు నిర్వహించి, బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి అధికారులు తలొగ్గక తప్పదని హెచ్చరిస్తున్నారు.



# స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండాలి

- విద్యతో ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవచ్చు
- గాండ్ల సంఘం ప్రతిభా పురస్కార కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జనం సాక్షి :** ఇందూరు: విద్యార్థులు స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ తెలిపారు. గాండ్ల పట్టణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు ప్రతిభ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఐక్యమత్యానికి ప్రతీక గాండ్ల సంఘమని కొనియాడారు. విద్యతో ఉన్నత లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. ఏదైనా దొంగలించబడుతుంది, కానీ విద్యను ఎవరు దొంగిలించే ప్రసక్తే లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాయని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తామని చెప్పిందన్నారు. అయితే స్థల ప్రభావంతో ఇందూరులో ఇబ్బందులు ఎదురయ్యాయని, దీంతో తాను సీఎం దృష్టికి తీసుకెళ్లానని గుర్తుచేశారు. శ్రీ ధన్ పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గత ఐదేళ్లుగా వంద మంది పేద విద్యార్థులకు విద్యను అందజేస్తున్నామన్నారు. అలాగే గాండ్ల సంఘం పేద విద్యార్థులకు కూడా తనవంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి రమేష్, కార్పొరేటర్లు ప్రసన్న సత్యపాల్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, ఎర్రం సుధీర్, మనోహర్, బీజేపీ నాయకులు గిరిబాబు, నూనె వేణు, గాండ్ల పట్టణ సంఘం అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి మోహన్, రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

# గుప్త దానం కంటే రక్తదానం గొప్పది

### రక్తదానం చేయండి మానవత్వాన్ని చాటండి : రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 14: జనం సాక్షి :** ప్రపంచ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ రేస్ రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో లోక్ భవన్‌లో జరిగిన అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ మాన్యశ్రీ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా విచ్చేసి అవార్డులను రక్త దాతలకు రక్త ప్రోత్సాహకులకు సంస్థలకు రక్తనిధులకు అందజేశారు. దీంట్లో భాగంగా నిజాంబాద్ జిల్లా కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య తరపున ప్రకాష్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నిజామాబాద్ పోలీస్ డిపార్ట్మెంట్ ద్వారా అత్యధిక రక్తదానాలు చేయించినందుకు అవార్డు ప్రదానం చేయడం జరిగింది.అలాగే జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమన్ రెడ్డి తరపున జనరల్ సెక్రెటరీ ప్రశాంత్ ఎమ్మార్వో వర్ని వీరికి అత్యధిక సంఖ్యలో రక్తదాతలను ప్రోత్సహించినందుకు ఈ అవార్డును అందజేయడం జరిగింది. ఈ అవార్డుల కార్యక్రమంలో జిల్లా రెడ్క్రాస్ చైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కోశాధికారి కర్నూ రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సూర్యనారాయణ హాజరైనారు. ఈ సందర్భంగా లోక్ పవన్ లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అందులో 87 సార్లు రక్తదానం చేసిన తోట రాజశేఖర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాష్ట్ర గవర్నర్ మాన్యశ్రీ శివ ప్రతాప్ శుక్ల ప్రత్యేకంగా అభినందించారు.

### సోషల్ మీడియాలో సదరం క్యాంపుల తేదీలపై అవాస్తవ ప్రచారం : డిఆర్‌డిఓ

**కామారెడ్డి:** సోషల్ మీడియాలో చలామణి అవుతున్న "జూన్ 14, 15, 21, 22 తేదీలలో జిల్లా ఆస్పత్రి, కామారెడ్డిలో సదరం క్యాంపులు" అనే పోస్టర్ తప్పుడు సమాచారమని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డిఆర్‌డిఓ) స్పష్టం చేశారు. ఇది అధికారికమైన పోస్టర్ కాదని, ప్రజలు ఎవరూ ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. అధికారికంగా సదరం క్యాంపుల తేదీలు, స్థలం, సమయం వివరాలను దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ మొబైల్ నంబరుకు మాత్రమే ఎస్ఎంఎస్ ద్వారా లేదా నేరుగా ఫోన్‌కాల్ ద్వారా తెలియజేస్తారని డిఆర్‌డిఓ. తెలిపారు. తప్పుడు సమాచారాన్ని సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరిక జారీ చేశారు.

# ఓట్ల వేటలో కేంద్రం 'దొంగదారి' కుట్ర


- ఎస్ఐఆర్‌తో 30-35 శాతం ఓట్ల తొలగింపు ప్లాన్
- కాంగ్రెస్ బలం ఉన్న చోట టార్గెట్
- తెలంగాణలోనూ బీహార్-బెంగాల్ ఫార్ములా
- ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ పిలుపు




**గోదావరిఖని,జూన్ 14 (జనం సాక్షి):** టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) అవగాహన శిక్షణ శిబిరం ఆదివారం కాజీపల్లి ఎన్‌టీపీసీలోని శ్రీమయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రతిపక్ష పార్టీలు, ప్రతిపక్ష ప్రభుత్వాలను టార్గెట్ చేసి ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెరలేపిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ బలంగా ఉన్న ప్రాంతాల్లో ఓట్లను తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఎస్ఐఆర్‌ను ఒక పెద్ద భూతంగా అభివర్ణించిన శ్రీధర్ బాబు, ఇది స్పష్టమైన దొంగదారి చర్య అని మండిపడ్డారు. కాంగ్రెస్ బలం ఉన్న చోట్ల 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్' పేరిట తొలగించే ప్లాన్‌తో కేంద్రం ముందుకు వెళ్తోందని, పేర్లలో స్వల్ప తేడాలు, వయస్సు అంతరాలు వంటి సాకులతో ఓట్లను లేపేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో అమలు చేసిన అదే ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలో కూడా ప్రయోగించాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు.

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను ఉదాహరణగా చెప్పిన శ్రీధర్ బాబు, ఓట్లు దొంగిలించడం నుంచి ఇప్పుడు సీట్లనే దొంగిలించే దుస్థితికి బీజేపీ దిగజారిందని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ మద్దర్లు చేసేవారు కాదని, ప్రజలకు అండగా నిలబడి పని చేసేవారని, సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. రాబోయే పది సంవత్సరాలు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రకటించారు. బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే ఓట్ మ్యాపింగ్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, హైదరాబాద్‌లో ఉండే ఓటర్లను కూడా సమయానికి రప్పించి ఓట్లను కాపాడుకోవాలని సూచించారు. ప్రజల జనాదరణతో ప్రతి ఓటును కాంక్రీట్ గోడలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ విజయరమణ రావు, హర్కర వేణుగోపాల్ రావు, దుద్దిళ్ల శ్రీను బాబు తదితరులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ సురేష్ షట్కార్, ఇరావర్తి అనిల్, రియాజ్ తదితరులు బీఎల్ఏలకు శిక్షణ ఇచ్చారు. జనక్ ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, సర్పంచులు, బీఎల్ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రాజెక్టులపై ప్రభుత్వ విప్‌కు అవగాహన లేదా?

- బీఆర్ఎస్ ప్రభుత్వమే ప్రాజెక్టులు పూర్తి చేసింది
- కలికోట సూరమ్మ, మెడిగడ్డపై విమర్శలు
- వేములవాడ అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే
- గ్యారంటీలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఎక్కడ?
- నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 15 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని ప్రాజెక్టుల అంశంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు అవగాహన ఉందా? ప్రాజెక్టులు పూర్తి చేసింది ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే కదా అని వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రశ్నించారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, శనివారం బీఆర్ఎస్ కార్యకర్తల సమ్మేళనం భారీ విజయం సాధించిందని, భారీ సంఖ్యలో హాజరైన కార్యకర్తలను చూసి అధికార పార్టీ నాయకులకు భయం పుట్టిందన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కాస్త అవగాహనతో మాట్లాడితే బాగుండేదని విమర్శించారు.

కలికోట సూరమ్మ ప్రాజెక్టుకు చుక్కనీరు కూడా పోతలేదని, రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రశ్నించారు. మెడిగడ్డపై రాజకీయం మాని ప్రజలకు మేలు చేయాలని హితవు పలికారు. ప్రాజెక్టులకు జీవం పోసింది కేసీఆర్ అని, ప్రాజెక్టుల అంశంపై అవగాహన లేకుండా మాట్లాడితే తమను చులకన చేసుకుంటారని హెచ్చరించారు.

వేములవాడ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందంటున్నారని, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశామని లక్ష్మీనరసింహారావు స్పష్టం చేశారు. రాజన్న గుడిని చెడగొడుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని, యాదాద్రి వెళ్లి బీఆర్ఎస్ నిర్మాణం చూడాలని సూచించారు. బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధికి కోట్లు మంజూరు చేసినా ప్రస్తుత ప్రభుత్వం పనులు నిలిపేసిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీల్లో యువ వికాసం గ్యారంటీ ఏమైందని, రైతు భరోసా 10 వేలు పట్టాదారు, కౌలుదారులకు ఇస్తామని చెప్పి ఏమైందని ప్రశ్నించారు. ఉద్యమకారులకు భూములు, 114 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, సొంత గ్రామంలో 30 పడకల ఆసుపత్రి ప్రారంభం ఎప్పుడని ప్రశ్నల వర్షం కురిపించారు. సెస్ రద్దు, థర్డ్ సిస్టమ్, సోలార్ సిస్టమ్‌తో 24 గంటల కరెంటు ఎలా అని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఏనుగు మనోహర్ రెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, కందుల క్రాంతి కుమార్, వెంగళ శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు అమలు చేయాలి: సీపీఎం

**కరీంనగర్ టౌన్, జూన్ 14: ( జనం సాక్షి) :** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ కమాన్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా, కౌలు భరోసా, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కళ్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు తదితర ఎన్నికల హామీలు అమలు కాలేదని విమర్శించారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలయ్యే వరకు ప్రజా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, NACHAKA JAYASURYA, S/o SATYAKEERTHI, Date of Birth: 17-03-2004, SSC Roll No.: 1922186155, hereby declare that my mother's name has been incorrectly recorded as "RAJESWARI" in my SSC Certificate and School Records.The correct name is "NAGA RAJESWARI DEVI" as per Aadhaar and other identity documents.Henceforth, both names shall be treated as one and the same person for all purposes.

Sd/-NACHAKA JAYASURYA

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
15 జూన్ 2026

# 'మునీర్' స్ఫూర్తితో సింగరేణిని పరిరక్షించుకుందాం

## కార్మికుల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం
## కార్మిక శాఖా మంత్రి వివేక్ వెంకటస్వామి



**రామకృష్ణాపూర్ (జనంసాక్షి) :** సింగరేణి సంస్థను పరిరక్షించే బాధ్యతను తాను,తమ ప్రభుత్వం తీసుకుంటుందని కార్మిక,గనుల శాఖా మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి హామీ ఇచ్చారు. మందమర్రిలో సీనియర్ జర్నలిస్ట్ మునీర్‌పై రాసిన మునీర్ భాయ్ పుస్తకావిష్కరణ సభలో ఆయన ఆదివారం ముఖ్య ఆవిష్కర్తగా హాజరై ప్రసంగించారు. గతంలోసింగరేణి సంస్థ సిక్ ఇం డస్ట్రీగా మారి బిఐఎఫ్ఆర్ పరిధిలోకి పోయినప్పుడు తన తండ్రి అయిన కాకా వెంకటస్వామి సింగరేణి కాపాడినాడన్నారు. ఆ కాలంలో మునీర్ తన వార్తల ద్వారా సంస్థ పరిరక్షణకు మార్గ నిర్దేశనం చేసినాడన్నారు. ఆ మునీర్ స్ఫూర్తితోనే సింగరేణి పరిరక్షణకు అందరమూ కలసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో మునీర్ కృషి ఎంతగానో ఉందన్నారు. ఎంత నిక్కచ్చిగా వార్తలు రాసేవాడో అంటే నిఖార్సుగా మనుషుల పట్ల ప్రేమాభి మానాలతో ఉండేవాడన్నారు .మునీర్ పేరిట ప్రెస్‌భవన్, ఆయన విగ్రహ ప్రతిష్ఠాపన కోసం స్థలం కోసం సింగరేణితో మాట్లాడుతానన్నారు. మునీర్ కుటుంబంతో తమకున్న అనుభవాన్ని ఆయన నెమరువేసుకున్నాడు. మానవ హక్కుల పట్ల,కార్మిక పోరాటాల పట్ల అతని నిబద్ధత వెలకట్టలేనిదన్నారు. అతని కుటుంబానికి పెన్షన్ ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు.

### పవన్.. మునీర్ జీవిత చరిత్ర చదువు : ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్

తెలంగాణ లో ఇల్లు కట్టుకుని ఉంటూ తెలంగాణలోనే ప్రెస్‌మీట్ పెట్టి 'నన్ను తెలంగాణకు రానివ్వరా,మీ జాగీరా"అని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడటం హాస్యాస్పదమని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మునీర్ పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతూ పవన్‌కు తెలంగాణతత్వం బోధపడలేదన్నారు. మునీర్‌పై రాసిన ఈ పుస్తకం చదివితే అర్థమవుతుందని ప్రకాశకులు ఒక పుస్తకాన్ని ఆయనకు పోస్ట్ చేయాలని సూచించారు.మునీర్ సమాజ ఉన్నతి కోసం జీవితాంతం కృషి చేశాడన్నారు. విద్యార్థి, కార్మిక నాయకుడిగా, జర్నలిస్ట్‌గా, తెలంగాణ ఉద్యమకా రునిగా ఆయన ప్రస్థానం ఈ సమాజంపై చెరగని ముద్ర వేసిందన్నారు. సింగరేణి కార్మికోద్యమాలల్లో అతను చురుకైన పాత్ర పోషించాడన్నారు. ఆయన జీవిత చరిత్రను అందరూ చదవాలన్నారు. ఈ పుస్తకం యాభై సంవత్సరాల కోల్‌బెల్ట్ ఉద్యమాల చరిత్రను రికార్డ్ చేసిందన్నారు.

### సాహసిక జర్నలిస్ట్ మునీర్ : సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి

మునీర్ సాహసికుడైన జర్నలిస్ట్ అని ప్రముఖ సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి కొనియాడారు.తాను సింగరేణిలో పనిచేసిన అనుభవం ఉందని,సింగరేణి ప్రాంత సమస్యలను బలంగా వినిపించిన వ్యక్తి మునీర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో తాను హెచ్ఎం టివి తరఫున నిర్వహించిన దశ దిశ కార్యక్రమంలో మునీర్ సింగరేణిలో వివక్ష గురించి అద్భుతంగా వివరించారన్నారు. తెలంగాణ ప్రభుత్వ మాజీ విప్ నల్లాల ఓదెలు మాట్లాడుతూ మునీర్ సహచరున్ని అయినందుకు గర్వపడుతున్నానని అన్నారు.తన జీవితం లో మునీర్ సలహా లేకుండాముందడుగు వేయలేదన్నారు. సీనియర్ జర్నలిస్ట్ మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ మునీర్ పోరాట స్ఫూర్తి గొప్పదని కొనియాడారు.తెలంగాణ నుంచి హైదరాబాద్ ను వేరు చేసే కుట్ర తయారవుతుందని దానిపట్ల అందరూ అప్రమత్తత తో ఉండాలని విజ్ఞప్తి చేశారు.ఆ కుట్రను ఎదుర్కొనడానికి తిరిగి ఉద్యమించడానికి సన్నద్ధం కావాలన్నారు.



### నిత్యం ప్రజల గురించి ఆలోచించే మునీర్
### జనంసాక్షి సంపాదకులు రహమాన్



నిత్యం ప్రజల గురించి ఆలోచించే మనిషి మునీర్ అని జనంసాక్షి సంపాదకులు రహమాన్ అన్నారు. విస్తృతంగా అనేక సమస్యలపై వార్తాకథనాలు రాసారన్నారు. మునీర్ మానవతావాది మాత్రమే కాకుండా పీడితుల పక్షాన నిలిచిన వ్యక్తి అన్నారు. పుస్తక సంపాదకుడు మాదాసి రామ్మూర్తి మాట్లాడుతూ సింగరేణి ఉద్యమాలనుండి మునీర్‌ను విడదీసి చూడలేమన్నారు. ప్రతీ సామాజిక ఉద్యమంలో మునీర్ తనదైన,చురుకైన పాత్ర పోషించాడన్నారు. సహ సంపాదకుడు వెంకట రావు మాట్లాడుతూ మునీర్ ఒక ఫినామినా అని అభివర్ణించారు. సమావేశంలో ట్రేడ్ యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కెంగర్ల మల్లయ్య, గురజాల రవీందర్ రావు, హెచ్.రవీందర్‌లు మాట్లాడగా చందర్ అధ్యక్షత వహించారు.

# ప్రపంచ నాగరికతలను భద్రపరిచిన సలార్ జంగ్

- వారసత్వ సంపదతో వేలాది మందికి జీవనోపాధి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




**హైదరాబాద్ (జనంసాక్షి) :** నగరం కొన్ని సంస్థలను నిర్మిస్తే.. మరికొన్ని సంస్థలు ఆ నగర ఆత్మను నిర్మిస్తాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. సలార్ జంగ్ మ్యూజియం హైదరాబాద్ నగర ఆత్మకు ప్రతిరూపమని అన్నారు. సలార్ జంగ్ మ్యూజియం 75వ వసంతాల వేడుకలతో పాటు, మీర్ యూసుఫ్ అలీఖాన్ (సలార్ జంగ్-3) 137వ జయంతి ఉత్సవాల్లో ఆయన ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భమగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచాన్ని ఒడిసిపట్టిన మహోన్నత వ్యక్తి సలార్ జంగ్-3 అన్నారు. సాధారణంగా మనం మన కళ్ళజోడు, మొబైల్ ఫోన్, కార్ కీస్ లాంటి చిన్న వస్తువులనే మర్చిపోతుంటాం. కానీ సలార్ జంగ్-3 ఏకంగా ప్రపంచ నాగరికతలనే భద్రపరిచారని అన్నారు. 43 వేల కళాఖండాలను సేకరించడం అంటే అది కేవలం సేకరణ కాదు.. కళలపై ఆయనకున్న అపారమైన భక్తి అని చెప్పారు. ప్రపంచంలోని అరుదైన సౌందర్యాన్ని, చరిత్రను తన సొంత నిధుల నుంచి సేకరించి.. వాటన్నింటినీ ప్రజల ఆస్తిగా మార్చిన ఆయన ఉదారత సాటిలేనిదని చెప్పారు. ఈ మ్యూజియంలో హిందువుల కాంస్య విగ్రహాలు, పవిత్ర ఖురాన్ ప్రతిమలు, క్రైస్తవ మడోన్నా శిల్పాలు, బౌద్ధ కళాఖండాలు ఒకే చోట కొలువై ఉన్నాయని చెప్పారు. విష్ణుమూర్తి దశావతారాలు, ఖురాన్ శ్లోకాలు కలిసి ఉన్న ఆచార వస్తువులు ఇక్కడి ప్రత్యేకతగా ఆయన అభివర్ణించారు. ఇది మత సామరస్యానికి ప్రసంగం కాదు.. లౌకికత్వానికి సజీవ సాక్ష్యం. ఇదే దక్కన్ గంగా-జమునా తెహజీబ్ అని చెప్పారు. మ్యూజియం పక్కనే ప్రవహించే ముసి నది అంటే హైదరాబాద్ జ్ఞాపకాల ప్రవాహం అని అన్నారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ముసి నదిని ప్రక్షాళన చేసి, లండన్ లోని థేమ్స్, పారిస్ లోని సీన్ నది తరహాలో అంతర్జాతీయ స్థాయి రివర్ ఫ్రంట్‌గా మార్చడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సలార్ జంగ్ మ్యూజియం కేవలం ఒక ఒంటరి భవనంగా కాకుండా.. అభివృద్ధి చెందిన మూసీ రివర్ ఫ్రంట్‌కు ఒక సాంస్కృతిక కిరీటంగా మారబోతోందన్నారు. పర్యాటకులు నది గుండా ప్రయాణిస్తూ, ఇక్కడి వారసత్వ వీధుల్లో నడుస్తూ, చారిత్రక కళాఖండాలను వీక్షించేలా ఒక అద్భుతమైన ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని అన్నారు. చార్మినార్, గోల్కొండ, కుతుబ్ షాహీ సమాధులు, చౌమహల్లా, ఫలక్‌నుమా ప్యాలెస్‌లతో కూడిన ఓల్డ్ సిటీ హెరిటేజ్ సర్క్యూట్‌ను సలార్ జంగ్ మ్యూజియంతో అనుసంధానిస్తామని అన్నారు. మెరుగైన రవాణా సౌకర్యాలు, నైట్ టూరిజం, తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో గైడెడ్ వాక్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వారసత్వం అనేది కేవలం గర్వపడటానికే కాదు.. స్థానిక గైడ్‌లు, కళాకారులు, హోటళ్లు, రవాణా రంగాల ద్వారా వేలాది మందికి జీవనోపాధి కల్పించడానికి ఉపయోగపడాలన్నారు. తెలంగాణలోని ఆదిలాబాద్ నుంచి ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్ వరకు ప్రతి విద్యార్థి ఈ మ్యూజియాన్ని సందర్శించి 'ఇది నా ఆస్తి' అనే ఆత్మవిశ్వాసాన్ని పొందాలన్నారు. మ్యూజియం అనేది నిశ్శబ్దంగా ఉండే ప్రదేశం కాకూడదన్నారు. మ్యూజియం అనేది ప్రశ్నలతో సజీవంగా ఉండాలి. ఇందుకోసం పాఠశాలలు, విశ్వవిద్యాలయాలతో ప్రత్యేక భాగస్వామ్యం కుదుర్చుకుంటామని చెప్పారు. హైదరాబాద్‌కు ఐటీ, బిజినెస్ పనుల మీద వచ్చే గ్లోబల్ ఇన్వెస్టర్లు కేవలం బోర్డ్‌రూమ్‌లకే పరిమితం కాకుండా.. కనీసం ఒక రోజు సలార్ జంగ్ మ్యూజియాన్ని సందర్శించి, చార్మినార్ వద్ద ఇరానీ చాయ్ తాగి ఇక్కడి సంస్కృతిని ఆస్వాదించాలని ఆయన కోరారు. మన బిర్యానీ, హలీమ్, చాయ్ కేవలం ఆహార పదార్థాలు కావు.. తెలంగాణ సాంస్కృతిక ఆర్థిక వ్యవస్థకు మూలస్థంభాలన్నారు. ఈ 75 ఏళ్ల ప్రయాణంలో మ్యూజియాన్ని కాపాడుకుంటూ వస్తున్న క్యూరేటర్లు, కన్సర్వేటర్లు, సెక్యూరిటీ, క్లీనర్లు, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కు డిప్యూటీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. మీరే హైదరాబాద్ జ్ఞాపకాలకు అసలైన కాపలాదారులు. సలార్ జంగ్-3 సేకరించిన ఈ అమూల్యమైన సంపదను మరింత ఆధునీకరించి, భవిష్యత్తు తరాలకు సగర్వంగా అందించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# ఖాకీ నీడలో కామాంధుడి ఘాతుకం

- వివాహితపై నాలుగేళ్లుగా ఎస్ఐ లైంగిక దాడి
- న్యాయం చేస్తానని నమ్మించి నరకం చూపించిన ఎస్ఐ రాజ్ కుమార్
- న్యూడ్ ఫోటోలతో బ్లాక్‌మెయిల్, రెండుసార్లు బలవంతపు అబార్షన్లు
- భరించలేక ఐజీకి బాధితురాలు ఫిర్యాదు
- హనుమకొండ పీఎస్‌లో కేసు నమోదు



**హనుమకొండ ప్రతినిధి జూన్ 14 (జనం సాక్షి) :** చట్టాన్ని కాపాడి బాధితులకు న్యాయం చేయాల్సిన ఒక పోలీస్ అధికారి, రక్షకుడే భక్షకుడిగా మారి ఓ వివాహిత జీవితాన్ని నరకప్రాయం చేశాడు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సీసీఎస్ విభాగంలో పని చేస్తున్న ఎస్ఐ గోదారి రాజ్ కుమార్ ఖాకీ అధికార బలంతో ఓ వివాహితపై నాలుగేళ్లుగా అరాచకానికి పాల్పడుతున్న ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడి వేధింపులను భరించలేక బాధితురాలు ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో ఈ దారుణం బయటపడింది. హనుమకొండకు చెందిన సదరు యువతికి 2018లో బీ-ఫార్మసీ చదువుతున్న సమయంలో స్థానిక యువకుడితో పరిచయమై పెళ్లి జరిగింది. వీరికి ఒక పాప కూడా ఉంది. అయితే, కొద్దిరోజుల తర్వాత దంపతుల మధ్య కుటుంబ కలహాలు రావడంతో, సదరు వివాహిత 2022 మార్చిలో హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో అదే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ గోదారి రాజ్ కుమార్ ఆమెకు పరిచయమయ్యాడు. నీకు న్యాయం చేస్తానని నమ్మబలికి, తనకు తెలిసిన ఒక న్యాయవాదితో ఆమె భర్త నుండి విడాకులు ఇప్పించాడు. ఆ తర్వాత సదరు వివాహితను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, లొంగదీసుకుని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఆమె రెండు సార్లు గర్భం దాల్చగా బలవంతంగా అబార్షన్లు చేయించాడు.



### న్యూడ్ ఫోటోలతో బ్లాక్‌మెయిల్.. హోటళ్లకు తీసుకెళ్లి దాడులు

బాధిత వివాహిత తన పెళ్లి విషయంపై ఎస్ఐ రాజ్ కుమార్‌ను గట్టిగా నిలదీయడంతో అతనిలోని అసలు స్వరూపం బయటపడింది. ఆమెకు సంబంధించిన న్యూడ్ ఫోటోలను చూపించి బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. అంతటితో ఆగక ఆమె పని చేసే చోటుకి ఫోన్ నంబర్ లొకేషన్ ద్వారా తెలుసుకుని వెళ్లి, అక్కడి నుండి బలవంతంగా హోటళ్లకు తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడేవాడు. ఆమె ఫోన్ నంబర్‌ను ట్రాక్ చేస్తూ నిరంతరం అనుమానిస్తూ వేధించేవాడు. ఈ నెల మొదటి వారంలో కూడా ఎస్ఐ రాజ్ కుమార్ బాధితురాలిని హనుమకొండలోని ఓ హోటల్‌కు తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడి, విచక్షణారహితంగా కొట్టాడు. దాంతో సదరు మహిళ "నన్ను వదిలిపెట్టేయ్.. నాకు ఒక పాప ఉంది, నా బతుకు నేను బతుకుతాను" అని కాళ్ల మీద పడి వేడుకున్నా ఆ కామాంధుడు కరగలేదు. "నిన్ను ఎవడు పెళ్లి చేసుకోకుండా చేస్తా.. జీవితాంతం నాతోనే లైంగికంగా ఉండాలి. లేదంటే నీ న్యూడ్ పిక్స్ బయటపెడతా" అంటూ తీవ్రంగా బెదిరించాడు.

### ఐజీని ఆశ్రయించిన బాధితురాలు.. కేసు నమోదు

ఎస్ఐ రాజ్ కుమార్ చేస్తున్న అరాచకాలను భరించలేక, ప్రాణభయంతో సదరు బాధిత మహిళ రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఐజీకి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం శనివారం భరోసా సెంటర్‌లో మహిళా పోలీస్ అధికారి బాధితురాలి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. అనంతరం కేసును హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు రిఫర్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు హనుమకొండ పీఎస్‌లో ఎస్ఐ రాజ్ కుమార్‌పై లైంగిక దాడి, బెదిరింపులు, చీటింగ్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు హనుమకొండ ఇన్స్‌పెక్టర్ మచ్చ శివ కుమార్ తెలిపారు.

### గతంలోనూ అవినీతి కేసులో సస్పెండ్

నిందితుడు ఎస్ఐ రాజ్ కుమార్ గతంలో ఎల్కతుర్తి పీఎస్‌లో పని చేసినప్పుడు అవినీతి కారణాల వల్ల సస్పెండ్ కూడా అయ్యాడు. న్యాయం కోసం వచ్చిన అభాగ్యురాలిని నమ్మించి, నాలుగేళ్లుగా కామవాంఛతో నరకం చూపించిన పోలీస్ అధికారి నిర్వాకం ఇప్పుడు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో తీవ్ర కలకలం సృష్టిస్తోంది.

# కరీంనగర్ చల్మెడ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- అధిక ఫీజులు వసూలు చేస్తున్న కాలేజీలపై కోర్టుకెళ్తాం
- మెడికో పేరెంట్స్ అసోసియేషన్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రభుత్వ జీవోలను లెక్క చేయకుండా ఉన్న కరీంనగర్‌లోని చల్మెడ కాలేజీపై ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మెడికో పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కాలేజీలపై కోర్టుకు వెళ్తామని హెచ్చరించింది. ఆదివారం హైదరాబాద్ బండ్లగూడలో నిర్వహించిన మెడికో పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఎంబీబీఎస్ బీ-కేటగిరీలో నాలుగున్నరేళ్లకు మాత్రమే ఫీజు తీసుకోవాలని ప్రభుత్వం, ఎఫ్ఆర్సీ స్పష్టం చేసినప్పటికీ... కొన్ని కాలేజీలు ఐదేళ్ల ఫీజు తప్పనిసరిగా చెల్లించాల్సిందేనని మొండిగా వేధిస్తున్నాయని రాష్ట్ర అధ్యక్షుడు మల్లోజు సత్య నారాయణాచారి తెలిపారు. ప్రభుత్వ జీవోలను లెక్కచేయని కరీంనగర్‌లోని చల్మెడ కాలేజీపై ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలేజీ వసూలు చేస్తున్న అధిక ఫీజులపై కోర్టుకు వెళ్తామని, అలాగే చల్మెడ యాజమాన్యంపై ఎన్ఎంసీకి సైతం ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. చల్మెడ కాలేజీ మొండి వైఖరికి నిరసనగా అతి త్వరలోనే పేరెంట్స్ అందరం కలిసి కరీంనగర్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేయాలని అసోసియేషన్ నిర్ణయించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నీట్ పరీక్షలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సమయం వృథా కాకుండా సంతకాలు, వేలిముద్రలు సైతం పరీక్ష సమయం ప్రారంభం కాకముందే తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య విద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆహార సౌకర్యాలు కొరవడ్డాయని, హాస్టళ్లలో కనీస శానిటేషన్ లేక అనేక సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారని విమర్శించారు. పలు కాలేజీలలో సిలబస్ పూర్తికాకుండానే పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, దీనికోసం అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలను కలుస్తారని అధ్యక్షుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రమేష్ పొడిశెట్టి, సంయుక్త కార్యదర్శి వెంకట్రావు, పత్రీ యాదగిరి, ఉపాధ్యక్షురాలు సుజాత, శ్రీనివాస్ గౌడ్, రవీందర్ రెడ్డి, సంధ్య, చంద్ర శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రేఖ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగాల భర్తీకే వరుస నోటిఫికేషన్లు

- 'వార్షిక-2025' పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నిరుద్యోగ యువత ఆశలకు అనుగుణంగానే ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం వరుస నోటిఫికేషన్లు జారీ చేయబోతోందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ప్రచురించిన పోటీ పరీక్షల ప్రత్యేక పుస్తకం 'వార్షిక 2025'ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ పుస్తకానికి సంపాదకత్వం వహించిన బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ యువతను విజేతలుగా నిలిపేందుకు, 'మేధో తెలంగాణ' సాధన దిశగా ప్రభుత్వం ఉచిత శిక్షణతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులోకి తెస్తోందన్నారు.

# డిప్యూటీ సీఎం ఆరోపణల్లో వాస్తవం లేదు

- అసత్య ప్రచారంతో కార్మికులను మోసం చేయలేరు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 14 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రాబందుల పాలన కొనసాగిస్తుందని అసత్య ప్రచారలతో కార్మికులను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాజీ శాసనసభ్యులు దివాకర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ 27 నెలల పాలనలో దోపిడీలో రికార్డు బ్రేక్ చేసిందని ఆయన పేర్కొన్నారు .పదేళ్ల బిఆర్ఎస్ పరిపాలనలో కార్మికులకు ఎంతో న్యాయం జరిగిందని ఆయన తెలిపారు కానీ కాంగ్రెస్ మంత్రులు డిప్యూటీ సీఎం అనవసర అసత్య ప్రచారాలు బిఆర్ఎస్ పార్టీ పైన చేసిన కార్మికులు నమ్మరని తెలిపారు . 2023 24 లో సింగరేణి కార్మికుల లాభాల వాటా బోనస్ 33% ప్రకటించిందని గుర్తు చేశారు .ప్రమాదవశాత్తు కార్మికుడు గనిలో మృత్యువాత గురైతే కోటి రూపాయల ఇన్సూరెన్స్ ఇచ్చింది బిఆర్ఎస్ హయాంలోనే అని తెలిపారు .ఎన్నికల వాగ్దానాలలో కారుణ్య నియామకాలు హామీ ఇచ్చి 30 నెలల నుండి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు . ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన హామీ మేరకు కారుణ్య నియామకాలు ఇవ్వకుండా 30 నెలల నుండి ఏమి చేశారో తెలపాలని డిమాండ్ చేశారు .కాంగ్రెస్ ప్రభుత్వం నాయకులు మట్టి కుప్పలను బొగ్గు కుప్పలుగా చూపుతూ కాలం వెళ్లబుచ్చుతుందని పేర్కొన్నారు .రాజస్థాన్ సోలార్ పేరిట కొత్త దోపిడీకి తెరదీసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వపైన కార్మికులు ఆగ్రహంగా ఉన్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో మంచిర్యాల మాజీ శాసనసభ్యులు దివాకర్ రావు బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య, టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, సురేందర్ రెడ్డి బిఆర్ఎస్ రాష్ట్ర యూత్ నాయకులు విద్యుత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370